
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

ఏఐ.. పార్కింగ్ ఎక్కడోయ్

షాపింగ్ కోసం కోఠి వెళ్లారు. అదసలే బిజీ ఏరియా.. ఫుల్ ట్రాఫిక్.. కారు పార్క్ చేయడానికి స్థలం లేదు. దగ్గరలో ఎక్కడ పార్కింగ్ ఉందో తెలియదు. రోడ్డు పక్కనే పార్క్ చేస్తే.. ట్రాఫిక్‌కు అంతరాయం. పోలీసుల కంట్లో పడితే ఫైన్ కట్టక తప్పదు. అదే ఓ యాప్ ఉండి, దగ్గరలో పార్కింగ్ ఎక్కడుందో తెలిస్తే..? అదీ పార్కింగ్ స్లాట్ బుక్ చేసుకుని, నేరుగా వెళ్లి పార్క్ చేసే సుకోగలిగితే..? ఈ తిప్పలన్నీ తప్పుతాయి కదా. బిజీ ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాల ఏర్పాటుతోపాటు ఇలాంటి వెసులుబాట్లు తెస్తే.. వాహనదారులకు ప్రయోజనం కలుగుతుంది. ట్రాఫిక్ చిక్కులకు చెక్ పడుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ తరహా ఏర్పాట్లపై 'ఈజీపార్క్ ఏఐ' అనే సంస్థ ఇటీవల ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రజెంటేషన్ కూడా ఇచ్చింది. ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో పార్కింగ్ సమస్యను పరిష్కరించవచ్చని ప్రతిపాదన చేసింది.



నగరంలో పార్కింగ్ సమస్యకు కృత్రిమ మేధతో చెక్

రాష్ట్ర ప్రభుత్వానికి 'ఈజీపార్క్ ఏఐ' సంస్థ ప్రతిపాదనలు

ఎక్కడెక్కడ పార్కింగ్ స్థలాలు ఉన్నాయో తెలిపేలా ప్రత్యేక యాప్

పార్కింగ్ స్లాట్ బుకింగ్, ఆన్‌లైన్ పేమెంట్ వెసులుబాట్లు కూడా..

వాహనదారుల కష్టాలు తీరడంతో పాటు ట్రాఫిక్ అంతరాయాలకూ చెక్

సాక్షి, హైదరాబాద్

గ్రేటర్ నగరం ఇప్పటికే వాహనాలతో కిక్కిరిసిపోయింది. ఏటా పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. అవన్నీ రోడ్లపై తిరగడం సంగతి పక్కనపెడితే.. ఎక్కడో ఓ చోట పార్క్ చేయక తప్పదు. షాపింగ్ కోసం వెళ్లినా, ఏదైనా పని మీద వెళ్లినా.. పార్కింగ్ కోసం తిప్పలే. కార్లే కాదు బైకులు పెట్టడానికీ ఎక్కడా స్థలం లేని దుస్థితి. దీనితో షాపుల ముందు, రోడ్ల పక్కన, గల్లీల్లో వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీనితో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం సమస్యగా మారుతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ ఇబ్బంది మరింత ఎక్కువగా ఉంటోంది. పర్యాటక ప్రదేశాలు, ఆలయాలు, సాయంత్రాలు ఆహ్లాదంగా గడపడానికి వెళ్లే చోట్ల పార్కింగ్ పెద్ద ప్రహసనంగా మారింది.

మల్టీలెవల్ పార్కింగ్‌తో..

అలాగే హైదరాబాద్‌లో భూముల విలువలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికితోడు ప్రధాన ప్రాంతాల్లో స్థలాలకు కొరత ఉండటంతో.. మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇలా ఏర్పాటు చేసినా.. అవి ఎక్కడున్నాయో అందరికీ తెలిసే అవకాశం తక్కువ. తెలిసినా పార్కింగ్ ఖాళీగా ఉందో లేదో తెలియదు. అక్కడిదాకా వెళ్లి ఖాళీ లేకుంటే.. మళ్లీ మరోచోటికి వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలోనే పార్కింగ్ ఖాళీగా ఉందో, లేదో తెలిసి.. ముందే స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉంటే బాగుంటుందన్న ఆలోచనతో 'ఈజీపార్క్ ఏఐ' అనే సంస్థ ముందుకొచ్చింది. ఇటీవల దీనిపై రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రజెంటేషన్ కూడా ఇచ్చింది.

ఎలా పనిచేస్తుంది..

కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సాయంతో పార్కింగ్ సమస్యను పరిష్కరించే విధానాన్ని ఈజీపార్క్ ఏఐ సంస్థ రూపొందించింది. ఆ వివరాల మేరకు.. పార్కింగ్ స్థలం నిర్వహించే వారికి ఒక డాష్ బోర్డు ఏర్పాటు చేస్తారు. వాహనాలు ఎన్ని వస్తున్నాయి? ఆక్యుపెన్సీ ఎంత ఉంది? ఎంతసేపు వాహనాలు పార్క్ చేస్తారన్న డేటాను దాని ద్వారా అందిస్తుంది. అలా అన్ని పార్కింగ్ స్థలాల వివరాలను ఒకచోట క్రోడీకరిస్తుంది. ఈ వివరాలను ఓ యాప్ సాయంతో వాహనదారులకు అందుబాటులో ఉంచుతుంది. ఈ యాప్ ద్వారా ఎక్కడెక్కడ పార్కింగ్ స్థలాలు అందుబాటులో ఉన్నాయనేది తెలుస్తుంది. ముందుగానే పార్కింగ్ స్లాట్లను బుక్ చేసుకుని, నేరుగా వెళ్లి పార్క్ చేసుకోవచ్చు. పార్కింగ్ ఫీజును కూడా ఆన్‌లైన్ ద్వారానే చెల్లించేయొచ్చు. ఒకవేళ ఆ ప్రాంతానికి వెళ్లకపోతే.. స్లాట్‌ను క్యాన్సిల్ చేసుకోవచ్చు.

వాహనాలు వెళ్లిపోయి పార్కింగ్ స్లాట్లు ఖాళీ అయితే.. వెంటనే యాప్‌లో అప్‌డేట్ అయి ఖాళీగా చూపిస్తుంది. కావాల్సిన వారు బుక్ చేసుకోవచ్చు. పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు బయటికి వెళ్లడం, లోపలికి రావడం ప్రత్యేక పరికరాలతో నమోదవుతూ ఉంటుంది. ఆటోమేటిగ్గా వాటి నంబర్లను గుర్తించి అప్‌డేట్ చేసే వ్యవస్థ ఉంటుంది.

పార్కింగ్ ప్రదేశాల్లో ఇంటర్నెట్ ఆధారిత కెమెరాలతో నిఘా ఉంటుంది. వాహనానికి సంబంధించిన అలర్ట్స్ వస్తాయి. దొంగతనం, మరేదైనా జరిగితే వెంటనే అప్రమత్తం చేసే ఏర్పాట్లు ఉంటాయి.

భవనాల్లో పార్కింగ్ సరిగా లేక..

హైదరాబాద్‌లో 80 లక్షలకుపైగా వాహనాలు ఉన్నాయి. కార్లు, టూ వీలర్లతోపాటు విద్యాసంస్థల వాహనాలు, ఆటోలు వంటివీ భారీగా ఉన్నాయి. ఇందులో కార్లు, టూవీలర్ల పార్కింగ్ కోసం ఇబ్బంది వస్తోంది. ట్రాఫిక్‌లో ఎలాగోలా గమ్యస్థానానికి చేరుకున్న వాహనదారులకు పార్కింగ్ విషయంలో తిప్పలు తప్పట్లేదు. పార్కింగ్‌కు అనుగుణంగా భవన నిర్మాణాలు చేపట్టకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణమని నిపుణులు చెప్తున్నారు.



పార్కింగ్ సమస్యపై జనమేమంటున్నారు..

II లో

మీల్‌లెట్స్

మిల్లెట్ మీల్‌తో ఆరోగ్యం..



చిరుధాన్యాలకు పెరిగిన డిమాండ్

వంటలపై నగరవాసుల ఆసక్తి

మార్కెట్‌లోకి వివిధ రకాల ఉత్పత్తులు

పంట పాతదే.. వంటే కొత్తది..

అందుబాటులో రెడీ–టు ఈట్, రెడీ–టు కుక్

వివరాలు 11లో



వెదర్ మ్యాన్

ఇంటి డాబానే ప్రయోగశాలగా..

వర్షం రాకను ముందే పసిగడుతున్న బీటెక్ స్టూడెంట్

విద్యార్థులు, ఉద్యోగులకు వానరాకపై అప్‌డేట్స్

మేఘాలను చూస్తే అదో ఆనందం

'సాక్షి'తో తెలంగాణ వెదర్‌మ్యాన్ బాలాజీ

11 లో



హైదరాబాదీలను బెంబేలెత్తిస్తున్న శబ్ద కాలుష్యం

78 డెసిబెల్స్‌తో దేశంలోనే ఐదో స్థానంలో భాగ్యనగరం

నివాస ప్రాంతాల్లోనే ఎక్కువగా వినిపిస్తున్న రణగొణ ధ్వనులు

పరిమితికి మించి 10-20 డెసిబెల్స్ అధికంగా నమోదవుతున్న శబ్ద తీవ్రత

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తాజా నివేదికలో వెల్లడి

వాహనాలు, డీజేలు, అనవసర హారన్లే ప్రధాన కారణం

అధిక శబ్దాలతో పిల్లలు, వృద్ధుల్లో వినికిడి సమస్యలు.. పెద్దల్లో బీపీ, గుండె జబ్బులకు చాన్స్

చెవుల్లో రీసౌండ్

ఓవైపు వాహనాల రొద.. హారన్ల మోత. మరోవైపు భవన నిర్మాణ చప్పుళ్లు, డీజేలు, లౌడ్‌స్పీకర్ల హోరు.. వెరసి రోజురోజుకూ భాగ్యనగరంలో శబ్ద కాలుష్యం పెరిగిపోతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) తాజా నివేదిక ప్రకారం 78 డెసిబెల్స్ శబ్ద కాలుష్యంతో హైదరాబాద్ దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీ పీసీబీ) గణాంకాల ప్రకారం నగరంలో పగలు 55 డెసిబెల్స్, రాత్రి 45 డెసిబెల్స్ లోపు శబ్దాలు ఉండాల్సి ఉంది. కానీ పరిమితికి మించి 10 నుంచి 20 డెసిబెల్స్ శబ్ద తీవ్రత అధికంగా నమోదవుతోంది. వాణిజ్య, పారిశ్రామికవాడలతో పోలిస్తే నివాస, సున్నిత ప్రాంతాల్లోనే రణగొణ ధ్వనులు పగలూరాత్రి అనే తేడా లేకుండా వెలువడుతున్నాయి. దీంతో ఇప్పటికే వాయు కాలుష్యంతో అనారోగ్యాల బారినపడుతున్న నగరవాసులను కొంతకాలంగా శబ్ద కాలుష్యం వల్ల కలిగే దుష్ప్రభావాలు కూడా వెంటాడుతున్నాయి.

సాక్షి, హైదరాబాద్

ఉదాహరణకు..

- రెసిడెన్షియల్ జోన్ అయిన జూబ్లీహిల్స్‌లో ఏప్రిల్‌లో పగలు 68.71 డెసిబెల్స్ శబ్ద తీవ్రత నమోదవగా రాత్రివేళ 71.36 డీబీ నమోదైంది.
- పారిశ్రామిక ప్రాంతమైన సనత్‌నగర్‌లో ఉదయం 66.40 డెసిబెల్స్‌గా ఉంటే రాత్రిపూట 66.58 డీబీగా ఉంది.
- వాణిజ్య ప్రాంతమైన జేఎన్‌టీయూ వద్ద పగలు 67.76 డీబీ ఉండగా.. రాత్రివేళ 67.57 డీబీ నమోదైంది. అలాగే సున్నిత ప్రాంతమైన జూపార్క్ వద్ద ఉదయం 56.88 డీబీ నమోదవగా.. రాత్రిపూట 52.20గా రికార్డయింది.

కారణాలు అనేకం..

- భారీ ట్రక్కులు, వాహనాల డ్రైవర్ల నిరంతరం హారన్లు మోగించడం
- ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాల మోత
- 15 ఏళ్లకు మించిన వాహనాలు రోడ్లపై తిరుగుతుండటంతో వాటి నుంచి వచ్చే అధిక శబ్దాలు.
- నివాసిత ప్రాంతాల్లో ఫంక్షన్ హాళ్ల నుంచి లౌడ్ స్పీకర్లు, డీజేల హోరు.
- నివాస ప్రాంతాల్లో ఫంక్షన్ హాళ్లు, పబ్బుల ఏర్పాటుతో డప్పులు, డీజే సౌండ్లు
- భవన నిర్మాణాల కోసం తవ్వకాలు, బ్లాస్టింగ్‌లు, బోర్ల తవ్వకం, భారీ కాంక్రీట్ మిక్సింగ్ యంత్రాల వినియోగం.
- పరిశ్రమల కోసం జనరేటర్ల వినియోగం.

శబ్ద కాలుష్యంతో చుట్టుముట్టే అనారోగ్యాలు ఇవే..


- పరిమితికి మించి శబ్దాల విడుదలతో గుండె స్పందనల్లో భారీగా హెచ్చుతగ్గులు, అధిక రక్తపోటు.
- తలనొప్పి, చికాకుతోపాటు నిద్రలేమి, అలసట
- గుండెజబ్బులు, చెవుడు కూడా రావచ్చు.
- పిల్లల్లో కర్ణభేరిలో సూక్ష్మనాడులు దెబ్బతినే ప్రమాదం. వృద్ధులకు వినికిడి శక్తి తగ్గిపోయే అవకాశం.
- మానసికంగా, శారీరకంగా కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం.
- వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లకు ఏకాగ్రత దెబ్బతిని రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

ప్రభుత్వ విభాగాలు విఫలం..



నగరంలో పరిమితికి మించి నమోదవుతున్న శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో తెలంగాణ కాలుష్య నియంత్ర మండలి (టీజీ పీసీబీ), ట్రాఫిక్ పోలీసులు, రవాణా, మున్సిపల్ శాఖలు విఫలమవుతున్నాయి. ఇతర నగరాల్లో 'నో హాంకింగ్ క్యాంపెయిన్' నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తుండగా మన నగరంలో ఈ తరహా కార్యక్రమాల ఊసే లేదు. భారీ శబ్దం చేసే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించడానికి పరిమితమవుతున్నారు తప్పితే వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం లేదు. వాహనాల నుంచి వెలువడే అధిక శబ్దాలు, అక్రమ ఎయిర్ హారన్‌లను గుర్తించి జరిమానాలు విధించేందుకు పోలీసులు నగరంలోని ప్రధాన మార్గాల్లో నాయిస్ డిటెక్షన్ ఉపకరణాలు ఏర్పాటు చేసినా వాటి నిర్వహణ లేక అలంకారప్రాయంగా మారాయి.

పీసీబీ నిర్దేశిత శబ్ద తీవ్రత (డెసిబెల్స్‌లో)	సమయం	నివాస ప్రాంతం	వాణిజ్యం ప్రాంతం	పారిశ్రామిక ప్రాంతం	సున్నిత ప్రాంతం
	పగలు	55	65	75	50
	రాత్రి	45	55	70	40



నగరంలోని పలు ప్రాంతాల్లో శబ్ద తీవ్రత ఇలా (డెసిబెల్స్‌లో)

	జనవరి-24		ఫిబ్రవరి		మార్చి		ఏప్రిల్	
ప్రాంతం	పగలు	రాత్రి	పగలు	రాత్రి	పగలు	రాత్రి	పగలు	రాత్రి
జూబ్లీహిల్స్	78.52	79.83	76.25	78.57	75.81	73.81	68.71	71.36
తార్నాక	60.33	56.38	60.26	53.91	59.14	50.14	59.12	58.36
అబిడ్స్	65.48	68.80	61.21	61.98	72.98	64.46	51.24	49.98
జేఎన్‌టీయూ	68.40	66.18	68.33	66.62	67.60	65.74	67.76	67.57
ప్యారడైజ్	73.57	74.62	74.56	75.42	74.74	76.76	71.09	72.25
సనత్‌నగర్	56.06	52.03	64.47	64.49	54.37	50.73	66.40	66.58
జీడిమెట్ల	67.51	68.94	67.23	67.28	70.77	69.95	71.29	72.26
జూపార్క్	59.12	50.85	52.95	50.14	50.71	49.49	56.88	52.20
హెచ్‌సీయూ	61.68	61.84	59.54	57.43	58.25	56.56	60.10	60.32

పార్కింగ్ సమస్యపై జనం ఏమంటున్నారు?

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో పార్కింగ్ సమస్యను పరిష్కరించడంపై ఫోకస్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఓ సమీక్ష సందర్భంగా ప్రకటించారు. 'ఈజీపార్క్‌ఏఐ' సంస్థ ప్రజెంటేషన్ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఐటీని వినియోగించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐటీ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు కూడా.

ఎక్కడికెళ్లినా పార్కింగ్‌కు ఇబ్బందే..



హైదరాబాద్‌లో, ముఖ్యంగా బిజీ ఏరియాల్లో పార్కింగ్ చేయాలంటే చాలా కష్టంగా ఉంటోంది. చాలాసేపు వెతికితే కానీ బండి పెట్టుకోవడానికి ప్లేస్ కనబడటం లేదు. చాలా షాపింగ్ కాంప్లెక్స్‌లలో పార్కింగ్ ఉండట్లేదు. అంతా రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. అది ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతోంది.


- నరేశ్‌గౌడ్ లోడి, అంబర్‌పేట

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



హైదరాబాద్‌లో పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. పార్కింగ్ విషయంలో ప్రభుత్వం సరైన పాలసీ రూపొందించాలి. షాపింగ్ కాంప్లెక్స్‌లు, దుకాణాలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలి. అప్పుడే నగరవాసులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

- కల్యాణ్, దిల్‌సుఖ్‌నగర్



'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 99

SUNDAY Special | ఆదివారం 30-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సైనిక విన్యాసాల్లో తీవ్ర విషాదం

యుద్ధట్యాంకుతో నది దాటుతుండగా హఠాత్తుగా వరద పోటెత్తడంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీఓ) ముత్తముల రామకృష్ణారెడ్డి సహా ఐదుగురు జవాన్లు మృత్యువాత పడ్డారు. - 6లో



భారత్ 603/6 డిక్లేర్డ్

మహిళల టెస్టు క్రికెట్‌లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. దక్షిణాఫ్రికాతో చెన్నైలో జరుగుతున్న టెస్టులో రెండో రోజు భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 6 వికెట్లకు 603 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. - 14లో

న్యూస్‌రీల్

గ్రేటర్‌లో కంటోన్మెంట్ సివిల్ ఏరియాల విలీనం



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌వాసుల చిరకాల కోరిక నెరవేరింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

- వివరాలు 2లో

మీ విచారణలో నిష్పాక్షికత లేదు



మీ విచారణలో నిష్పాక్షికత లేదని, నిరాధారమైన ఆరోపణలకు ఊతమిచ్చేలా వ్యవహరించడం బాధాకరమంటూ కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కమిషన్ ఉద్దేశాలను తప్పుబడుతూ ఒక లేఖ రాశారు.

- వివరాలు 2లో

ఆపరేషన్ ముస్కాన్‌కు సమాయత్తం



బాలకార్మికులు, వెట్టిచాకిరీ, యాచన చేసే చిన్నారులు, అదృశ్యమైన బాలలను గుర్తించేందుకు ఆపరేషన్ ముస్కాన్ పేరిట జూలై 1 నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. తప్పిపోయిన చిన్నారుల జాడ కనిపెట్టేందుకు 'దర్పణ్' పరిజ్ఞానాన్ని ఈ డ్రైవ్‌లో వినియోగించనున్నారు.

- వివరాలు 16లో



కసితీరా కొట్టారు

టి20 ప్రపంచకప్ విజేత భారత్... ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం

భారత్ 176/7

దక్షిణాఫ్రికా 169/8

ఎన్నో మలుపులు, మరెన్నో ఉత్కంఠభరిత క్షణాలు... టైటిల్ వేటలో దక్షిణాఫ్రికా వేగంగా దూసుకుపోతోంది... 30 బంతుల్లో 30 పరుగులు, చేతిలో 6 వికెట్లతో సునాయాసంగా గెలిచే స్థితిలో నిలిచింది. తర్వాత ఓవర్లో బుమ్రా 4 పరుగులే ఇవ్వగా సమీకరణం 24 బంతుల్లో 26 పరుగులుగా మారింది. క్లాసెన్, మిల్లర్‌లాంటి హిట్టర్లు ఉండటంతో భారత్ ఆశలు కోల్పోయింది. కానీ పాండ్యా వేసిన తర్వాతి ఓవర్లో మ్యాజిక్ మొదలైంది. తొలి బంతికే క్లాసెన్ వెనుదిరగ్గా... 18 బంతుల్లో 10 పరుగులే వచ్చాయి. కథ క్లైమాక్స్‌కు చేరింది. 6 బంతుల్లో 16 పరుగులు కావాలి. మిల్లర్ ఉండటంతో ఆందోళన పూర్తిగా తొలగిపోలేదు. కానీ పాండ్యా వేసిన తొలి బంతికే బౌండరీ వద్ద సూర్యకుమార్ అత్యద్భుతమైన క్యాచ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అంతే... తర్వాతి ఐదు బంతులు లాంఛనమే అయ్యాయి... భారత్ ప్రపంచ విజేతగా హోరెత్తే సంబరాల్లో మునిగిపోయింది.

వివరాలు 14లో

కాంగ్రెస్ సీనియర్ నేత

డీఎస్ కన్నుమూత

శనివారం తెల్లవారుజామున ధర్మపురి శ్రీనివాస్‌కు గుండెనొప్పి



- ఆస్పత్రికి తరలిస్తుండగానే తుదిశ్వాస
- పీసీసీ చీఫ్‌గా, మంత్రిగా మంచి పనితీరు
- డీఎస్ మృతిపట్ల ప్రధాని సహా ప్రముఖుల దిగ్భ్రాంతి
- నిజామాబాద్‌కు పార్థివ దేహం తరలింపు
- నేటి మధ్యాహ్నం అక్కడే అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రులు, ఇతర నేతలు
- డీఎస్‌కు కాంగ్రెస్ ఘన నివాళి.. పార్థివదేహంపై పార్టీ జెండా... గాంధీభవన్‌లో పార్టీ పతాకం అవనతం

- వివరాలు 3లో

రాథోడ్ రమేశ్ హఠాన్మరణం

అనారోగ్యంతో కన్నుమూసిన బీజేపీ నేత



- అర్ధరాత్రి అస్వస్థతకు గురైన రాథోడ్.. ఆదిలాబాద్ ఆస్పత్రిలో చేరిక...
- పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా తుదిశ్వాస
- సంతాపం వ్యక్తం చేసిన ప్రముఖులు.. నేడు ఉట్నూర్‌లో అంత్యక్రియలు

- వివరాలు 3లో



శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్కతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మరో హైదరాబాద్‌గా వరంగల్

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి.. ఇక నుంచి వరంగల్‌పై ప్రత్యేక ఫోకస్: సీఎం రేవంత్

- హైదరాబాద్‌లో చేపడుతున్న కొత్త పద్ధతులు అమలుచేస్తాం
- త్వరలోనే వరంగల్‌కు కొత్త మాస్టర్‌ప్లాన్–2050
- రింగ్ రోడ్డుకు, మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు భూసేకరణ చేస్తాం
- నగరం అభివృద్ధికి రూ.6,115 కోట్లు అవసరమని అంచనా
- మహా నగర పాలక సంస్థ అభివృద్ధిపై సమీక్ష సమావేశం
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అంచనాల పెంపుపై సీఎం సీరియస్

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతి పెద్దదైన వరంగల్ మహానగరాన్ని.. హైదరాబాద్‌తో పోటీపడేలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వరంగల్ సమగ్రాభివృద్ధిపై తాను ప్రత్యేక ఫోకస్ పెడతానన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా శనివారం మధ్యాహ్నం వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని మిగతా 2వ పేజీలో ▶

తెలుగు అధికారికి ఎస్‌బీఐ పగ్గాలు



- కొత్త చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి
- తాజాగా ప్రతిపాదించిన ఎఫ్‌ఎస్‌ఐబీ

వర్షాలకు కూలిన రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్ పైకప్పు

- వివరాలు 6లో

మీరు సస్పెండ్ చేస్తారా... నేను చేయాల్నా?

ధరణి దరఖాస్తుల పరిష్కారంలో క్షేత్రస్థాయి నిర్లిప్తత ఎందుకు?



- 10 రోజుల్లో సరైన పద్ధతిలో పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటాం
- దరఖాస్తు పరిష్కారానికి, మాన్యువల్ రికార్డుకు లింకు పెడితే సస్పెండ్ చేయండి
- ధరణి దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: 'ఒక జిల్లాలో పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులు 800 వరకు ఉన్నాయి. కానీ, గత నెల రోజుల నుంచి 30 అప్లికేషన్లు కూడా ప్రాసెస్ చేయలేదు. క్షేత్రస్థాయి అధికారులు ఏం చేస్తున్నట్టు? ధరణి పోర్టల్ కింద వ్యవసాయ భూముల సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రాధాన్యత అని చెబుతున్నా క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు ఎందుకు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. సరిగా పనిచేయని అలాంటి అధికారులను మీరు సస్పెండ్ చేయండి... లేదంటే నేనే సస్పెండ్ చేస్తా'అని శనివారం జిల్లా కలెక్టర్లతో జరిగిన మిగతా 15వ పేజీలో ▶

'రింగు' భూసేకరణలో వందల ఎకరాలు మిస్!

అలైన్‌మెంట్ పరిధిలోనే ఉన్నా వివరాల నమోదు మరిచిన అధికారులు

- భూపరిహారం చెల్లింపు వేళ 460 ఎకరాలు మిస్ అయినట్లు తాజాగా గుర్తింపు
- వాటికి మళ్లీ భూసేకరణ గెజిట్ నోటిఫికేషన్లు జారీ



సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు అవసరమైన భూసేకరణలో రెవెన్యూ అధికారులు 460 ఎకరాలను మరిచిపోయారు. అలైన్‌మెంట్ పరిధిలోని ఆ భూమిని భూసేకరణ జాబితాలో చేర్చకుండానే పరిహారం పంపిణీ అవార్డులు పాస్ చేసే కసరత్తు చేపట్టారు. విషయం తెలిసి ఇప్పుడు ఆ మరిచిపోయిన భూమిని సేకరించేందుకు హడావుడి మొదలుపెట్టారు. అందుకు అవసరమైన గెజిట్ నోటిఫికేషన్లను జారీ చేశారు. మిగతా భూసేకరణకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ల తంతు పూర్తి చేసిన 8 నెలల తర్వాత ఇప్పుడు మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్



సాక్షి, హైదరాబాద్: జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త చట్టాలపై ప్రాసిక్యూషన్ డిపార్ట్‌మెంట్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ సూచించారు. రాష్ట్రంలో కొత్త క్రిమినల్ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాలతో కూడిన ప్రత్యేక హ్యాండ్ బుక్ 'సమాహార'అనే మొబైల్ అప్లికేషన్‌ను రాష్ట్ర ప్రాసిక్యూషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ వైజయంతితో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జితేందర్ అధికారులను అభినందించారు. మారిన చట్టాలు, సెక్షన్లు, శిక్షలు సహా పూర్తి వివరాలతో కూడిన సమగ్ర హ్యాండ్‌బుక్‌ను రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ డిపార్ట్‌మెంట్ హ్యాండ్‌బుక్ రూపంతో అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ ప్రాసిక్యూషన్స్ డిపార్ట్‌మెంట్ మూడు ప్రధాన క్రిమినల్ చట్టాలను వివరిస్తూ వాటి అమలుకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను ఈ హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచింది. కార్యక్రమంలో ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ పూజలు



అభిమానులకు పవన్‌కల్యాణ్ అభివాదం

జగిత్యాల: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మధ్యాహ్న సమయంలో వచ్చిన ఆయన గంటకు పైగా ఆలయంలో గడిపారు. పూజలు నిర్వహించి తిరిగి పయనమయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పవన్ కల్యాణ్‌ను కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుసూదన్ పూలమొక్కలు అందజేశారు. కొండగట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ శేషవస్త్రం, స్వామివారి చిత్రపటం అందించి సత్కరించారు.

ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కేసీఆర్ పాట్లు: యెన్నం

సాక్షి, హైదరాబాద్: తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పడరాని పాట్లు పడుతున్నారని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తన పార్టీ ఎమ్మెల్యేలను ఫాంహౌస్‌కు రమ్మని కేసీఆర్ పిలుస్తుంటే.. వారెవరూ రాకుండా నేరుగా ఢిల్లీ వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయన శనివారం అసెంబ్లీ మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ రూ.7లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించిన కేసీఆర్ తెలంగాణ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని వ్యాఖ్యానించారు.





వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, రాజనర్సింహ, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు



కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎం రేవంత్, మంత్రి సురేఖ. చిత్రంలో సీతక్క, పొంగులేటి, కొండా మురళి తదితరులు

మరో హైదరాబాద్‌గా వరంగల్

▶ మొదటి పేజీ తరువాయి

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు చేరుకున్న ఆయనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం పలికారు. ముందుగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం టెక్స్‌టైల్ పార్కును పరిశీలించాక రోడ్డు మార్గంలో నగరానికి చేరుకుని నిర్మాణంలో ఉన్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్‌లో వరంగల్ మహానగర పాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి రేవంత్ సుదీర్ఘంగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్డు నిర్మాణం, స్మార్ట్‌సిటీ పనులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం పరిస్థితి, కాళోజీ కళాక్షేత్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తదితర వరంగల్ నగరాభివృద్ధికి సంబంధించి 8 అంశాలపై సుమారు మూడు గంటల పాటు చర్చించారు.

తక్షణమే రింగ్‌రోడ్డుకు భూసేకరణ

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మొదట రింగ్ రోడ్డు నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ రెండు దశల్లో 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగ్ రోడ్డు నిర్మాణానికి సత్వరమే భూ సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఆ తర్వాతే నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. వరంగల్ నుంచి ఇతర జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా జాతీయ రహదారుల కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని, నాలాల ఆక్రమణపై దృష్టి సారించాలని, నాలాల్లో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని నిర్దేశించారు. హైదరాబాద్‌లో చేపడుతున్న కొత్త పద్ధతులను వరంగల్‌లోనూ చేపట్టాలని, అక్కడ వరదలు వచ్చినప్పుడు ఏ చర్యలు తీసుకుంటున్నారో ఇక్కడ కూడా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై సమగ్ర నివేదిక (డీపీఆర్) తయారు చేయాలన్నారు.

మహిళా సంఘాలు మరింత బలోపేతం

వరంగల్ నగరాభివృద్ధికి రూ.6115 కోట్ల నిధులు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందో లేదో తెలుసుకోవాలన్నారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, సెప్టెంబర్ 9 నాటికి పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో ఆపరేషన్లు ఇతర వైద్య సేవలకు నిమ్స్‌లో అందిస్తున్నట్లుగా ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్‌ఓసీ ఇచ్చే అంశంపై పరిశీలన జరుపుతామని చెప్పారు. రాష్ట్రంలో స్వశక్తి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్కూల్ విద్యార్థుల యూనిఫాంలకు సంబంధించిన పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించే విషయమై చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు. ఇందిరా మహాశక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో వరంగల్ అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం స్వశక్తి మహిళలకు రూ.518.71 కోట్ల చెక్కును సీఎం అందజేశారు. తర్వాత హంటర్‌రోడ్డులో మెడికవర్ ప్రైవేట్ ఆస్పత్రిని ప్రారంభించి హైదరాబాద్‌కు బయలుదేరారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రేవంత్ మొదటిసారిగా వరంగల్‌లో పర్యటించారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, ఎంపీలు బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ప్రభుత్వ కార్యదర్శులు రోనాల్డ్‌రోస్, క్రిస్టియానా, జిల్లా కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదదేవి, సీపీ అంబర్ కిషోర్ ఝాతోపాటు పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

'సూపర్ స్పెషాలిటీ'పై సీఎం సీరియస్

వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల అంచనా వ్యయం ఎందుకు పెరిగింది? అని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. 'ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిన పనులు చేపడుతున్నందున అలా పెంచే వీలులేదు. రూ.1,100 కోట్లను ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,726 కోట్లకు పెంచారు. రూ.626 కోట్లు ఎలా పెంచుతారు? దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు?' అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల విలువ అంచనాల పెంపుపై ప్రత్యేక రిపోర్టు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను 2050 సంవత్సరం వరకు డిజైన్ చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రి లాగా వరంగల్‌లోనూ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వినతిపత్రాలు తీసుకోకుండానే..

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్షకు వచ్చిన సీఎంను కలిసి వినతిపత్రాలు ఇచ్చేందుకు ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సుమారు మూడు గంటలపాటు సమీక్ష సాగటంతో జనం వేచి ఉన్నారు. ఈ క్రమంలో జోరువాన రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భద్రతా కారణాలతో సిబ్బంది లోనికి కూడా అనుమతించలేదు. సమావేశం ముగిశాక బయటికి వచ్చిన రేవంత్ నేరుగా బస్సు ఎక్కారు. సీఎంకు వినతిపత్రాలు చూపిస్తూ బస్సు వెంట జనం పరుగులు తీశారు. అయినా రేవంత్ అలానే వెళ్లిపోయారు. దీంతో వారు అక్కడే ఉన్న అధికారులు, నాయకులకు వినతులు అందజేశారు.



సీఎం బస్సు వెంట వినతులు చూపుతూ పరుగెడుతున్న ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు

వీసీ పోస్టుల్లో 50% బీసీలను నియమించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ప్రస్తుతం జరగబోయే యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నియామకాలలో 50% పోస్టులు బీసీలకు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రధానంగా జేఎన్‌టీయూ,ఉస్మానియా, పాలమూరు, శాతవాహన యూనివర్సిటీలలో వీసీ పోస్టులతోపాటు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిలర్ పోస్టును కూడా బీసీలకు కేటాయించాలన్నారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీలలో దాదాపు 2,400 మంది ప్రొఫెసర్ పోస్టులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇతర సంస్థల చైర్మన్, డైరెక్టర్ పోస్టులలో బీసీలకు 50% కోటా ఇవ్వాలని కోరారు. అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, పాలకమండలి ఏర్పాటు చేయాలన్నారు.

గోబెల్స్‌ను మించిన మోదీ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



ఖమ్మం మయూరి సెంటర్: అబద్ధాలు చెప్పడంలో ప్రధాని మోదీ గోబెల్స్‌ను మించిపోయాడని, దేశచరిత్రలో ఏ ప్రధాని చెప్పనన్ని అబద్ధాలు చెప్పిన రికార్డు సొంతం చేసుకున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఎద్దేవా చేశారు. ఖమ్మంలో శనివారం ప్రారంభమైన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలతో పాటు విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. మోదీ గ్యారంటీని ప్రజలు నమ్మకపోవడంతోనే బీజేపీ 305 స్థానాల నుండి 240 స్థానాలకు పడిపోయి చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. ఫలితంగా బిహార్‌లో నితీశ్ కుమార్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుపై ఆధారపడి పాలన సాగించాల్సి వచ్చిందన్నారు. రుణాల ఎగవేతదారుల్లో ఒక్కరు మినహా.. మిగిలిన వారంతా గుజరాతీయులేనని వివరించారు. గతంలో ఎగవేత సొమ్ము రూ.2.5 లక్షల కోట్లుంటే.. మోదీ పదేళ్ల పాలనలో అది రూ.16 లక్షల కోట్లకు చేరిందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై నారాయణ స్పందిస్తూ ప్రజాప్రతినిధులను చేర్చుకున్నంత మాత్రాన విపక్షం లేకుండా పోదని హెచ్చరించారు. ప్రజలే విపక్షమవుతారన్న వాస్తవాన్ని చరిత్ర చెబుతోందని పేర్కొన్నారు. పార్టీ మారే ముందు పదవికి రాజీనామా చేయాలని హితవు పలికారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పనులే కాంగ్రెస్ చేస్తుందని.. ఇది బీజేపీకి పరోక్షంగా ఊతమిచ్చినట్లేనని తెలిపారు. ఇదేసమయాన తెలంగాణలో బీజేపీ ఎంపీ సీట్ల సంఖ్య పెరగడంపై కాంగ్రెస్ ఆలోచన చేసి, ఆ పార్టీ బలపడడానికి ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వొద్దని సూచించారు.

మీ విచారణలో నిష్పాక్షికత లేదు

రాజకీయ ఆరోపణలకు ఊతమిచ్చేలా పనిచేస్తున్నారు

- విద్యుత్‌లో కేసీఆర్ సాధించిన విజయాలకు మసిపూస్తున్నారు
- నిబంధనల మేరకే ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందాలు
- కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీకి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో సాధించిన అసాధారణ విజయాలకు మసిపూసేలా పనిచేస్తున్నారంటూ విద్యుత్ ఒప్పందాలపై ప్రభుత్వం నియమించిన కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీ విచారణలో నిష్పాక్షికత లేదని, నిరాధారమైన ఆరోపణలకు ఊతమిచ్చేలా వ్యవహరించడం బాధాకరమంటూ ఏడు పేజీల లేఖను జగదీశ్‌రెడ్డి శనివారం తన పీఏ ద్వారా కమిషన్‌కు పంపించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ ఉద్దేశాలను తప్పుబట్టారు. కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి మీడియా సమావేశం పెట్టి లీకులు ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పద్నాలుగేళ్లు తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదేళ్ల కాలంలో అనేక రంగాల్లో దేశంలోనే తెలంగాణను ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. నిమిషం కరెంటు కోత లేకుండా రైతులు, పారిశ్రామికవేత్తలకు, గృహాలకు విద్యుత్ అందిస్తే... ఏదో జరిగిపోయిందన్నట్లుగా, జరిగిన నష్టాన్ని లెక్కకట్టడమే మిగిలిందన్నట్లుగా మాట్లాడడం, మరునాడే ఆరువేల కోట్ల నష్టం అని అన్ని ప్రధాన పత్రికల్లో వార్తలు రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. విచారణ జరుగుతున్న సమయంలోనే ఇలాంటి వార్తలు వచ్చినందున వారికి ఆ సమాచారం ఎలా వచ్చింది, ఏ ఆధారాలతో ఆ వార్తను ప్రచురించారనే అంశాలు కూడా విచారణలో భాగం కావలసిన అవసరం ఉందని జగదీశ్‌రెడ్డి చెప్పారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి రూ.3.90కి కొన్నాం

తాము ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన సమయంలో రాష్ట్రంలో విద్యుత్ తీవ్ర సంక్షోభంలో ఉందని, 2700 మెగావాట్ల విద్యుత్ కొరత ఉందని జగదీశ్ రెడ్డి లేఖలో వివరించారు. ఆ పరిస్థితుల్లో తెలంగాణకు వచ్చిన 400 మెగావాట్ల సీలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని కూడా ఏపీ ప్రభుత్వం తీసుకుందని, ఈ పరిస్థితుల్లో విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ పీజీసీఐఎల్ మహారాష్ట్రలోని వార్ధా నుంచి డిచ్‌పల్లి వరకు ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం ప్రారంభించిందని, పీజీసీఐఎల్‌లో వాటా ఉండాలంటే ఏదో ఒక సంస్థతో విద్యుత్ ఒప్పందం ఉండాలన్న నిబంధన మేరకు ఛత్తీస్‌గఢ్‌తో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎంఓయూ చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి విద్యుత్‌ను రూ.17కు కొంటున్న పరిస్థితి ఉండగా, ఛత్తీస్‌గఢ్ నుంచి రూ.3.90కి యూనిట్ చొప్పున కొనాలని తెలంగాణ ఈఆర్‌సీ నిర్ణయించిందని వివరించారు. తెలంగాణ తీసుకున్నప్పుడే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు రూ.4.90కి విద్యుత్ తీసుకున్నారన్నారు. రాష్ట్ర కరెంటు డిమాండ్ మేరకు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని, సబ్ క్రిటికల్ టెక్నాలజీతో దేశంలో 17 ప్రాజెక్టులు నిర్మాణం అవుతున్నాయని చెప్పారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను 800 మెగావాట్లతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో, యాదాద్రి ప్లాంట్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మాణం చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోతో సబ్ క్రిటికల్, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అనే తేడా లేకుండా పోయిందని వివరించారు.

గ్రేటర్‌లో కంటోన్మెంట్ సివిల్ ఏరియాల విలీనం

కేంద్ర రక్షణ శాఖ ఉత్తర్వులు

- మిలిటరీ స్టేషన్ మినహా నివాస ప్రాంతాలు ఇక జీహెచ్‌ఎంసీ పరిధిలోకి..



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌వాసుల చిరకాల కోరిక నెరవేరింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. కంటోన్మెంట్ బోర్డును జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా రక్షణ శాఖ మంత్రి వద్దకు ఈ అంశాన్ని తీసుకెళ్లారు. మార్చి 5న రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసి స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో బ్రిటిష్ కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటినీ రద్దు చేసి మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇటీవలే రక్షణ శాఖకు లేఖ రాశారు. ఈనెల 25 రక్షణ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లోనూ విలీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సంబంధిత విధి విధానాలపై రక్షణ శాఖ లేఖ రాసింది. దీని ప్రకారం కంటోన్మెంట్‌లోని సివిల్ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నీ ఉచితంగా జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డు ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. అక్కడ ఇప్పటికే లీజులు ఇచ్చినవి కూడా మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలిటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్‌ఎంసీ పరిధి వర్తిస్తుంది. తన పరిధిలో ఉన్న వాటిపై పన్నులను విధిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు, సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది.

'స్టార్' హోటల్‌కు తెలంగాణ భవన్ బాధ్యతలు!

తాజ్ లేదా ఇతర గ్రూప్‌కు అప్పగించే ఆలోచన

- దేశానికే రోల్ మోడల్‌గా ఉండాలని భావిస్తున్న ప్రభుత్వం



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ నిర్మాణ బాధ్యతలను పేరు గాంచిన స్టార్ హోటల్‌కు అప్పగించే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. నిర్మాణంతో పాటు నిర్వహణను సైతం స్టార్ హోటల్ యాజమాన్యమే చూసుకునేలా చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఇటీవల మీడియాతో జరిపిన చిట్‌చాట్‌లోనే సీఎం ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. దాదాపు రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల బడ్జెట్‌తో నిర్మించే ఈ ఐకానిక్ భవనాన్ని దేశానికి రోల్‌మోడల్‌గా ఉండేలా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రెండు కంపెనీలు ఇచ్చిన ప్రెజెంటేషన్‌ను రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. వీటిలో కొన్ని మార్పులు చేర్పులు చేసి మరో డిజైన్‌తో రావాలని సూచించారు. అయితే ఇప్పటికే డిజైన్లను ప్రెజెంట్ చేసింది 'స్టార్ హోటల్'కు సంబంధించిన వారా? లేక ఇతర ప్రైవేటు సంస్థలా? అనేది తేలాల్సి ఉంది.

రెండుచోట్ల భవనాలు

ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ విభజన గత మార్చి నెలలో పూర్తి అయ్యింది. ఏపీ భవన్ మొత్తం 19.781 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఏపీకి 11.536 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలను కేటాయిస్తూ మార్చి 15న కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏపీ భవన్ మొత్తం విలువ రూ.9,913.505 కోట్లు అని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించగా.. ఇందులో 3 ఎకరాల విస్తీర్ణంలో శబరి బ్లాక్, 5.245 ఎకరాల విస్తీర్ణంలో పటౌడీ హౌస్ ఉన్నాయి. శబరి బ్లాక్ ఏరియా అంతా హైదరాబాద్ హౌస్ పక్కకు ఉంటుంది. ఈ ఏరియాలోనే గవర్నర్ బ్లాక్, ముఖ్యమంత్రి బ్లాక్, రాష్ట్ర కేబినెట్ మంత్రుల బ్లాక్.. మూడూ కలిపి 5.245 ఎకరాల స్థలంలో ఒక భవనం నిర్మించనున్నారు. ఇక 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పటౌడీ హౌస్ స్థలంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండేందుకు సౌకర్యవంతమైన భవనాన్ని నిర్మించనున్నారు.

ప్రతిరోజూ 100 రూమ్‌లు తెలంగాణ వారికే..

దేశానికే రోల్ మోడల్‌గా నిలిచేలా తెలంగాణ భవన్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్న నేపథ్యంలోనే స్టార్ హోటల్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. తాజ్ గ్రూప్ లేదా ఇతర స్టార్ హోటల్ గ్రూప్‌కు అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం. ప్రతిరోజూ ఒక వంద రూమ్‌లు తెలంగాణ నుంచి వచ్చిన వారికి కేటాయించేలా చర్యలు తీసుకోనున్నారు.

త్వరలో ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్

- పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరిస్తామన్న కేంద్రం
- రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన బీజేపీ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే శంకర్

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు తెలిపారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. శనివారం ఢిల్లీలో బీజేపీ అధికార ప్రతినిధి సంగప్పతో కలిసి గోడం నగేశ్, శంకర్‌లు రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. పదేళ్లుగా బీఆర్ఎస్ వైఖరి కారణంగా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు కాలేదని రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖకు సంబంధించిన భూమి ఉందని దీనికి మరికొంత భూమిని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేటాయిస్తే ఆ స్థలంలో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు చేయవచ్చని ప్రధాని మోదీ 2014లో ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఈ విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, రాష్ట్రానికి సంబంధించిన భూమి కేటాయింపు చేయకుండా స్టేషన్ ఏర్పాటు కానివ్వకుండా అడ్డుపడిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉన్న సానుకూలతను రాజ్‌నాథ్‌సింగ్‌కు తెలియజేసినట్లు తెలిపారు. దీంతో త్వరలోనే ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్‌సింగ్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పీసీ ఘోష్ కమిషన్ గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలు, లోపాలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. విచారణ నిర్వహించి నివేదిక సమర్పించడానికి జూన్ 30తో గడువు ముగియనుండగా, ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ గడువు కూడా జూన్ 30తో ముగియనుండగా, మరో నెల రోజులు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. దీనిపై ఆదివారం రాష్ట్ర ఇంధన శాఖ ఉత్తర్వులు జారీ చేసే అవకాశముంది.

'రింగు' భూసేకరణలో వందల ఎకరాలు మిస్!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ భూసేకరణ గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేయడం గమనార్హం.

ఏం జరిగిందంటే..

రీజనల్ రింగురోడ్డులో ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ యంత్రాంగం దాదాపు పూర్తి చేసింది. అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చిన భూములు ఇక రీజినల్ రింగురోడ్డు కోసం ఉపయోగించేందుకు కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చాయంటూ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. భూపరిహారాన్ని నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు గ్రామాలవారీగా అవార్డులు పాస్ చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో తాజాగా భూముల వివరాలు పరిశీలిస్తుండగా అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చిన భూముల్లో కొన్ని భూసేకరణ తుది జాబితాలోంచి మిస్ అయ్యాయని అధికారులు గుర్తించారు. నర్సాపూర్ 'కాలా' పరిధిలో 360 ఎకరాలు, గజ్వేల్ 'కాలా' పరిధిలో మరో 100 ఎకరాలు ఇలా గల్లంతైనట్లు తేల్చారు. అయినప్పటికీ గతేడాది భూసేకరణకు సంబంధించి రెండు గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఇప్పుడు ఆ గెజిట్ నోటిఫికేషన్ల గడువు కూడా తీరిపోయింది.

మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ల జారీ

సేకరించాల్సిన భూములను నోటిఫై చేస్తూ గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేస్తారు. ఇందులో 3ఏ, 3డీలు కీలకమైనవి. గ్రామం పేరు, సర్వే నంబర్లు, భూమి పరిమాణం వివరాలు తెలుపుతూ మూడు రోజుల క్రితం 3ఏ గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేశారు. నర్సాపూర్, గజ్వేల్ కాలాలకు సంబంధించి విడివిడిగా రెండు నోటిఫికేషన్లు విడుదల చేశారు. వీటిపై అభ్యంతరం ఉన్న వారు 21 రోజుల్లో తమ అభ్యంతరాలను ఆయా 'కాలా'లకు సంబంధించిన ఆర్డీఓ కార్యాలయాల్లో అందజేయాల్సిందిగా కోరారు. ఆ తర్వాత భూ యజమానుల పేర్లతో 3డీ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. వాటి తర్వాత గ్రామ సభలు నిర్వహిస్తేగానీ ఆయా గ్రామాల్లో భూసేకరణకు వీలుండదు. ఇలా ఇంకేమైనా గ్రామాల్లోనూ భూముల వివరాలు గల్లంతయ్యాయేమోనని అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు.



డీఎస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు.



కిషన్‌రెడ్డి నివాళి



డీఎస్ చిత్రపటం వద్ద కేటీఆర్ నివాళి



విలపిస్తున్న డీఎస్ భార్య, కుమారులు అర్వింద్, సంజయ్

కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ కన్నుమూత

శనివారం తెల్లవారుజామున తీవ్ర గుండెనొప్పికి గురైన ధర్మపురి శ్రీనివాస్

- ఆస్పత్రికి తరలిస్తుండగానే తుది శ్వాస
- పీసీసీ చీఫ్‌గా, మంత్రిగా మంచి పనితీరు

సాక్షి, హైదరాబాద్/ బంజారాహిల్స్/కోరుట్ల: కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్(75) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కాలనీలోని నివాసంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో డీఎస్ తీవ్రంగా గుండెనొప్పికి గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచారు. నిజామాబాద్‌లో ఉన్న పెద్ద కుమారుడు సంజయ్ హుటాహుటిన నగరానికి రాగా.. ఢిల్లీలో ఉన్న రెండో కుమారుడు, ఎంపీ ధర్మపురి అరవింద్ మధ్యాహ్నం 2 గంటలకు చేరుకున్నారు. డీఎస్ మృతితో ఆయన కుటుంబం, అభిమానుల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ వార్త తెలిసిన నేతలు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే కాలనీలోని నివాసానికి చేరుకుని డీఎస్‌కు నివాళి అర్పించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, కె.రఘువీర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేకే, ఆర్.కృష్ణయ్య, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వీహెచ్ తదితరులు డీఎస్ నివాసానికి వచ్చి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఇక డీఎస్ మృతి పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

డీఎస్ పార్థివ దేహాన్ని సాయంత్రం స్వస్థలం నిజామాబాద్‌కు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం అక్కడే ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్, మంత్రులు పాల్గొననున్నట్టు టీపీసీసీ వర్గాలు తెలిపాయి. కాగా.. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పటేల్ తదితరులు డీఎస్ నివాసానికి వెళ్లి.. భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు.

క్యాషియర్ నుంచి పీసీసీ చీఫ్, మంత్రిదాకా..

ధర్మపురి శ్రీనివాస్ 1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్ జిల్లా వేల్పూరులో జన్మించారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమారులు సంజయ్, అర్వింద్ ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ నిజామాబాద్ మాజీ మేయర్ కాగా.. చిన్న కుమారుడు అర్వింద్ ఎంపీగా ఉన్నారు. బీకాం, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన డీఎస్.. తొలుత హైదరాబాద్ రిజర్వుబ్యాంకులో క్యాషియర్‌గా పనిచేశారు. డీఎస్‌కు ఏపీ ఆర్థిక మంత్రిగా పనిచేసిన అర్గుల్ రాజారాం వరుసకు మేనమామ అవుతారు. ఆయన ప్రోద్బలంతో డీఎస్ రాజకీయ ప్రవేశం చేశారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 1989లో నిజామాబాద్ ఎమ్మెల్యేగా తొలిసారి విజయం సాధించారు. 1992లో గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, టెక్స్‌టైల్స్ శాఖల మంత్రిగా.. 1993లో పబ్లిక్ రిలేషన్, సినిమాటోగ్రఫీమంత్రిగా పనిచేశారు. 1995–1998 మధ్య ఉమ్మడి ఏపీ పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీలో కాంగ్రెస్ సభాపక్ష ఉపనేతగా పనిచేశారు. 2003లో ఉమ్మడి ఏపీ పీసీసీ చీఫ్‌గా నియమితులయ్యారు. 2004లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్సార్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2008లో తిరిగి పీసీసీ పగ్గాలు చేపట్టారు. 2011–2015 మధ్య ఎమ్మెల్సీగా పనిచేశారు. 2015 జూలైలో బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్)లో చేరారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆయనను ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమించారు. 2016లో డీఎస్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2023లో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రధాని మోదీ సంతాపం

డి.శ్రీనివాస్ మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తననెంతో బాధించిందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. డీఎస్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

డీఎస్‌కు కాంగ్రెస్ ఘన నివాళి

పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ పార్టీ ఘనంగా నివాళి అర్పించింది. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే గౌరవ సూచకంగా గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని అవతనం చేశారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. మరోవైపు ఎమ్మెల్యే కాలనీలోని నివాసానికి వెళ్లిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ తదితరులు డీఎస్ పార్థివ దేహంపై కాంగ్రెస్ జెండా కప్పారు. దీనితో చిరకాలం కాంగ్రెస్‌వాదిగా ఉన్న డీఎస్ చివరి కోరిక తీరిందని నేతలు పేర్కొన్నారు. డీఎస్ మృతి పట్ల మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, సీతక్క, జూపల్లి కృష్ణారావు, నేతలు మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, మల్లురవి, మహేశ్‌కుమార్‌గౌడ్, ఆది శ్రీనివాస్ తదితరులు సంతాపం ప్రకటించారు.

కోరుట్ల అల్లుడు డీఎస్

ధర్మపురి శ్రీనివాస్.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల అల్లుడు. 1972 ఫిబ్రవరి 2న కోరుట్లకు చెందిన రేగుల కాశీరాం, గంగమ్మ దంపతుల కుమార్తె విజయలక్ష్మితో డీఎస్ వివాహం జరిగింది. డీఎస్ కుమారుడు, ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరుట్లలోనే జన్మించారు. ఈ క్రమంలోనే అర్వింద్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నుంచి పోటీ చేశారు కూడా. డీఎస్ మృతి విషయం తెలిసిన ఆయన బంధువు రేగుల భూమానందం మాట్లాడుతూ.. డీఎస్ కోరుట్లకు వచ్చిన ప్రతిసారి బంధువులను, అత్తగారింటి చుట్టుపక్కల వారిని ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు. కోరుట్ల నుంచి డీఎస్ వద్దకు ఎవరు వెళ్లినా కావాల్సిన సాయం చేసేవారని చెప్పారు.

డీఎస్ మరణం తీరనిలోటు: గవర్నర్ రాధాకృష్ణన్

డీఎస్ మృతి వార్త దిగ్భ్రాంతి కలిగించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన అవిశ్రాంతంగా పాటుపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేశారు. ఆయన మృతి తీరని లోటు.

డీఎస్ సేవలు వెలకట్టలేనివి: సీఎం రేవంత్

డీఎస్ సుదీర్ఘకాలం కాంగ్రెస్‌కు సేవలందించారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారు. పార్టీపై తనదైన ముద్ర వేశారు. ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో కృషి చేశారు. డీఎస్ జీవితం ఎందరికో ఆదర్శం. ఆయన లేని లోటు తీర్చలేనిది. డీఎస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా..

తెలంగాణ ఏర్పాటులో కీలకం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సుదీర్ఘ రాజకీయ జీవితంలో డీఎస్ ప్రజాసేవకు అంకితమయ్యారు. 2004–2009 మధ్య అసెంబ్లీలో డీఎస్ నాకు అందించిన ప్రోత్సాహం మరువలేనిది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు.

ఆయన సేవలు ఎనలేనివి: బండి

డీఎస్ మరణం బాధాకరం. ఆయన సేవలు ఎనలేనివి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు హామీని 2004లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టేలా అధిష్టానాన్ని ఒప్పించడంలో డీఎస్ కృషి కీలకం. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం ఆయన పాటుపడ్డారు.

వైఎస్సార్‌తో డీఎస్‌కు ఉన్న అనుబంధం మరిచిపోలేనిది

డీఎస్ మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి, తెలంగాణకు చెందిన సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ (డీఎస్) మరణం పట్ల మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డితో డీఎస్‌కు ఉన్న అనుబంధం మరిచిపోలేనిదని గుర్తు చేసుకున్నారు.ఎన్నో పదవులు సమర్థవంతంగా నిర్వర్తించి చాలామంది రాజకీయ నాయకులకు డీఎస్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. డీఎస్ మరణం దిగ్భ్రాంతి కలిగించిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. డీఎస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్లుప్తంగా...

ఢిల్లీ ప్రదక్షిణలు మినహా కాంగ్రెస్ చేసిందేంటి?

బీఆర్‌ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఆ పార్టీ నేతలు పాలన గాలికి వదిలి ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని బీఆర్‌ఎస్ నేత, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. ఏడు నెలలుగా పదవుల కోసం పాకులాట, పదవుల కోసం పైరవీలతోనే వారికి సరిపోతోందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంపై నిందలు వేయడం మినహా పాలనపై దృష్టి పెట్టడం లేదన్నారు. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ప్రతాప్‌రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.38 వేల కోట్లు అప్పులు తెచ్చినా కొత్త పథకాలేవీ అమలు చేయడం లేదన్నారు. తమ సొంత జేబులు నింపుకుంటున్న కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ఆదాయం పెంపు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ అడుగంటుతుండగా, రంగనాయకసాగర్ పూర్తిగా ఎండిపోయిందని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. హరితహారంలో భాగంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడవుల విస్తీర్ణం పెంచగా, ప్రస్తుతం అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

కేసీఆర్ గుర్తులు చెరపడం రేవంత్ తరం కాదు

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తానని రేవంత్ అంటున్నారని, కేసీఆర్ గుర్తులు చెరిపివేయడం ఆయన తరం కాదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. విలువలతో బతుకుతా అంటూ ప్రకటనలు చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పార్టీ ఎందుకు మారారో చెప్పాలని ఆనంద్ ప్రశ్నించారు. కేసీఆర్ దయవల్లే రెండు పర్యాయాలు ఎమ్మెల్యే అయినట్లు చెప్పిన యాదయ్య కార్యకర్తలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత పంజుగుల శ్రీశైల్‌రెడ్డితో కలిసి ఆనంద్ శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పదేళ్ల పాటు దేవుడిలా కనిపించిన కేసీఆర్ ఇప్పుడు దెయ్యంలా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆరు గ్యారంటీలు పక్కన పెట్టి మరో ఆరుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను రేవంత్ పార్టీలో చేర్చుకున్నారని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాలె యాదయ్య విలువలు కాపాడుకోవాలని మహేశ్‌రెడ్డి హితవు పలికారు.

మళ్లీ కొత్త పద్ధతుల్లో 'పనికి ఆహార పథకం'?

- ఉపాధి హామీ కూలీ కింద కాస్త బియ్యం ఇచ్చే యోచనలో కేంద్రం
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు ఆహార మంత్రిత్వ శాఖ నుంచి ప్రతిపాదనలు
- దేశంలో పేరుకుపోయిన బియ్యం నిల్వలను తగ్గించుకోవడం కోసమే..



సాక్షి, హైదరాబాద్: మళ్లీ కొత్త పద్ధతుల్లో 'పనికి ఆహార పథకం' అమలు కానుందా? జాతీయ స్థాయిలో బియ్యం నిల్వలు పేరుకుపోవడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆహార సమస్యల పెరుగుదలతో కొత్త రూపంలో ఈ పథకాన్ని తీసుకొచ్చే అవకాశాలున్నాయనే చర్చ అధికార వర్గాల్లో జరుగు తోంది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈఎస్) కింద చేసే ఉపాధి పనులకు ఇచ్చే కూలీలో కొంత (పార్ట్ పేమెంట్) బియ్యం ఇచ్చే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు ఊహాగానాలు సాగుతున్నాయి. దీనికి సంబంధించి కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ నుంచి కేంద్ర గ్రామీణభివృద్ధి శాఖకు ప్రతిపాదనలు చేరినట్లు తెలుస్తోంది.

భారీగా పెరిగిన నిల్వలు..: గతేడాది బియ్యం ధరలను అదుపు చేసేందుకు కేంద్రం బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం, పారాబాయిల్డ్ రైస్‌పై 20 శాతం ఎక్స్‌పోర్ట్ డ్యూటీ వంటి చర్యలు చేపట్టింది. ఈ పరిణామాలతో దేశంలో బియ్యం నిల్వలు 1.4 కోట్ల టన్నులకు చేరుకోవడంతో గిడ్డంగి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో 'పనికి ఆహార పథకం'కింద గ్రామీణభివృద్ధి శాఖకు బియ్యం కేటాయింపును ఒక మార్గాంతరంగా కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక వివిధ కాంబినేషన్లు, రూపాల్లో దీన్ని ఇచ్చే అవకాశముందని అధికారులు అంటున్నారు.

ప్రయోజనం ఉండదంటున్న నిపుణులు

కూలీ మొత్తంలో కొంత భాగాన్ని బియ్యంగా ఇవ్వడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, కూలీలు ఈ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొనే ఆస్కారం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉపాధి హామీ పథకం అమల్లోకి రావడానికి ముందు 'పనికి ఆహార పథకం'కింద అనేక అక్రమాలు, కుంభకోణాలు జరిగిన తీరును గుర్తుచేస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 'ఫుడ్ ఫర్‌వర్క్ స్కీం'లో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణాలు చోటుచేసుకోవడం, ఈ పథకం కింద కేటాయించిన బియ్యం నేరుగా బహిరంగ మార్కెట్‌కు చేరుకోవడం వంటివి జరిగిన వైనాన్ని గుర్తుచేస్తున్నారు. అదీగాకుండా ఉపాధి హామీ పథకం కింద కూలీని నగదు రూపంలో ఇవ్వాల్సి ఉండటం, ఇచ్చే బియ్యానికి లెక్క కట్టడం, ఇతర సమస్యలు ఉత్పన్నమౌతాయని చెబుతున్నారు.

సింగరేణి నెత్తిన శరగోపం పెట్టిందే బీఆర్‌ఎస్, బీజేపీ

- ఐఎన్‌టీయూసీ నేత జనక్ ప్రసాద్



సాక్షి, హైదరాబాద్: సింగరేణి నెత్తిన శరగోపం పెట్టిందే బీఆర్‌ఎస్, బీజేపీ అని ఐఎన్‌టీయూసీ నేత జనక్ ప్రసాద్ ఆరోపించారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణకు కొంగుబంగారంలాంటి సింగరేణి సంస్థను మూత వేయించే కుట్రలకు పాల్పడింది వారేనని ధ్వజమెత్తారు. ఆర్థిక, విద్యుత్తు సంస్థల విధ్వంసానికి బీఆర్‌ఎస్ పాల్పడిందన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం బీజేపీతో కలిసి సింగరేణిని నిట్టనిలువునా ముంచే ప్రయత్నం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు భవిష్యత్తు లేకుండా చేసే జిత్తులమారి ఎత్తుగడలను బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కలిసి అమలు చేశాయని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణలో 40 గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. వీటిలో 22 బొగ్గు గనులు 2032 –33 సంవత్సరానికి మూతపడతాయని వివరించారు. అదే తీరుగా అయిదేళ్లకోసారి బొగ్గు నిల్వలున్న ప్రాంతం గణనీయంగా తగ్గిపోతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు 70 మిలియన్ టన్నులున్న బొగ్గు ఉత్పత్తి 2060 నాటికి 17.28 మిలియన్ టన్నులకు పడిపోతుందనే అంచనాలున్నాయని వివరించారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ (జీసీఈపీ)లోని అన్ని బొగ్గు గనులను సాధించుకోవాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించినా... అప్పటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రక్రియకు అడ్డుపడ్డారని ఆరోపించారు. తనకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు సంస్థలకు బొగ్గు గనులను కట్టబెట్టేందుకు సింగరేణి నిర్ణయాన్ని మార్చారని విమర్శించారు.

నిధుల వినియోగంపై వివరాలివ్వండి


ఎన్‌సీఎస్టీ సభ్యుడు జాటోత్ హుస్సేన్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి నిధుల వినియోగం వివరాలు తెలియజేయాలని జాతీయ ఎస్టీ కమిషన్(ఎన్‌సీఎస్టీ) సభ్యుడు జాటోత్ హుస్సేన్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్లాజా హోటల్‌లో శనివారం గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగం, చేసిన కార్యక్రమాలను సమీక్షించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యక్రమాల వివరాలను రాష్ట్ర అధికారులు జాతీయ గిరిజన కమిషన్‌కు అందజేశారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి, గిరిజన శాఖ అదనపు సంచాలకుడు వి.సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్, జీసీసీ జీఎం సీతారాం, గిరిజన పరిశోధన సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ వి.సముజ్వల, డాక్టర్ డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ హఠాన్మరణం

అనారోగ్యంతో కన్నుమూసిన బీజేపీ నేత

- అర్ధరాత్రి అస్వస్థతకు గురైన రాథోడ్.. ఆదిలాబాద్ ఆస్పత్రిలో చేరిక
- పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా తుదిశ్వాస
- సంతాపం వ్యక్తం చేసిన ప్రముఖులు..నేడు ఉట్నూర్‌లో అంత్యక్రియలు



మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్/ఉట్నూర్ రూరల్: ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత రాథోడ్ రమేశ్ (58) శనివారం హఠాన్మరణం చెందారు. ఉట్నూర్‌లో నివసించే రాథోడ్ శుక్రవారం అర్ధరాత్రి తర్వాత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఆదిలాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా శనివారం ఉదయం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో ఇచ్చోడ వద్ద ఆయన తుదిశ్వాస విడిచారు. రాథోడ్ దీర్ఘకాలంగా కాలేయ సంబంధిత వ్యాధి (క్రానిక్ లివర్ డిసీజ్)తో బాధపడుతున్నారని, రాత్రి ఫిట్స్ రావడంతో కోమాలోకి వెళ్లినట్లు చికిత్స అందించిన వైద్యులు తెలిపారు. ఇంటర్నల్ బ్లీడింగ్ కావడంతో కిడ్నీ ఫెయిల్ అయిందని, అదే సమయంలో బీపీ తగ్గడం, కార్డియాక్ అరెస్ట్ కావడంతో కన్నుమూశారని వివరించారు. రాథోడ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

అంత్యక్రియలకు బీజేపీ ముఖ్య నేతలు!

రాథోడ్ రమేశ్ మృతదేహాన్ని ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి తరలించారు. ఆయన సతీమణి, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, కుమారుడు రితీశ్ రాథోడ్ ప్రస్తుతం రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. మరో కుమారుడు రాహుల్ ప్రస్తుతం లక్షద్వీప్‌లో ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కూతురు సొనాలీ ఢిల్లీలో నివసిస్తున్నారు. ఉట్నూర్ మండలం నాగాపూర్‌లోని వారి వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఉదయం 11 గంటలకు రాథోడ్ అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి పలువురు బీజేపీ ముఖ్య నేతలు హాజరు కానున్నట్లు సమాచారం.

ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత..

ఇటీవల బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయగా వారిని కలిసేందుకు రాథోడ్ రమేశ్ ఢిల్లీ వెళ్లారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఇతర ముఖ్యనేతలను కలిశారు. అక్కడే ఆస్పత్రిలో చెకప్ చేయించుకున్నట్లు కార్యకర్తలు చెబుతున్నారు. గురువారమే ఉట్నూర్‌కు తిరిగి రాగా ఇలా జరిగిందని విచారం వ్యక్తం చేశారు.

జెడ్పీటీసీగా ప్రారంభించి..

టీడీపీలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన రాథోడ్ రమేశ్ 1995లో నార్నూర్ జెడ్పీటీసీగా గెలుపొందారు. 1999లో టీడీపీ నుంచే ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2006 నుంచి 2009 వరకు ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్టీ రిజర్వ్‌డ్ అయిన తర్వాత టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగి గెలుపొందారు. 2021లో బీజేపీలో చేరారు.

బీజేపీ నేతల దిగ్భ్రాంతి

నివాళులర్పించిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేఎల్పీనేత ఏలేటి

సాక్షి, హైదరాబాద్: బీజేపీనేత, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ ఆకస్మిక మృతిపట్ల బీజేపీ నేతలు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీజేపీలో క్రియాశీలకంగా పనిచేసిన రమేశ్‌రాథోడ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీకోసం ఎంతో కష్టపడ్డారని పేర్కొన్నారు. రమేశ్ రాథోడ్‌కు నివాళులర్పించి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి రమేశ్ రాథోడ్ ఎంతో కృషి చేశారని బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె. లక్ష్మణ్ నివాళులర్పించారు. ఆదిలాబాద్ ఎంపీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా రాథోడ్ సేవలు చిరస్మరణీయమన్నారు. రాథోడ్ మరణం గిరిజనులకు, ఆదిలాబాద్ ప్రజలకు, బీజేపీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాథోడ్ చేసిన సేవలను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.



నా ఇష్టమును నెరవేర్చు కొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగివచ్చితిని.

– క్రైస్తవ ధర్మం

ఇది సరైన సందేశమేనా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

'మరణం నా చివరి చరణం కాదు' అంటాడు విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్. నిజమే, ప్రభావశీలమైన వ్యక్తులు మరణానంతరం కూడా జీవించే ఉంటారు. వారి ప్రభావ స్థాయిని బట్టి సంవత్సరాలు, దశాబ్దాలు, శతాబ్దాల పర్యంతం కూడా. ప్రభావశీలతలో పాజిటివ్ కోణం ఒక్కటే చూడాలా? నెగెటివ్ ప్రభావానికి కూడా ఈ సూత్రం వర్తిస్తుందా? మానవ చరిత్రపై అడాల్ఫ్ హిట్లర్ చేసిన రక్తాక్షర సంతకం కూడా తక్కువ ప్రభావాన్ని చూపలేదు కదా! అతడు కూడా మనకు ప్రాతఃస్మరణీయుడవుతాడా?

నిజానికి ఇందులో సమస్య ఏమీ లేదు. సందేహాతీతమైన సదాచారాలు మనకు ఉన్నాయి. సమాజం మేలు కోరిన వారు, ప్రజల మంచి కోసం పోరాడినవారు, మంచితనాన్ని పెంచినవారిని స్మరించుకునే సంప్రదాయం మనకున్నది. స్మారకాలు నిర్మించుకునే అలవాటు కూడా ఉన్నది. వారి జీవితాల్లోంచి సమాజం పాఠాలు నేర్చుకోవాలనే కాంక్షతో వారినలా తమ జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలబెట్టుకుంటారు. చెడు మార్గంలో పయనించి ప్రభావం కలిగించిన వారిని... అధ్యయనం కోసం మాత్రమే చరిత్ర పుటల్లోకి ఎక్కించాలి. వారికి మరణమే చివరి చరణం కావాలి. ఆ ప్రభావం ఆదర్శం కాకూడదు.

కానీ, దురదృష్టవశాత్తు మారుతున్న కాలం వింత పోకడలు పోతున్నది. అభివృద్ధికి అర్థం మారుతున్నది. విజయ గాథలకు కొత్త నిర్వచనాలు చేరుతున్నాయి. గొప్పతనం అనే మాటకు తాత్పర్యం మారింది. ఎవరు బాగా సంపాదిస్తారో వారే మహానుభావులు అనే భావన బలపడుతున్నది. వారు ఏ మార్గంలో సంపాదించారన్న పట్టింపేమీ కనిపించడం లేదు. గమ్యం మాత్రమే కాదు, గమ్యాన్ని చేరే మార్గం కూడా పవిత్రంగా ఉండాలన్న గాంధీ బోధనను ఒక చాదస్తం కింద జమకట్టవలసిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. గాడ్సే వారసులకు గౌరవ మర్యాదలు లభిస్తున్న కాలంలోకి ప్రవేశించాము కదా!


పారిశ్రామికాభివృద్ధిలో జాతి ప్రగతిని దర్శించిన జేఆర్‌డీ టాటా వంటి ఉన్నతస్థాయి పారిశ్రామికవేత్తలు కూడా మనకు ఉన్నారు. అటువంటి వారు చనిపోయినప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకొని అధికారిక సంస్మరణ సభలు నిర్వహించినట్టు గుర్తు లేదు. అటువంటి అదృష్టం మన తెలుగువాడైన చెరుకూరి రామోజీరావుకు దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో 'ఈనాడు'కున్నంత పేరు ఆయనకూ ఉన్నది. బాగా సంపాదించారు. చిట్‌ఫండ్స్‌తో ప్రారంభమై మీడియాకు విస్తరించారు. మీడియా దన్నుతో సాటి చిట్‌ఫండ్ కంపెనీలను చావబాది, వాటిని దివాళా తీయించారు. ఫలితంగా ఆయన 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' దినదిన ప్రవర్ధమానమైంది.

చిట్‌ఫండ్స్‌కు తోడుగా 'ఫైనాన్షియర్స్' పేరుతో మరో జంట కంపెనీ తెరిచారు. రెండు చేతులా ప్రజాధనాన్ని స్వీకరించారు. మీడియాను విస్తరింపజేశారు. ఫిలిం సిటీ పేరుతో ఓ మాహిష్మతీ రాజ్యాన్ని స్థాపించేశారు. ఈలోగా మీడియాను వాడుకొని ప్రభుత్వాలను మార్చారు. 'పత్రికొక్కటి ఉన్న పదివేల సైన్యంబు' అన్నారు నార్ల వెంకటేశ్వరరావు. ఆ వాక్యాన్ని చెరుకూరి వారు వ్యాపారపరంగా ఆలోచించారు. పదివేల సైన్యంబును ప్రయోగిస్తూ వచ్చారు. మొదట కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ పదివేల సైన్యం పొగబాంబులు పేల్చింది. ఫలితంగా ఎన్టీ రామారావు గద్దెనెక్కారు. రామోజీరావు వ్యాపారపు అడుగులకు మడుగులొత్తడానికి రామారావు నిరాకరించారు. క్రుద్ధుడైన రామోజీ వృద్ధుడైన రామారావు పైకి తన పదివేల సైన్యాన్ని అదిలించారు. ఎన్టీఆర్ గద్దె దిగి చంద్రబాబు గద్దెనెక్కారు. మనోవేదనతో ఐదు మాసాల్లోపే ఎన్టీఆర్ చనిపోయారు. రామోజీరావు పట్ల కృతజ్ఞతాపూర్వకంగా చంద్రబాబు ఆయనకు శుక్రాచార్యులవారి హోదా కల్పించారు.

పత్రికా రచన రంగానికి సంబంధించి రామోజీకి పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. 'ఈనాడు' ఎడిటర్ హోదాతో ఆయన ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడుగా కూడా పని చేశారు. కానీ ఆయన వృత్తిపరంగా జర్నలిస్టు కాదు. నాన్ జర్నలిస్ట్ ఎడిటర్‌గా ఆయన పలు రికార్డుల్ని బద్దలు కొట్టారు. ఏకవాక్య రచన కూడా లేకుండా ఏకబిగిన దశాబ్దాల తరబడి ప్రధాన సంపాదకుడిగా కొనసాగిన ఘనతను ఆయన్నుంచి ఎవరూ లాక్కోలేరు. 1974లో విశాఖపట్నం నుంచి 'ఈనాడు' పత్రిక ప్రారంభమయ్యే నాటికి అప్పటికే ఉన్న రెండు పెద్ద పత్రికలు పాత మూసలోనే మునకేసి ఉన్నాయి. ఈ స్థితిలో

సందేహాతీతమైన సదాచారాలు మనకు ఉన్నాయి. సమాజం మేలు కోరిన వారు, ప్రజల మంచి కోసం పోరాడినవారు, మంచితనాన్ని పెంచినవారిని స్మరించుకునే సంప్రదాయం మనకున్నది. స్మారకాలు నిర్మించుకునే అలవాటు కూడా ఉన్నది. వారి జీవితాల్లోంచి సమాజం పాఠాలు నేర్చుకోవాలనే కాంక్షతో వారినలా తమ జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలబెట్టుకుంటారు. చెడు మార్గంలో పయనించి ప్రభావం కలిగించిన వారిని... అధ్యయనం కోసం మాత్రమే చరిత్ర పుటల్లోకి ఎక్కించాలి. వారికి మరణమే చివరి చరణం కావాలి. ఆ ప్రభావం ఆదర్శం కాకూడదు.

కానీ, దురదృష్టవశాత్తు మారుతున్న కాలం వింత పోకడలు పోతున్నది. అభివృద్ధికి అర్థం మారుతున్నది. విజయ గాథలకు కొత్త నిర్వచనాలు చేరుతున్నాయి. గొప్పతనం అనే మాటకు తాత్పర్యం మారింది. ఎవరు బాగా సంపాదిస్తారో వారే మహానుభావులు అనే భావన బలపడుతున్నది. వారు ఏ మార్గంలో సంపాదించారన్న పట్టింపేమీ కనిపించడం లేదు. గమ్యం మాత్రమే కాదు, గమ్యాన్ని చేరే మార్గం కూడా పవిత్రంగా ఉండాలన్న గాంధీ బోధనను ఒక చాదస్తం కింద జమకట్టవలసిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. గాడ్సే వారసులకు గౌరవ మర్యాదలు లభిస్తున్న కాలంలోకి ప్రవేశించాము కదా!



కొంత ఆధునికతను జోడిస్తూ, ప్రజల అవసరాలను గమనిస్తూ, వారికి అర్థమయ్యే సరళమైన భాషను వినియోగిస్తూ 'ఈనాడు' ముందుకొచ్చింది. ఈ మార్పులకు మూల పురుషుడు 'ఈనాడు' తొలి ఎడిటర్ అన్నే భవానీ కోటేశ్వర ప్రసాద్ ఉరఫ్ ఏబీకే ప్రసాద్ అనే తెలుగుజాతి అగ్రశ్రేణి పాత్రికేయుడు.

'ఈనాడు' హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభమైన కొద్ది కాలానికే ఏబీకే ప్రసాద్‌ను బయటకు పంపించారన్నది ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. తర్వాత కాలంలో రామోజీరావే స్వయంగా ప్రధాన సంపాదకులయ్యారు. ఏబీకే నెలకొల్పిన పత్రికా ప్రమాణాల స్థానాన్ని క్రమంగా రామోజీ వ్యాపార సూత్రాలు ఆక్రమించాయి. ఈ వ్యాపార సూత్రాలు కూడా పత్రిక విస్తృతిలో వాటి పాత్రను పోషించాయి. ఆ రోజుల్లో 'స్కైలాబ్' పేరుతో అమెరికా నెలకొల్పిన ఒక అంతరిక్ష కేంద్రానికి ఆయుష్షు మూడింది. అది ముక్కచెక్కలై భూమ్మీద పడిపోయే సందర్భాన్ని 'ఈనాడు' వినియోగించుకున్నది. అది రేపోమాపో పడిపోనున్నదనీ, దాంతో భూమి బద్దలైపోతుందని, ఇవే మనకు చివరి రోజులనీ ఊరూరా ప్రచారం జరగడంలో 'ఈనాడు' గొప్ప పాత్రనే పోషించింది. ఆ విధంగా గ్రామీణ ప్రజల్లోకి కూడా చొచ్చుకొనిపోగలిగింది.

పత్రికకు ఉండవలసిన నిష్పాక్షికత అనే లక్షణాన్ని ఈ యాభయ్యేళ్ల ప్రయాణంలో మొదటి ఐదారేళ్లు 'ఈనాడు' పాటించిందేమో! ఎనభయ్యో దశకం ప్రారంభంలోనే నిష్పాక్షికతకు నిప్పు పెట్టేసింది. గడిచిన నాలుగున్నర దశాబ్దాలుగా దాని పాత్రికేయమంతా ఏకపక్షా రచనా వ్యాసంగమే! నాణేనికి ఉండే రెండో కోణాన్ని తెలుగు ప్రజలు చూడకుండా 'ఈనాడు' దాచిపెట్టింది. పోటీగా మరో పత్రిక ఎదగకుండా దాని ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే రామోజీ ఎత్తుగడలన్నీ తెలుగు ప్రజల అనుభవంలో ఉన్నవే. 'ఉదయం' పత్రిక అకాల అస్తమయానికి ఈ ఎత్తుగడలే కారణం. 'వార్త'ను నిర్వీర్యం చేయడానికి కూడా అది ప్రయత్నాలు చేసింది. ఒక్క 'సాక్షి' ముందు మాత్రం దాని మంత్రాంగం పారలేదు. ఫలితంగా గత పదహారేళ్లుగా తెలుగు ప్రజలకు వార్తాంశాల రెండో కోణం ఆవిష్కృతమైంది. దశాబ్దాల తరబడి తెలుగు ప్రజలకు నిష్పాక్షిక సమాచార హక్కును దక్కకుండా చేసినందుకుగాను ఆయన్ను అక్షర సూర్యుడుగా భృత్య మీడియా బహువిధాలుగా శ్లాఘించింది. ప్రభుత్వం వారి సంస్మరణ సభలో వక్తలందరూ నోరారా కొనియాడారు.

ఇక రామోజీరావు తన వ్యాపార సామ్రాజ్య స్థాపనలో అనుసరించిన పద్ధతులూ, నియమోల్లంఘనలూ, చట్టవిరుద్ధ వ్యవహారాలూ ఆమోదయోగ్యమైనవేనా? భవిష్యత్తు తరాల వారికి వాటిని బోధించవచ్చునా? ఈ అంశాలపై విస్తృతమైన చర్చ జరగవలసి ఉన్నది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరుతో ఆయన చేసిన డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమైనదని స్వయంగా ఆర్‌బీఐ ప్రకటించింది. ఆయన కూడా అది తప్పేనని ఒప్పుకున్నందువల్లనే ఆ సంస్థను మూసేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన ఎవరెవరి దగ్గర డిపాజిట్లు వసూలు చేశారో, ఎవరెవరికి తిరిగి చెల్లించారో తెలియజేస్తూ ఒక జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సుప్రీం ఆదేశాన్ని ఆయన పాటించలేదు.

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధం. కానీ మార్గదర్శి ఆ చట్టాన్ని ఉల్లంఘించి డిపాజిట్లు సేకరించింది. ఆ డిపాజిట్లను నిబంధనలకు విరుద్ధంగా షేర్ మార్కెట్లో, మ్యూచువల్ ఫండ్స్‌లో, తమ సొంత కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టింది. లేని చందాదారులను ఉన్నట్టుగా చూపిస్తూ ఘోస్ట్ చిట్టీలు నడుపుతూ మనీలాండరింగ్ నేరానికి పాల్పడినట్టు ఇటీవల జరిగిన సోదాల్లో బయటపడింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం చేసుకోవలసిన పరిణామాలివి.

రామోజీరావు తన వ్యాపార సామ్రాజ్య స్థాపనలో అనుసరించిన పద్ధతులూ, నియమోల్లంఘనలూ, చట్టవిరుద్ధ వ్యవహారాలూ ఆమోదయోగ్యమైనవేనా? భవిష్యత్తు తరాల వారికి వాటిని బోధించవచ్చునా? ఈ అంశాలపై విస్తృతమైన చర్చ జరగవలసి ఉన్నది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరుతో ఆయన చేసిన డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమైనదని స్వయంగా ఆర్‌బీఐ ప్రకటించింది. ఆయన కూడా అది తప్పేనని ఒప్పుకున్నందువల్లనే ఆ సంస్థను మూసేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన ఎవరెవరి దగ్గర డిపాజిట్లు వసూలు చేశారో, ఎవరెవరికి తిరిగి చెల్లించారో తెలియజేస్తూ ఒక జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సుప్రీం ఆదేశాన్ని ఆయన పాటించలేదు.

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధం. కానీ మార్గదర్శి ఆ చట్టాన్ని ఉల్లంఘించి డిపాజిట్లు సేకరించింది. ఆ డిపాజిట్లను నిబంధనలకు విరుద్ధంగా షేర్ మార్కెట్లో, మ్యూచువల్ ఫండ్స్‌లో, తమ సొంత కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టింది. లేని చందాదారులను ఉన్నట్టుగా చూపిస్తూ ఘోస్ట్ చిట్టీలు నడుపుతూ మనీలాండరింగ్ నేరానికి పాల్పడినట్టు ఇటీవల జరిగిన సోదాల్లో బయటపడింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం చేసుకోవలసిన పరిణామాలివి.

ఇక రామోజీ ఫిలింసిటీ ఒక అక్రమాల పుట్ట. ఇక్కడ జరిగిన నియమోల్లంఘనలు నూటొక్క రకాలు.


ఇక రామోజీ ఫిలింసిటీ ఒక అక్రమాల పుట్ట. ఇక్కడ జరిగిన నియమోల్లంఘనలు నూటొక్క రకాలు. ఇందులో ప్రభుత్వ భూముల ఆక్రమణ ఉన్నది. పప్పుబెల్లాలు పంచి అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన నేరం ఉన్నది. తరతరాల నాటి రహదారులనే కబ్జా చేసి కాంపౌండ్ వాల్ చుట్టుకున్న దాదాగిరి ఉన్నది. మాతృభూమిలో వైద్యసేవలు చేయడానికి వచ్చిన ఒక ఎన్ఆర్ఐ డాక్టర్‌ను బెదిరించి 200 ఎకరాల భూమిని కారుచౌకగా కొట్టేసిన దాష్టీకం ఉన్నది. భూపరిమితి చట్టాన్ని వెంట్రుక సమానంగా జమకట్టిన లెక్కలేని తెంపరితనం ఈ ఫిలింసిటీ కథలో దాగున్నది.

ఎటువంటి అనుమతుల్లేకుండా ఫిలిం సిటీలో నిర్మించిన 147 భవనాలు హెచ్ఎమ్‌డీఏ అధికారాన్ని తొడగొట్టి సవాల్ చేస్తున్నాయి. చెరువులను చెరపట్టి వాటిలోకి ప్రవాహాలను మోసుకెళ్లే కాల్వలను రహదారులుగా మార్చుకున్న ఫిలింసిటీ రుబాబు ముంగిట... 'వాల్టా' చట్టం చేతులు ముడుచుకొని సిగ్గుతో తలవంచి నిలబడింది. రామోజీ వ్యాపార సామ్రాజ్య విస్తరణ వెనుక ఇంత తతంగం ఉన్నది. ఇది రేఖామాత్రపు ప్రస్తావన మాత్రమే! ఈ 'సక్సెస్' స్టోరీ రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదేనా? రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరపడం సమర్థనీయమేనా? అమరావతిలో శిలా విగ్రహం, ఒక రహదారికి పేరు, స్మారక ఘాట్‌ల స్థాపన ఎటువంటి స్ఫూర్తిని ఉద్దీపింపజేస్తాయి. 'భారతరత్న' బిరుదాన్ని ఆయనకు సంపాదించిపెడతామని ముఖ్యమంత్రి చేసిన వాగ్దానం సరైన సందేశాన్నే సమాజంలోకి పంపిస్తుందా?

vardhelli1959@gmail.com

చట్టంలో ఈ మార్పులు ఎవరి కోసం?

అభిప్రాయం




డా॥ మంగారి రాజేందర్

మూడు కొత్త క్రిమినల్ చట్టాలు జూలై ఒకటవ తేదీ నుంచి అమలులోకి వస్తున్నాయి. ఈ మూడు చట్టాలు బాధితులకు అనుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ అలా ఉన్నట్టుగా అనిపించటం లేదు. అందుకు ఉదాహరణగా ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను పేర్కొనవచ్చు.

ప్రాథమిక దృష్టితో చూసినప్పుడు నేర సమాచారం కాగ్నిజబుల్ అయితే ఎఫ్ఐఆర్‌ను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 154 ప్రకారం తప్పక నమోదు చేయాల్సిన బాధ్యత పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జిపై ఉంది. ఈ విషయంలో అతను తన విచక్షణాధికారాన్ని ఉపయోగించుకునే అవకాశం చట్టం అతనికి ఇవ్వలేదు. సమాచారంలో విశ్వసనీయత కనిపించటం లేదనే కారణం కానీ లేదా అవసరమైన వివరాలు లేవని కానీ ఎఫ్ఐఆర్‌ను విడుదల చేయకుండా ఉండే అవకాశం లేదు. కేసు ప్రాథమిక దశలో సమాచారం అన్నదే నిర్ణయాత్మకమైన విషయం. అందులోని విశ్వసనీయత తీవ్రతను చూడాల్సిన అవసరం లేదు. ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చారన్న విషయం తేలితే కేసును మూసివేసి, తుది నివేదికను కోర్టుకు సమర్పించవచ్చు. అవసరమని భావించినప్పుడు ఆ తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవచ్చు. ఎఫ్ఐఆర్‌ను విడుదల చేయటానికి విశ్వసనీయ సమాచారం అవసరం లేదు. అందుకు కావలసిన అంశాలు రెండే రెండు. మొదటిది– అది సమాచారం అయ్యుండాలి. రెండవది– అది కాగ్నిజబల్ అయిన సమాచారం అయిఉండాలి.

అయితే సుప్రీంకోర్టు లలిత కుమారి వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ (ఏఐఆర్ 2014 సుప్రీం కోర్టు 187) కేసులో కొన్ని సందర్భాలలో ప్రాథమిక విచారణ చేసే వెసులుబాటును పోలీసులకు కల్పించింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ప్రాథమిక విచారణ గురించి ఎక్కడా చెప్పలేదు. అదేవిధంగా ప్రాథమిక విచారణ జరుపకూడదని కూడా ఎక్కడా నిషేధం లేదు. నిషేధం లేనంత మాత్రాన ప్రాథమిక విచారణ చేయవచ్చని అనుకోడానికి వీలు లేదు. కానీ సుప్రీంకోర్టు కొన్ని కేసులలో ప్రాథమిక విచారణ జరుపడానికి వెసులుబాటు కల్పించింది. ప్రథమ సమాచార నివేదిక విడుదల చేయడానికైనా ముందు ఎంక్వయిరీ జరిపే నిబంధన ఏదీ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో లేదు. లలిత కుమారి కేసు ప్రకారం కాగ్నిజబల్ నేర సమాచారం ఉన్నప్పుడు పోలీసులు విధిగా ప్రథమ సమాచార నివేదికను విడుదల చేయాలి. ఎలాంటి విచారణనూ చేయడానికి వీలు లేదు. ఒకవేళ అందిన సమాచారంలో కాగ్నిజబల్ నేరం వెల్లడికానప్పుడు అది కాగ్నిజబల్ నేర సమాచారం ఔనా, కాదా అనే విషయం తెలుసుకోవడానికి పోలీసులు ప్రాథమిక విచారణ చేయవచ్చు. అంతే తప్ప మరే విషయంలో ప్రాథమిక విచారణ చేయడానికి వీలులేదు. ఎలాంటి కేసులలో ప్రాథమిక విచారణ జరుపాలో సుప్రీంకోర్టు నిర్దేశించింది. 1. వివాహ వివాదాలు/ కుటుంబ వివాదాలు 2.వాణిజ్య నేరాలు 3. వైద్య నిర్లక్ష్య కేసులు 4. అవినీతికి సంబంధించిన కేసులు 5. సమాచారం అందచేయటంలో తీవ్రమైన జాప్యం ఉన్నప్పుడు. ఈ ప్రాథమిక విచారణను పోలీసులు జరుపవచ్చు. విచారణ సమయాన్ని 15 రోజులుగా సుప్రీంకోర్టు నిర్దేశించింది.

చట్టం ఇంత స్పష్టంగా ఉన్నపుడే కేసు నమోదు చేసుకోవడానికి బాధితులు



తీవ్రమైన ఇబ్బందులకు లోనవుతున్నారు. అంతేకాదు కేసు నమోదు కోసం పైరవీలు చేయాల్సిన పరిస్థితి ఇప్పుడు దేశంలో ఉంది. ఈ ప్రాథమిక విచారణను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారని చెప్పటానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అందులో ప్రముఖమైన ఉదాహరణ, పత్రికల్లో వచ్చిన ఉదాహరణ– ఒక వ్యక్తి బ్యాంక్ నుంచి పది కోట్ల రుణం తీసుకున్నాడు. అది కట్టలేదు. చివరికి బ్యాంక్ వాళ్ళు ఆ రుణం వసూలు చేయడానికి ఏజంట్లను నియమించుకున్నారు. ఈ పరిస్థితిని అధిగమించటానికి ఆ రుణం తీసుకున్న వ్యక్తి పోలీసులను ఆశ్రయించి, ఒక ఫిర్యాదును బ్యాంక్ ఉన్నతాధికారుల మీద దాఖలు చేశాడు.

ప్రాథమిక విచారణ పేరుతో పోలీసులు ఆ అధికారులను తరచూ పిలుస్తూ ఆరు మాసాలు గడిపారు. ఆ ఉన్నత అధికారులకు కేసు భయం పట్టుకునేలా చేశారు. చివరికి బ్యాంక్ అధికారులు తక్కువ మొత్తానికి ఒకేసారి పరిష్కారాన్ని చేసుకున్నారు. దాని వల్ల బ్యాంక్ నష్ట పోయింది. రుణం తీసుకున్న వ్యక్తి లాభపడ్డాడు. ఈ ప్రాథమిక విచారణ సమయంలో అనుమానితుడిని పిలిచే అధికారం పోలీసులకు లేదు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోలీసులు చేయాల్సింది రహస్య విచారణ. దాని పరిధి కూడా చిన్నది. కాగ్నిజబల్ నేరం జరిగిందా, లేదా అన్న విషయం తెలుసుకోవడానికి మాత్రమే పోలీసులు విచారణ జరపాలి కానీ పోలీసులు సుప్రీంకోర్టు తీర్పులో చెప్పిన దానిని మించి ప్రాథమిక విచారణ పేరుతో ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తికి లాభం జరిగే విధంగా ప్రవర్తించారు. బ్యాంక్‌కు కోట్ల రూపాయల నష్టం జరిగింది. కేసు నమోదు చేసిన తర్వాత మాత్రమే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 41 ప్రకారం లేదా 160 ప్రకారం మాత్రమే అనుమానితులను పిలవడానికి అవకాశం ఉంది. కానీ ఎలాంటి అధికారం లేకుండానే పోలీసు అధికారులు ఈ కేసులో బ్యాంక్ ఉన్నత అధికారులను పిలిచి, ఫిర్యాదు చేసిన వ్యక్తికి లాభం కలిగేలా చేశారు.

ప్రాథమిక విచారణను పైవిధంగా జరుపడానికి అధికారం లేనప్పుడే పోలీసులు ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నారు. ప్రాథమిక విచారణ జరుపచ్చని చట్టం నిర్దేశిస్తే ఇంకా ఎంత దుర్వినియోగం అవుతుందోనని అనిపిస్తుంది. 'భారతీయ నాగరిక సురక్ష సంహిత 2024' లోని 173 ప్రకారం పోలీసు అధికారులు 3 సంవత్సరాలు కానీ, అంతకు మించి కానీ, 7 సంవత్సరాల లోపు కానీ ఉన్న నేరాలలో పోలీసులు ప్రాథమిక విచారణ జరుపవచ్చు. అది కాగ్నిజబల్ నేర సమాచారం ఐనప్పటికి కూడా ఈ విచారణను పోలీసు అధికారి జరపటానికి అవకాశం ఉంది. ఈ ప్రాథమిక విచారణ చేయడానికి పోలీస్ అధికారి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అనుమతి తీసుకోవలసి ఉంటుంది. అతను ఈ అనుమతిని ఎంతకాలంలో ఇవ్వాలి అన్న విషయం గురించి చట్టంలో ఏమీ చెప్పలేదు. ఆ అనుమతి కోసం కూడా బాధితులు ఆ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌ని ఆశ్రయించాల్సి ఉంటుంది. ఒకవేళ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రాథమిక విచారణను చేయడానికి అనుమతిస్తే... పోలీస్ అధికారి విచారణను 14 రోజుల్లో పూర్తి చేయాలి. ఈ విచారణ లలిత కుమారి కేసులో సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కాదు. కేసులో ప్రాథమికంగా చూసినప్పుడు బలం ఉందా, లేదా అని అనిపించినప్పుడు విచారణ జరుపవచ్చు. కేసులోని స్వభావాన్ని బట్టి, తీవ్రతను బట్టి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రాథమిక విచారణ జరుపడానికి అనుమతిని ఇస్తారు. ఈ విచారణ దుర్వినియోగం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. కేసు నమోదు కావడానికే బాధితులు తీవ్రమైన ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. 7 ఏళ్ల లోపు శిక్ష విధించే అవకాశం ఉన్న నేరాలు 98 వరకు ఉన్నాయి. వాటిలో చాలా నేరాలు తీవ్రమైన నేరాలే. ప్రాథమిక విచారణ పేరుతో నెలల తరబడి విచారణ జరిపితే సాక్ష్యాలు మాయమయ్యే పరిస్థితి ఉంది. అదే విధంగా ప్రథమ సమాచార నివేదిక ఉద్దేశ్యం కూడా దెబ్బ తినే అవకాశం మరింత ఉంది. బాధితులకు లాభం చేద్దామనే ఉద్దేశ్యంతో ఈ నిబంధన ఏర్పాటు చేశారని ప్రభుత్వం చెప్పినప్పటికీ అలాంటి పరిస్థితి కనిపించటం లేదు. ఈ నిబంధన దుర్వినియోగం కానుందని స్పష్టంగా అర్థమవుతోంది. ఈ విమర్శను గమనించి కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని బీపీఆర్డీఓ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ఈ ప్రాథమిక విచారణ గురించి విడుదల చేసింది. దాని ప్రకారం ప్రాథమిక విచారణ కోసం ఆఫీసర్ ఇన్‌ఛార్జి ఆఫ్ పోలీస్ స్టేషన్ అనుమతి కోరిన 24 గంటలలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇవ్వాలని చెప్పారు. ఒకవేళ 24 గంటల్లో అనుమతి ఇవ్వకపోయినా, అనుమతిని తిరస్కరించినా, ఏ విషయాన్ని తెలియచేయకపోయినా... ఆ పోలీసు అధికారి ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రాథమిక విచారణ చేపట్టవచ్చు.

ఈ ప్రాథమిక విచారణ సమయం లో పోలీసు అధికారి సాక్ష్యాలు నమోదు చేసే అవకాశం ఉంది. కేసు నమోదు చేసిన తర్వాత కూడా సాక్షులను విచారిస్తారు. వీటి వల్ల సాక్ష్యాలలో వైరుధ్యాలు పెరిగి కేసు బలహీనపడే అవకాశం ఉంది. దానివల్ల బాధితులకి న్యాయం జరుగదు. మరి ఎవరి కోసం ఈ మార్పులు? ఈ కొత్త చట్టాలు? దీనికి సమాధానం కాలమే చెప్తుంది.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడెమీ డైరెక్టర్ । 9440483001

కరుణాహృదయమే దేవాలయం!

మన పూర్వ కథలలో నాగులకు గరుత్మంతుడికీ మధ్య వైరం ప్రసిద్ధమైనది. జీమూతవాహనుడనే పక్షిరాజు పరమ దయాళువు. ఒక సందర్భంలో, పూర్వం కుదుర్చుకున్న నియమం కారణంగా, గరుడుడికి ఆహారం కావాల్సిన శంఖచూడుడనే నాగజాతి బాలుడి కోసం ఆ బాలుడి తల్లి పడే వేదన చూసి తాళలేక, మనసు కరిగి, ఆ బాలుడికి బదులుగా తాను గరుడుడికి ఆహారం కావడానికి సిద్ధపడతాడు జీమూతవాహనుడు. ఆ త్యాగాన్ని నమ్మలేక పోతారు శంఖచూడుడు, అతడి తల్లి. ఆ నమ్మలేనితనంలో జీమూతవాహనుడితో శంఖచూడుడు 'ఈ లోకంలో దేనికీ పనికిరానివాళ్ళముగా, జీవుల ప్రాణాలను హరించే పాపులంగా పరిగణించబడేవారం, మహా అల్పులం మేము. అటువంటి మా కోసం, ప్రాణాన్ని మా పగవాడికి ఇవ్వడానికి సిద్ధపడడం అంటే, కసవుకు – అనగా ఎందుకూ పనికిరానిదిగా చిమ్మి చెత్తలో పారేసే దుమ్మూ ధూళితో సమానమైన వస్తువుకు– బదులుగా రత్నాన్ని అమ్ముకోవడంతో సమానమైన వ్యర్థ కార్యం కాదా?!' అని అంటాడు. శంఖచూడుడు తనను తాను కసవుతో పోల్చుకున్నప్పటికీ, జీమూతవాహనుడి హృదయం మాత్రం ఆ పిల్లవాడి ప్రాణం కోసం తల్లి పడే ఆవేదనలోని అంతులేని దుఃఖాన్ని పవిత్రమైనదిగా, విలువైనదిగా చూసింది. మరుక్షణం కరుణతో అతడి హృదయం నిండిపోయింది. కరుణతో సంపన్నమైన హృదయం అసహాయుడైన తోటి వ్యక్తి దుఃఖాన్ని పోగొట్టడానికి ఎంతటి త్యాగానికైనా వెరవదు, వెనుకాడదు అని పై సన్నివేశంలో జీమూతవాహనుడి చర్య తెలియజేస్తుందని కొఱవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' పంచమా శ్వాసంలోని ఈ కథ తెలుపుతుంది. సరిగ్గా ఈ భావాన్నే ఎఱ్ఱయ కవి తన 'సకలనీతి కథానిదానము' కావ్యం, ప్రథమాశ్వాసంలో ఒక చక్కటి కందపద్యంలో ఇలా చెప్పాడు.

జ్యోతిర్మయం

పరులకునైన నుపద్రవ
మరసి మహామతులు దమదు ప్రాణంబైనన్
కరమొనగి చక్కజేతురు
పరికింపగ నిదియు నిహము బరమును గాదె.

'తోటివారికి వచ్చిన ప్రాణ సంకటాన్ని తమ ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి తీర్చడానికి మహాపురుషులు వెనుకాడరు. అంతటి త్యాగానికి సిద్ధపడిన మహామతులకు ఇహపర సౌఖ్యం దక్కుతుందనడంలో ఆశ్చర్యపోవాల్సింది లేదు కదా!' అని పై పద్యం భావం. కరుణతో నిండిన హృదయం ఒక దేవాలయం! మానవత్వంలో దైవత్వం ఆక్కడ కలగలిసి కొలువు తీరి దర్శనమిస్తుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం : ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ; జ్యేష్ఠ మాసం ; తిథి: బ.నవమి ప.1.17 వరకు, తదుపరి దశమి ; నక్షత్రం: రేవతి ఉ.9.11 వరకు, తదుపరి అశ్విని ; వర్జ్యం: తె.3.55 నుండి 5.25 వరకు (తెల్లవారితే సోమవారం); దుర్ముహూర్తం: సా.4.51 నుండి 5.44 వరకు ; అమృత ఘడియలు: ఉ.5.55 నుండి 8.23 వరకు ; సూర్యోదయం : 5.32 ; సూర్యాస్తమయం: 6.34 ; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు ; యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

వనవాసంలో పల్నాడు ప్రజలు

పల్నాడు జిల్లాలో టీడీపీ గూండాగిరీకి చెట్టుకొకరు.. పుట్టకొకరు

- గ్రామంలో ఉండొద్దంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన వందల కుటుంబాల గెంటివేత
- టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగంలో బతకలేక తెలంగాణలో బంధువుల ఇళ్లలో తలదాచుకున్న బాధితులు


రాత్రి బంధువుల ఇళ్లల్లో, పొద్దంతా చెట్లకింద ఉంటున్న పిన్నెల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఏపీలో అధికారమే అండగా టీడీపీ నేతలు, కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఆ పార్టీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు రక్తపుటేర్లు పారించడం తెలిసిందే. ఇప్పుడు అధికారం కూడా తోడవడంతో వారు స్వైరవిహారం చేస్తున్నారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఊరి నుంచి తరిమేశారు. మహిళలు, వృద్ధులు, పిల్లలను సైతం తరిమికొట్టారు. చివరకు పోలీసులు కూడా టీడీపీ నేతలకే వంతపాడుతూ.. వెళ్లిపొమ్మని ఒత్తిడి చేయడంతో గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం వదిలి అజ్ఞాతవాసం చేస్తున్నారు. చెట్టుకొకరు, పుట్టకొకరు మాదిరిగా భయంతో పారిపోయి తలదాచుకుంటున్నారు. ఇలా పిన్నెల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వందల కుటుంబాలు గెంటివేతకు గురయ్యాయి. రాష్ట్రాన్ని వదిలేసి తెలంగాణకు వలస వెళ్లి అక్కడక్కడ కొందరు అద్దె ఇళ్లు తీసుకొని జీవనం సాగిస్తుండగా మరికొందరు బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. ఇలా తెలంగాణలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కృష్ణపట్టె ప్రాంతానికి తరలి వచ్చిన కుటుంబాలను కదిలిస్తే ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి గాథ.

వందల ఇళ్లు ధ్వంసం..

టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగంలో పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు గ్రామంలో బతకలేని పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ వారెవరూ గ్రామంలో ఉండడానికి వీల్లేదని గ్రామంలో దండోరా వేయించారంటే టీడీపీ నేతల దురాగతాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోంది. టీడీపీ గూండాలు దాడులు చేస్తూ అక్కడి ప్రజలను కట్టుబట్టలతో గ్రామాల నుంచి గెంటివేశారు. ఇంకోవైపు కాపాడాల్సిన పోలీసులే 'మీరు గ్రామంలో ఉండొద్దు.. ఉంటే గొడవలవుతాయి.. కాబట్టి వెళ్లిపోండి' అంటూ గ్రామస్తులను వేరే చోటకు పంపించివేస్తున్నారు. గ్రామంలో దాదాపు 3,700 కుటుంబాలు ఉంటే ఇప్పటివరకు 1,035 కుటుంబాలను వెళ్లగొట్టినట్లు చెబుతున్నారు. మరోవైపు 150 వరకు తాళాలు వేసి ఉన్న ఇళ్లు, కిటికీలు పగులగొట్టి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఇళ్లలో ఉన్న బియ్యాన్ని కూడా వదలకుండా పారబోసినట్లు వాపోయారు. గ్రామంలో ఉన్న దాదాపు 7 వేల ఓట్లలో వైఎస్సార్‌సీపీ కంటే టీడీపీకే 60 ఓట్లు అత్యధికంగా వచ్చినా, అసలు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులెవరూ గ్రామంలో ఉండడానికి వీల్లేదన్నట్టు వెళ్లగొట్టారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వలస కూలీలుగా బతకాల్సిన దైన్యం

గ్రామంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు, కార్యకర్తల్లో అత్యధికంగా బడుగు, బలహీన వర్గాల వారే. అయినా పేదలనే కనికరం లేకుండా వారిని టీడీపీ నేతలు వెళ్లగొట్టారు. దీంతో గ్రామంలో భూములు ఉండటంతో వ్యవసాయం చేసుకున్న రైతులు ఇప్పుడు వేరే ప్రాంతాలకు వెళ్లి వలస కూలీలుగా బతకాల్సిన దుస్థితి ఏర్పడింది. మరికొందరు చిన్నాచితకా పనులు చేసుకుంటున్నారు.

ఎంపీటీసీగా ఉండొద్దని హుకుం జారీ చేశారు..


మాది పిన్నెల్లి గ్రామం. ఎంపీటీసీ భర్తను. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలుపొందింది. దీంతో ఎంపీటీసీగా ఉండడానికి వీల్లేదని టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. మా గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నేత చింతపల్లి అన్ని గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందినవారెవరూ ఉండడానికి వీల్లేదని మమ్మల్ని బయటకు తరిమేశారు. పోలీసులు వారికే కొమ్ముకాస్తున్నారు.

– చింతపల్లి పెద్దసైదా (మాస్టర్), వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి, మాచవరం

కట్టుబట్టలతో గ్రామం విడిచివచ్చాం


టీడీపీ నేతలు మమ్మల్ని వెళ్లగొడితే కట్టుబట్టలతో గ్రామం విడిచివచ్చాం. మాకు వ్యవసాయం తప్ప వేరే పని తెలియదు. దీంతో కుటుంబ సభ్యులతో తెలంగాణలోని కృష్ణపట్టెకు వచ్చి వ్యవసాయ పనులు చేస్తున్నాం. ఇక్కడే రెండెకరాల పొలం కౌలుకు తీసుకున్నా. కొంత చెల్లించినా మిగతావి కట్టేందుకు డబ్బుల్లేవు.

– తొండా సైదు, రైతు, పిన్నెల్లి

మా ఇంటిని ధ్వంసం చేశారు..


ఎన్నికల్లో టీడీపీ గెలవగానే మా ఇంటిని క్రేన్‌తో ధ్వంసం చేశారు. బైకును తగలబెట్టారు. బీరువాలో ఉన్న డబ్బులు, బంగారం ఎత్తుకుపోయారు. మాకు 8 ఎకరాల పొలం ఉన్నా ప్రాణభయంతో వచ్చేశాం. మా ఇంటిలో ఉన్న పిల్లల సర్టిఫికెట్లు తీసుకురమ్మని మా బంధువులను పంపితే వారిని కూడా కొట్టి పంపారు. తిరిగి మా పైనే కేసులు పెట్టారు.

– గుంటూరు జమీల, పిన్నెల్లి

ఆడపిల్లలను బూతులు తిడుతూ బట్టలు తగలబెట్టారు..


టీడీపీ వాళ్లు మా ఇంటి తాళాలు పగులగొట్టి సీసాలు పగులగొట్టి ఇంట్లో వేశారు. ఇల్లంతా చిందర వందర చేశారు. మా అమ్మాయిలను బూతులు తిడుతూ బట్టలు తగలబెట్టారు.

– గుంటూరు బషీరున్, పిన్నెల్లి

అమ్మను రోడ్డుపై వదిలేశారు

- పటాన్‌చెరులో అమానవీయం


రోడ్డు పక్కన వృద్ధురాలు

పటాన్‌చెరు టౌన్ (హైదరాబాద్): వృద్ధురాలైన తల్లికి అండగా ఉండాల్సిన బిడ్డలు ఆమెను వదిలించుకున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు టౌన్‌లో శనివారం వెలుగుచూసిన ఈ సంఘటనపై పోలీసులు, స్థానికుల కథనమిది. మూడు రోజుల క్రితం శ్రీరామ్‌నగర్ కాలనీ సమీపంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద నిద్రిస్తున్న వృద్ధురాలిని కాలనీవాసులు గుర్తించారు. ఆమెకు అల్పాహారం పెట్టి.. పలకరిస్తే తన పేరు భారతమ్మ అని, జిన్నారం మండలం.. హనుమాన్ దేవాలయం పక్కన ఉంటానని పేర్కొంది. కుమారుడి పేరు పెంటయ్య అని చెబుతోంది. కుటుంబ సభ్యులు తీసుకొచ్చి వదిలి వెళ్లారంటూ విలపించింది. దీంతో కాలనీవాసులు పటాన్‌చెరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వృద్ధురాలి కుటుంబ ఆచూకీ కోసం వెతుకుతున్నారు. వృద్ధురాలు తన ఊరు జిన్నారం అని చెబుతోంది తప్ప.. ఏ గ్రామంలో నివసిస్తున్నదీ సరిగ్గా చెప్పలేకపోతోందని కాలనీవాసులు తెలిపారు.

రూ.101కే అంత్యక్రియలు

వేములవాడ మున్సిపాలిటీ తీర్మానం

వేములవాడ: నిరుపేదలు చనిపోతే దహనసంస్కారాలకు భారీ ఖర్చు అవుతుందని భావించిన వేములవాడ మున్సిపాలిటీ.. రూ.101కే అంత్యక్రియలు నిర్వహించాలని తీర్మానించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. నిరుపేదలకు దహన సంస్కారాలు భారం కాకూడదని రూ.101కే వైకుంఠరథం, కట్టెలు, డీజిల్, నీరు సరఫరా చేయాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మానించింది. వేములవాడ పట్టణం, రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు మరో 64 అంశాలపై చర్చించారు.

సాయిచంద్ లేని లోటు తీర్చలేనిది

ఉద్యమ గాయకుడు సాయిచంద్ వర్ధంతి సభలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు


సాయిచంద్ వర్ధంతి కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న కేటీఆర్, చిత్రంలో జగదీశ్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం (హైదరాబాద్): తెలంగాణ ఉద్యమంలో పాట, మాటలతో తనదైన ముద్ర వేసిన ఉద్యమ గాయకుడు వేద సాయిచంద్‌ను తెలంగాణ సమాజం మరువలేదని, ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, మాజీమంత్రి టి.హరీశ్‌రావులు పేర్కొన్నారు. శనివారం హస్తినాపురంలోని జీఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమ గాయకుడు వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..సాయిచంద్ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సాయిచంద్ మన మధ్య లేకపోయినా తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నారని అన్నారు. ''రాతి బొమ్మల్లోనా కొలువైన శివుడా''అనే పాట సాయిచంద్ పాడుతుంటే లక్షలాది మంది కన్నీళ్లు పెట్టుకునేవారని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో సాయిచంద్ లేని లోటు కనిపించిందని అన్నారు. సాయిచంద్ సతీమణి రజనీ మాట్లాడుతూ..సాయిచంద్ మరణం తర్వాత పార్టీ, ఉద్యమకారులు, కళాకారులు, అభ్యుదయవాదులు, అంబేడ్కర్ వాదులు, పలు సంఘాల నాయకులు తమకు అండగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు రూపొందించిన సాయిచంద్ సంస్మరణ సంచికను కేటీఆర్ విడుదల చేశారు. దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నాయకులు బాల్క సుమన్, రసమయి బాలకిషన్, సునీతా లక్ష్మారెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ గ్లాస్ కంపెనీపై కేసు

- మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యుడు

షాద్‌నగర్ (హైదరాబాద్): రంగారెడ్డి జిల్లా బూర్గులలోని సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన పేలుడు ఘటనపై షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈమేరకు పరిశ్రమ యాజమాన్యంపై 304, 336, 337, 338, 287 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి తెలిపారు. మరోవైపు పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై హైదరాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఇమ్మనేని రామారావు జాతీయ మానవహక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పరిశ్రమ యాజమాన్యం, రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్‌పై చర్యకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా, పేలుడు ఘటనపై నిష్ణాతులైన పోలీసు క్లూస్‌టీం పేలుడు సంభవించిన ప్రాంతంలో ఆధారాలను సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్ నివేదిక వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు పంపిస్తామని క్లూస్ టీం సభ్యులు తెలిపారు.

నాణ్యమైన సేవల నుంచే వ్యాపారం వృద్ధి

- నియాన్ని ఫర్నిచర్ షోరూమ్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి


ఫర్నిచర్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

అల్వాల్: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అల్వాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నియాన్ని ఫర్నిచర్ షోరూమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సీఈఓ ఆకాశ్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే అనేక ఫర్నిచర్ షోరూమ్‌లు ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా నియాన్ని ఫర్నిచర్ షోరూమ్ ఉంటుందన్నారు. ఆధునిక మోడల్స్‌తో పాటు వినియోగదారులకు అందుబాటులో ధరలు ఉంటాయన్నారు. 54 శాతం వరకు డిస్కౌంట్ ఆఫర్లు ఉన్నాయని చెప్పారు.

అమెరికాలో ఖమ్మం విద్యార్థి మృతి

- ఈతకు వెళ్లిన సమయంలో ప్రమాదం


శ్రీనాథరాజు కిరణ్

కల్లూరు రూరల్: ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి శ్రీనాథరాజు కిరణ్ (20) శనివారం అమెరికాలో మృతి చెందాడు. కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన కిరణ్ అమెరికాలో మిస్సోరీ స్టేట్‌లో ఉన్న శ్యాండిల్ ఎస్ టౌన్‌లో ఉంటూ ఎంఎస్ చదువుతున్నాడు. గతేడాది నవంబర్‌లో అమెరికా వెళ్లిన కిరణ్ తాను నివసిస్తున్న ప్రదేశానికి సమీపంలో ఈత కొట్టేందుకు ముగ్గురు మిత్రులతో కలిసి వెళ్లాడు. అయితే, ఈతకొలను ఎనిమిది అడుగుల మేర ఉండగా అందరూ దిగడంతో కిరణ్‌కు ఈత రాక నీళ్లలో మునిగిపోయాడు. మిగిలిన మిత్రులకు కూడా ఈత రాకపోవడంతో నీట మునుగుతున్న కిరణ్‌ను చూస్తూ నిస్సహాయులుగా మిగిలిపోయారని తెలుస్తోంది. కాగా, కిరణ్ తండ్రి లక్ష్మణ్‌రాజు గతంలోనే చనిపోగా తల్లి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటోంది. వీరి బాధ్యతలను కిరణ్ తాత కృష్ణమూర్తిరాజు చూస్తున్నారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన కిరణ్ చనిపోయినట్లు సమాచారం అందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

స్టార్మర్... సరికొత్త ఆశాకిరణం

బ్రిటన్‌లో మార్పుకు సారథి • లేబర్ పార్టీకి ఘనవిజయం సాధించి పెడతారంటూ అంచనాలు

కెయిర్ రాడ్నీ స్టార్మర్. ఈ 61 ఏళ్ల లేబర్ పార్టీ నాయకుని పేరు ఇప్పుడు బ్రిటన్‌లో మార్మోగుతోంది. ఆర్థిక ఇక్కట్లు మొదలుకుని నానా రకాల సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు ఆయనలో తమ నూతన నాయకున్ని చూసుకుంటున్నారని సర్వేలన్నీ చెబుతున్నాయి. జూలై 4న జరగనున్న ఎన్నికల్లో లేబర్ పార్టీని ఆయన ఘనవిజయం దిశగా నడిపించడం, ప్రధాని పీఠమెక్కడం ఖాయమని ఘోషిస్తున్నాయి. అదే జరిగితే 14 ఏళ్ల అనంతరం లేబర్ పార్టీని గెలుపు బాట పట్టించిన నేతగా స్టార్మర్ నిలవనున్నారు. సాక్షి, నేషనల్ డెస్క్



నిరుపేద నేపథ్యం..

దేశంలోనే పేరుమోసిన లాయర్. ఐదేళ్ల పాటు బ్రిటన్ చీఫ్ ప్రాసిక్యూటర్. ఆ హోదాలో రాజవంశానికి చేసిన సేవలకు గుర్తింపుగా లభించిన అత్యున్నత పౌర పురస్కారమైన సర్. ఇదంతా 61 ఏళ్ల స్టార్మర్ నేపథ్యం. దాంతో ఆయన సంపన్నుల ప్రతినిధి అంటూ కన్జర్వేటివ్ పార్టీ ప్రత్యర్థులు తరచూ విమర్శిస్తుంటారు. వీటన్నింటికీ తన నేపథ్యమే సమాధానమని సింపుల్‌గా బదులిస్తారు స్టార్మర్. కలవారి కుటుంబంలో పుట్టి, మల్టీ బిలియనీర్ కూతురిని పెళ్లాడిన తన ప్రత్యర్థి, ప్రధాని రిషి సునాక్‌దే సిసలైన సంపన్న నేపథ్యమంటూ చురకలు వేస్తుంటారు. స్టార్మర్ 1963లో లండన్ శివార్లలో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టారు. తండ్రి పనిముట్లు తయారు చేసే కార్మికుడు. తల్లి నర్సు. నలుగురు సంతానం కావడంతో నిత్యం డబ్బు కటకట మధ్యే పెరిగారాయన. తన నిరుపేద నేపథ్యాన్ని ఎన్నికల ప్రచారంలో స్టార్మర్ పదేపదే ప్రస్తావిస్తున్నారు. ''ద్రవ్యోల్బణమంటే ఏమిటో, కుటుంబాలను అది ఎంతగా కుంగదీస్తుందో నాకు చిన్నప్పుడే అనుభవం. ధరల పెరుగుదల ఎంత దుర్భరమో కన్జర్వేటివ్ పార్టీ నేతలందరి కంటే నాకంటే ఎక్కువగా తెలుసు. పోస్ట్‌మ్యాన్ వస్తున్నాడంటే చాలు, ఏ బిల్లు తెచ్చిస్తాడో, అది కట్టడానికి ఎన్ని ఇబ్బందులు పడాలో అని ఇంటిల్లిపాదీ బెదిరిపోయేవాళ్లం. ఫోన్ బిల్లు కట్టలేక నెలల తరబడి దాన్ని వాడకుండా పక్కన పెట్టిన సందర్భాలెన్నో'' అంటూ చేస్తున్న ఆయన ప్రసంగాలకు విశేష స్పందన వస్తోంది. తన కుటుంబంలో కాలేజీ చదువు చదివిన తొలి వ్యక్తి స్టార్మరే కావడం విశేషం. లీడ్స్ వర్సిటీ, ఆక్స్‌ఫర్డ్‌లో లా చేశారు. పేదరికమే తనలో కసి నింపి చదువుల్లో టాపర్‌గా నిలిచేందుకు సాయపడిందంటారు.

50 ఏళ్ల తర్వాత రాజకీయ అరంగేట్రం

50 ఏళ్లు దాటాక స్టార్మర్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2015లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. రెండు వరుస ఎన్నికల్లో పార్టీని గెలిపించడంలో జెరెమీ కోర్బిన్ విఫలం కావడంతో 2020లో లేబర్ పార్టీ పగ్గాలతో పాటు విపక్ష నేత బాధ్యతలు కూడా చేపట్టారు. వస్తూనే పార్టీలో అంతర్గతంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. బాధ్యతాయుతంగా, మేనేజర్ తరహాలో, కాస్త డల్‌గా కనిపించే వ్యవహార శైలి స్టార్మర్ సొంతం. ఆర్థిక సమస్యల సుడిగుండంలో చిక్కి సతమతమవుతున్న బ్రిటన్‌కు ఇప్పుడు కావాల్సిన సరిగ్గా అలాంటి నాయకుడేనన్నది పరిశీలకుల అభిప్రాయం. చరిష్మా ఉన్న నేత కంటే నమ్మకం కలిగించగల నాయకుడినే బ్రిటన్‌వాసులు కోరుకుంటున్నారని చెబుతున్నారు. అందుకు తగ్గట్టే నాలుగేళ్లుగా విపక్ష నేతగా తన పనితీరుతోనూ, కీలక విధానాంశాలపై స్పష్టమైన అభిప్రాయాలతోనూ ప్రజలను స్టార్మర్ బాగా ఆకట్టుకుంటూ వస్తున్నారు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, హౌజింగ్ సంక్షోభం వంటి పెను సమస్యల పరిష్కారంలో భారత మూలాలున్న తొలి ప్రధాని రిషి సునాక్ విఫలమయ్యారన్న అభిప్రాయం దేశమంతటా బాగా విన్పిస్తోంది. ఈ నేపథ్యంలో 14 ఏళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనకు తెర పడటం ఖాయమన్న విశ్లేషణలే విన్పిస్తున్నాయి. అందుకే కొద్ది రోజులుగా వెలువడుతున్న ఎన్నికల సర్వేలన్నీ లేబర్ పార్టీ ఘనవిజయం ఖాయమని చెబుతున్నాయి.

> "లేబర్ పార్టీకి ఓటు రాజకీయ, ఆర్థిక స్థిరత్వానికి ఓటు"
> - కెయిర్ స్టార్మర్

విజయమే లక్ష్యంగా...

కన్జర్వేటివ్ పార్టీ పాలనపై దేశమంతటా నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను స్టార్మర్ ముందుగానే పసిగట్టారు. అందుకే ఘనవిజయమే లక్ష్యంగా కొద్ది నెలలుగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. బ్రెగ్జిట్ తప్పుడు నిర్ణయమంటూనే తాను అధికారంలోకి వస్తే దాన్ని సమీక్షించబోనని చెబుతున్నారు. ఇది ఆయన సిద్ధాంతరాహిత్యానికి నిదర్శనమన్న కన్జర్వేటివ్ నేతల విమర్శలను తేలిగ్గా తోసిపుచ్చుతున్నారు. తాను కేవలం మెజారిటీ ప్రజల ఆకాంక్షలను అంగీకరిస్తున్నానంటూ దీటుగా బదులిస్తున్నారు. ''నేను కార్మిక కుటుంబం నుంచి వచ్చాను. జీవితమంతా పోరాడుతూనే వస్తున్నా. ఇప్పుడు దేశ ప్రజల స్థితిగతులను మెరుగు పరిచి వారికి బంగారు భవిష్యత్తు అందించేందుకు మరింతగా పోరాడతా'' అంటూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. 'పార్టీ కంటే దేశమే ముందు' నినాదంతో దూసుకుపోతున్న స్టార్మర్‌లో బ్రిటన్ ప్రజలు ఇప్పటికే తమ ప్రధానిని చూసుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. 18 ఏళ్ల కన్జర్వేటివ్ పాలనకు 1997లో తెర దించిన టోనీ బ్లెయిర్ ఫీటును ఈసారి ఆయన పునరావృతం చేస్తారన్న భావన అంతటా వ్యక్తమవుతోంది.

కొసమెరుపు

లేబర్ పార్టీ తొలి నాయకుడు కెయిర్ హార్డీ మీద అభిమానంతో స్టార్మర్‌కు తల్లిదండ్రులు ఆయన పేరే పెట్టుకున్నారు. ఇప్పుడదే లేబర్ పార్టీకి ఆయన నాయకునిగా ఎదగడం విశేషం!

ప్రస్తుత బలాబలాలు

బ్రిటన్ పార్లమెంట్ లో దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ కామన్స్‌లోని 650 స్థానాలకు జూలై 4న ఎన్నికలు జరగనున్నాయి. మెజారిటీ మార్కు 326.

పార్టీ	స్థానాలు
కన్జర్వేటివ్	344
లేబర్	205
ఎస్ ఎన్ పీ	43
లిబరల్ డెమొక్రాట్స్	15
ఇతరులు	43

రెండు రోజుల్లో నీట్-పీజీ పరీక్ష షెడ్యూల్


విద్యాశాఖ మంత్రి ప్రధాన్ వెల్లడి

న్యూఢిల్లీ: నీట్-పీజీ పరీక్షల కొత్త షెడ్యూల్‌ను నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) ఒకటి రెండ్రోజుల్లో ప్రకటిస్తుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. నీట్-పీజీ పరీక్ష ప్రశ్నపత్రం డార్క్ నెట్‌లో లీకైందని, టెలిగ్రామ్ యాప్‌లో షేర్ చేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేస్తోందన్నారు. కీలకమైన పోటీ పరీక్షల్లో పేపర్ లీకవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో గతవారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను ముందు జాగ్రత్తగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. అలాగే జూన్ 18న జరిగిన యూజీసీ-నెట్ పరీక్ష సైతం రద్దయ్యింది.

ఫలితం తేల్చని ఇరాన్ ఎన్నికలు

- 60% మంది ఓటింగ్‌కు దూరం
- అధ్యక్ష పదవికి జూలై 5న మళ్లీ పోలింగ్

దుబాయ్: ఇరాన్ అధ్యక్ష పదవికి శుక్రవారం జరిగిన పోలింగ్‌లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. దేశ చరిత్రలోనే అతి తక్కువ ఓటింగ్ నమోదైన నేపథ్యంలో ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న సంస్కరణవాది మసూద్ పెజెష్కియాన్‌కు గానీ ఛాందసవాది సయీద్ జలీలీకిగానీ మెజారిటీ దక్కలేదు. దేశ రాజ్యాంగం ప్రకారం పోలైన ఓట్లలో 50 శాతం పైగా సాధించిన వారే అధ్యక్షుడవుతారు. శుక్రవారం జరిగిన పోలింగ్‌లో అతి తక్కువగా 39.9 శాతం మందే ఓటేశారు. 60 శాతం మందికి పైగా ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయారు. మొత్తం 2.45 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోగా శనివారం వెలువడిన ఫలితాల్లో పెజెష్కియాన్‌కు 1.04 కోట్ల మంది, జలీలీకి 90.4 లక్షల మంది ఓటేశారని అధికారులు ప్రకటించారు. వీరితోపాటు బరిలో నిలిచిన పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘెర్ ఖలిబాఫ్‌కు 30.3 లక్షల ఓట్లు, షియా మత పెద్ద మొస్తాఫాకు 2.06 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఫలితాలు వెలువడ్డాక అధ్యక్ష బరి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన ఖలిబాఫ్ రెండో విడత పోలింగ్‌లో తన మద్దతు జలీలీకే ఉంటుందని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో జూలై 5వ తేదీన రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ పోలింగ్‌లో ఎక్కువ మందిని తన వైపు తిప్పుకోగలిగితేనే పెజెష్కియాన్‌కు గెలిచే అవకాశాలుంటాయి. లేకుంటే, సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ మద్దతున్న జలీలీదే పైచేయి అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇరాన్‌లో మరోసారి ఛాందసవాదులే అధికారంలోకి వస్తారని అంటున్నారు. 'నిరసన తెలపడం ప్రజల హక్కు. ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండటం ద్వారా ఇరాన్ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. అధ్యక్ష అభ్యర్థులతోపాటు ప్రస్తుత వ్యవస్థను సైతం వారు తిరస్కరించారు' అని లండన్‌లోని చాతం హౌస్‌లో మిడిల్ ఈస్ట్, నార్త్ ఆఫ్రికా ప్రోగ్రాం డైరెక్టర్ సనమ్ వకీల్ విశ్లేషించారు. అక్కడి వ్యవస్థల పట్ల ప్రజల్లో ఏ మేరకు ఉదాసీనత, నిరాశ గూడుకట్టుకునే ఉన్నాయనేందుకు ఇదే ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు.



సయీద్ జలీలీ — పెజెష్కియాన్



వర్షాలకు కూలిన రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్ పైకప్పు

రాజ్‌కోట్: ఢిల్లీ, జబల్పూర్‌లను అతలాకుతలం చేసిన వర్షాలు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లోనూ బీభత్సం సృష్టించాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ టర్మినల్ కూలిన మరుసటి రోజే మరో ఎయిర్‌పోర్ట్ వర్షాల బారిన పడింది. రాజ్‌కోట్‌లో అక్కడి భారీ వర్షాలకు సోమవారం ఉదయం రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల పికప్, డ్రాప్ ఏరియాపై నిర్మించిన భారీ టెంట్ కూలింది. అయితే ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. అయితే టెంట్ కూలిన ఘటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. '' ప్రధాని మోదీ స్వయంగా వచ్చి ఈ ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించారు. 11 నెలలకే పైకప్పు కూలింది. అవినీతి ఏ స్థాయిలో ఉందో కూలిన ఘటన చాటిచెప్తోంది. ఢిల్లీ మాదిరి ఘటన వేళ అక్కడ ఎవరైనా ఉంటే జరిగే ప్రాణనష్టానికి ఎవరు బాధ్యులు?. తరచూ అవినీతిపై ప్రసంగాలు దంచే ప్రధాని అవినీతిరహిత పాలనపైనా దృష్టిసారించాలి' అని గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షులు శక్తిసిన్హ్ గోహిల్ అన్నారు.

నెహ్రూను నిందించొద్దు: వ్యంగ్యంగా స్పందించిన బీజేపీ

రాజ్‌కోట్ ఘటనపై బీజేపీ వెటకారంగా స్పందించింది. '' నిన్నటి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ టర్మినల్ కూలిన ఘటనతో రాజ్‌కోట్ ఘటనను పోల్చొద్దు. రాజ్‌కోట్‌లో పెనుగాలులకు టెంట్ వస్త్రం చిరిగి అది పీలికలై పడిపోయింది. తక్కువ ఎయిర్‌పోర్ట్‌లు నిర్మించారని మీరు జవహర్‌లాల్ నెహ్రూను నిందిస్తారేమో. అలా చేయకండి. ఎందుకంటే ఆయన ఇన్ని విమానాశ్రయాలు నిర్మించలేరు. ఆయనకే మనం అవకాశం ఇచ్చి ఉంటే ఇప్పటికీ మనం రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అనుమతితో ఎడ్లబళ్లపై ప్రయాణాలు చేస్తూ ఉండేవాళ్లం' అని బీజేపీ ఐటీ విభాగ సారథి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు.

సైనిక విన్యాసాల్లో తీవ్ర విషాదం

- తూర్పు లద్దాఖ్‌లో ఎల్‌ఏసీ సమీపంలో నదిలో మునిగిన యుద్ధట్యాంకు
- నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ఐదుగురు జవాన్ల దుర్మరణం
- మృతుల్లో తెలుగు సైనికుడు, జేసీఓ ముత్తముల రామకృష్ణారెడ్డి

లేహ్/రాచర్ల: సైనిక విన్యాసాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విన్యాసాల్లో భాగంగా యుద్ధ ట్యాంకుతో నదిని దాటుతుండగా హఠాత్తుగా వరద పోటెత్తడంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి(జేసీఓ) ముత్తముల రామకృష్ణారెడ్డి సహా ఐదుగురు జవాన్లు మృత్యువాత పడ్డారు. తూర్పు లద్దాఖ్‌లో భారత్-చైనా సరిహద్దు వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) సమీపంలోని షియోక్ నదిలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయంలో ఈ దుర్ఘటన జరిగినట్లు సైనికాధికారులు వెల్లడించారు. లేహ్ నుంచి 148 కిలోమీటర్ల దూరంలోని మందిర్ మోర్హ్ వద్ద భారత సైన్యం విన్యాసాలు చేపట్టింది. ఈ విన్యాసాల్లో భాగంగా జవాన్లు యుద్ధ ట్యాంకులు నడుపుతూ షియోక్ నదిని దాటుతుండగా, టి-72 ట్యాంకు నదిలో ఇరుక్కుపోయింది. ఇంతలో ఎగువ ప్రాంతం నుంచి ఆకస్మికంగా వరద పోటెత్తింది. నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగిపోయింది. క్షణాల వ్యవధిలోనే టి-72 ట్యాంకు నీట మునిగిపోయింది. యుద్ధ ట్యాంకుపై ఉన్న ఐదుగురు సైనికులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగినప్పటికీ నదిలో వరద ఉధృతి అధికంగా ఉండడంతో జవాన్లను రక్షించలేకపోయాయి. నదిలో ఐదుగురి మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఐదుగురు జవాన్లు తూర్పు లద్దాఖ్ దౌలత్ బేగ్ ఓల్డీ మిలటరీ బేస్‌లోని 52 ఆర్మర్డ్ రెజిమెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. విన్యాసాల్లో పాల్గొంటూ దురదృష్టవశాత్తూ మరణించారు. ఈ సైనిక శిబిరం చైనా సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉంది. ఎగువ ప్రాంతాల్లో మంచు కరిగిపోవడం వల్లే షియోక్ నదిలో వరద ప్రవాహం హఠాత్తుగా పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. దేశ రక్షణ పరంగా వ్యూహాత్మకంగా కీలకమైన దెప్సాంగ్ ప్రాంతంలో ఈ నది ప్రవహిస్తోంది.

పదవీ విరమణకు ఆరు నెలల ముందు మృత్యువాత

తూర్పు లద్దాఖ్‌లో సైనిక విన్యాసాల్లో ప్రాణాలు కోల్పోయిన ముత్తముల రామకృష్ణారెడ్డి(47) స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాలువపల్లె. ఆయన భారత సైన్యంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరిలో రామకృష్ణారెడ్డి పదవీ విరమణ చేయాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు. ఆయనకు భార్య ఉమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుల చదువుల కోసం ఉమాదేవి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రామకృష్ణారెడ్డి మృతదేహం ఆదివారం సాయంత్రం కాలువపల్లెకు చేరుకోనున్నట్లు స్థానికులు చెప్పారు. రామకృష్ణారెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆయన భార్య ఉమాదేవి, కుమారులు కాలువపల్లెకు బయలుదేరారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్

వాస్తవాధీన రేఖ సమీపంలో ఐదుగురు సైనికులు మరణించడం పట్ల రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక సంతాపం ప్రకటించారు.

'నీట్-యూజీ' కేసులో దర్యాప్తు వేగవంతం

- జార్ఖండ్‌లో హిందీ పత్రిక జర్నలిస్టు అరెస్టు

న్యూఢిల్లీ: నీట్-యూజీ అక్రమాల కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. శనివారం గుజరాత్‌లోని ఏడు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. జార్ఖండ్‌లో ఓ హిందీ పత్రిక జర్నలిస్టు జమాలుద్దీన్ అన్సారీని అరెస్ట్ చేశారు. నీట్-యూజీ పేపర్ లీకేజీ కేసులో నిందితులైన హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎహసానుల్ హక్, వైస్ ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలామ్‌కు జమాలుద్దీన్ సహకరినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. గుజరాత్‌లోని ఆనంద్, ఖేడా, అహ్మదాబాద్, గోద్రా జిల్లాల్లో నిందితులకు సంబంధించిన నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జయ్ జలారామ్ స్కూల్ ప్రిన్సిపాల్ పురుషోత్తమ్, టీచర్ తుషార్, మధ్యవర్తులు విభోర్, ఆరిఫ్‌లను నాలుగు రోజులపాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ గోద్రా కోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గోద్రా, ఖేడా జిల్లాల్లో నీట్ పరీక్ష జరిగిన సెంటర్లు జయ్ జలారామ్ స్కూల్ యాజమాన్యం ఆధీనంలో ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు.

ఫలితాలు ప్రధానికి నైతిక ఓటమే

- దేశాభివృద్ధి చేయకున్నా ప్రధానిగా కొనసాగుతున్నారు
- మోదీపై సోనియా గాంధీ ఫైర్



న్యూఢిల్లీ: ఎన్‌డీఏ కూటమికి మెజారిటీ తగ్గిస్తూ తాజా లోక్‌సభ ఎన్నికల్లో వెలువడిన ప్రజాతీర్పు ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ, నైతిక ఓటమికి నిదర్శనమని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ విమర్శించారు. ఒక జాతీయ పత్రికలో రాసిన సంపాదకీయంలో మోదీ, ఎన్‌డీఏ ప్రభుత్వంపై సోనియా విమర్శలు సంధించారు. '' ఎన్నికల ప్రచారంవేళ తానొక దైవాంశ సంభూతుడిని అన్నట్లు స్వయంగా ప్రకటించుకుని 400 సీట్ల ఖాయమని భ్రమలో గడిపిన ప్రధాని మోదీకి జూన్ 4న వెల్లడైన ఫలితాలు ప్రతికూల సంకేతాలు చూపించాయి. విభజన, విద్వేష రాజకీయాలు, మోదీ పరిపాలనా విధానాలను ప్రజలు తిరస్కరిస్తున్నట్లు నాటి ఫలితాల్లో వెల్లడైంది. ఏకాభిప్రాయం ఉండాలని మోదీ వల్లెవేస్తారుగానీ ఆచరణలో అవేం ఉండవు. స్పీకర్ ఎన్నికలు ఇందుకు తార్కాణం. డెప్యూటీ స్పీకర్ పదవి విషయంలో విపక్షాల సహేతుక విజ్ఞాపనను పట్టించుకుంటే స్పీకర్ ఎన్నిక విషయంలో ప్రభుత్వానికి మేం సంపూర్ణ మద్దతు ఇస్తామని 'ఇండియా' కూటమి స్పష్టంచేసింది. అయినాసరే మోదీ వైఖరి మారలేదు. 17వ లోక్‌సభలోనూ డెప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు కేటాయించలేదు'' అని అన్నారు.

అంతటి మెజారిటీ మోదీ సర్కార్‌కు రాలేదు

''రాజ్యాంగంపై ఎన్‌డీఏ దాడి అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే లోక్‌సభ తొలి సెషన్‌లోనే ఎమర్జెన్సీ అంశాన్ని మోదీ సర్కార్ పదేపదే ప్రస్తావించింది. పార్టీలకతీతంగా, పక్షపాతరహితంగా వ్యవహరించాల్సిన స్పీకర్ కూడా అదే బాటలో పయనిస్తూ 'ఎమర్జెన్సీ'పై తీర్మానం చదవడం దిగ్భ్రాంతికరం. నాటి ఎమర్జెన్సీకి కారణమైన ఇందిరాగాంధీని ఆనాడు ప్రజలు తిరస్కరించినా తర్వాత సార్వత్రిక ఎన్నికల్లో ఆమెకు ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. భారీ మెజారిటీతో గెలిపించారు. అంతటి మెజారిటీ మోదీ సర్కార్‌కు కూడా రాలేదు'' అని సోనియా అన్నారు.

ఆ మూడు చట్టాల అమలు నిలిపేయాలి

''పార్లమెంట్‌లో దారుణమైన భద్రతావైఫల్యాన్ని ఎలుగెత్తిచాటినందుకు అక్రమంగా ఇరుసభల్లో 146 మంది విపక్ష సభ్యులను బహిష్కరించారు. వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే కీలకమైన మూడు నూతన నేర బిల్లులను ఎలాంటి చర్చ జరపకుండానే ఏకపక్షంగా చట్టాలుగా ఆమోదింపజేసుకున్నారు. బిల్లులను సంస్కరించాల్సిఉందని, చర్చ జరగాలని ఎందరో న్యాయకోవిదులు మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకే వీటిపై సమగ్ర చర్చ జరగాలి. అప్పటిదాకా ఈ నేర చట్టాల అమలును తాత్కాలికంగా నిలిపేయాలి'' అని సోనియా అన్నారు.

నీట్ లీకేజీలపై ప్రధాని మాట్లాడరా?

''లక్షలాది మంది యువత భవిష్యత్తును ఛిద్రం చేస్తూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతం వెలుగుచూస్తే మోదీ మాట్లాడరా? పరీక్ష పే చర్చా అంటూ తరచూ విద్యార్థులతో మాట్లాడే మోదీ ఈసారి ఎందుకు అదే విద్యార్థులకు మరోసారి పేపర్ లీక్ కాబోదని భరోసా ఇవ్వలేకపోతున్నారు? దారుణ నిర్లక్ష్యానికి విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలి. ఎన్‌సీఈఆర్‌టీ, యూజీసీ, విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలు గత పదేళ్లలో ఎంతగా పడిపోయాయో ఇట్టే అర్థమవుతోంది'' అని అన్నారు.

మరికొన్ని రోజులు అంతరిక్షంలోనే సునీతా విలియమ్స్!

వాషింగ్టన్: అమెరికాకు చెందిన ప్రఖ్యాత బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్‌తోపాటు బుచ్ విల్‌మోర్ మరికొన్ని రోజులు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారు కచ్చితంగా భూమిపైకి ఎప్పుడు తిరిగి వస్తారన్నది నాసా శాస్త్రవేత్తలు చెప్పలేకపోతున్నారు. స్టార్‌లైనర్‌లో తలెత్తిన కొన్ని లోపాలను ఇంకా సరిచేయకపోవడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో స్టార్‌లైనర్ మిషన్ వ్యవధిని 45 రోజుల నుంచి 90 రోజులదాకా పొడిగించాలని భావిస్తున్నారు. జూన్ 5న సునీత, విల్‌మోర్ అంతరిక్షంలోకి బయలుదేరారు. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో చివరి నిమిషంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. హీలియం గ్యాస్ లీకవుతున్నట్లు గుర్తించారు. థ్రస్టర్లు కూడా మొరాయించాయి. బోయింగ్ సైంటిస్టులు అప్పటికప్పుడు కొన్ని మరమ్మతులు చేయడంతో వ్యోమనౌక అంతరిక్షంలోకి చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం త్వరలో తిరిగి రావాల్సి ఉంది. కానీ, మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇవి పూర్తయిన తర్వాతే సునీత విలియమ్స్, విల్‌మోర్ భూమిపైకి చేరుకొనే అవకాశం ఉంది.



ఉత్తరాఖండ్ రాష్ట్రంలో భారీ వర్షాలకు హరిద్వార్‌లోని కొత్వాలి వద్ద గంగానది వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న కార్లు

ఉత్తరాదిన కుండపోత వర్షాలు

- రానున్న ఐదు రోజులపాటు వర్షసూచన
- ఢిల్లీలో 11కు చేరుకున్న మృతుల సంఖ్య

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం పలు ప్రాంతాల్లో భీకర వర్షం కురిసింది. ఉత్తరాదిన రానున్న ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలో వర్షాల ధాటికి మరణించిన వారి సంఖ్య 11కు చేరుకుంది. వసంత్ విహార్ ప్రాంతంలో కూలిపోయిన ఓ భవనం కింద చిక్కుకున్న ముగ్గురు కార్మికుల మృతదేహాలను శనివారం వెలికి తీశారు. నగరంలో వరుసగా రెండో రోజూ భారీగా వర్షపాతం నమోదైంది. శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో 8.9 మిల్లీమీటర్లు, లోధీ రోడ్డులో 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగరంలో 35.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయ్యింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. కాంగ్రా, కులూ, సోలన్ జిల్లాలో పలు రహదారులను మూసివేశారు. రాష్ట్రంలో ధరంపూర్‌లో గత 24 గంటల్లో 62.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉత్తరాఖండ్, రాజస్తాన్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి వర్షాలు కురుస్తున్నాయి.

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి కేజ్రీవాల్



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మరో 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజుల కస్టోడియల్ విచారణ ముగియడంతో కేజ్రీవాల్‌ను సీబీఐ అధికారులు శనివారం రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సునేనా శర్మ ఎదుట హాజరుపర్చారు. మద్యం కుంభకోణం కేసులో విచారణ నిమిత్తం ఆయనను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోరారు. ప్రత్యేక న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. కేజ్రీవాల్‌ను వచ్చే నెల 12వ తేదీ దాకా జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

తెలుగు అధికారికి ఎస్‌బీఐ పగ్గాలు!

- కొత్త చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి
- తాజాగా ప్రతిపాదించిన ఎఫ్ఎస్ఐబీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్యాంకింగ్ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన చైర్మన్‌గా సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టిని ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) శనివారం ఎంపిక చేసింది. ప్రస్తుతం ఆయన ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో అంతర్జాతీయ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్, టెక్నాలజీ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. ఆగస్టు 28న పదవీ విరమణ చేయనున్న దినేష్ కుమార్ ఖరా స్థానంలో బాధ్యతలు స్వీకరిస్తారు. శ్రీనివాసులు తెలుగు వారు కావడం విశేషం. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా పెద్దపోతులపాడు ఆయన స్వస్థలం. ఎస్‌బీఐలో ప్రొబేషనరీ అధికారిగా 1988లో కెరీర్ ప్రారంభించారు. ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థల డైరెక్టర్లను ఎంపిక చేసే ఎఫ్ఎస్ఐబీ.. ఎస్‌బీఐ కొత్త చైర్మన్ కోసం జూన్ 29న ముగ్గురు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి శ్రీనివాసులు పేరును ఖరారు చేసింది. ఎఫ్ఎస్ఐబీ సిఫార్సుపై ప్రధాని మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.

సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలు.. దీటుగా బదులిచ్చిన భారత సైన్యం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి పాకిస్తాన్ రేంజర్లు కవ్వింపు చర్యలకు దిగగా భారత ఆర్మీ వారికి దీటైన జవాబిచ్చింది. శుక్రవారం రాత్రి కృష్ణఘాటి సెక్టార్‌లోని ఫార్వర్డ్ పోస్ట్‌పైకి కాల్పులు జరపగా మన జవాన్లు ప్రతిగా కాల్పులు జరిపి తగిన బుద్ధి చెప్పారని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. స్వల్ప కాలం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎటువంటి నష్టం సంభవించలేదని ఆ వర్గాలు వివరించాయి. సరిహద్దుల ఆవలి నుంచి భారత భూభాగంలోకి ఉగ్రవాదుల చొరబాట్లకు వీలుకల్పించేందుకే పాక్ రేంజర్లు కాల్పులకు పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో గస్తీతోపాటు సోదాలను మరింత పెంచినట్లు ఆర్మీ తెలిపింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కశ్మీర్‌లో వార్షిక అమర్‌నాథ్ మొదలైన సమయంలోనే పాక్ ఆర్మీ కవ్వింపు చర్యలకు దిగటంతో సైన్యం అప్రమత్తమైంది.

బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ ఇవ్వాలి

- నితీశ్ సారథ్యంలో జేడీయూ సమావేశం తీర్మానం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజయ్ ఝా ఎన్నిక



సంజయ్ ఝా

న్యూఢిల్లీ: కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా ఉన్న జనతాదళ్(యునైటెడ్) ఎగ్జిక్యూటివ్ సమావేశం శనివారం జరిగింది. పార్టీ చీఫ్, బిహార్ సీఎం నితీశ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఆ పార్టీ కీలక తీర్మానాలు చేసింది. బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా స్పెషల్ ప్యాకేజీ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పేపర్ లీకేజీ ఘటనల్లో బాధ్యులపై తీవ్ర చర్యలు తీసుకోవడం ద్వారా వీటిని పునరావృతం కాకుండా చేయవచ్చని పేర్కొంది. ఈ సమావేశం నితీశ్‌కి నమ్మకస్తుడిగా, బీజేపీతో మంచి సంబంధాలున్న రాజ్యసభ ఎంపీ సంజయ్ ఝాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంది.

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

మంచు స్ఫటిక శివలింగాన్ని దర్శించుకున్న 13 వేల మంది

శ్రీనగర్: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ వార్షిక అమర్‌నాథ్ యాత్ర మొదలైంది. మొదటి రోజైన శనివారం అమర్‌నాథ్ గుహాలయంలోని స్ఫటిక శివలింగాన్ని 13 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. యాత్ర సందర్భంగా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. యాత్ర శుభప్రదం కావాలని ఆకాంక్షించారు. కాగా, శుక్రవారం సాయంత్రం జమ్మూలోని భగవతి నగర్ నుంచి బాల్టాల్, నున్వాన్ బేస్ క్యాంపులకు 4,603 మంది యాత్రికులు చేరుకోవడం తెల్సిందే. శనివారం ఉదయం వీరు బేస్ క్యాంపుల నుంచి 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న ఆలయాన్ని దర్శించుకునేందుకు బయలుదేరారు. అనంత్‌నాగ్ జిల్లాలోని 48 కిలోమీటర్ల నున్వాన్-పహల్గాం సంప్రదాయ మార్గం ఒకటి కాగా, గందేర్‌బల్‌లోని ఇరుకైన 14 కిలోమీటర్ల బాల్టాల్ మార్గం మరోటి. ఈ రెండు మార్గాల గుండా సాగే యాత్రను సీనియర్ అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నానికల్లా యాత్రికులు కశ్మీర్ లోయకు చేరుకున్నారు. అక్కడ వీరికి అధికారులు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 30 । జూన్ । 2024

విజయోత్సాహం


చార్మినార్ వద్ద సంబరాలు..

సాక్షి సిటీబ్యూరో: టీ-20 క్రికెట్‌లో విశ్వ విజేతగా నిలిచిన ఇండియాను చూసి విశ్వనగరం విజయోత్సాహంతో ఉప్పొంగిపోయింది. శనివారం విశ్వ విజేత కిరీటం కోసం జరిగిన తుది సమరాన్ని భారీ స్క్రీన్లు, ప్రత్యేక ఏర్పాట్లతో నగరవాసులు వీక్షించారు. వారి ఉత్సాహాన్ని నీరు గార్చకుండా అనుక్షణం ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో చివరకు భారత్ కప్ గెలవడంతో సిటీజనుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. భారత్ గెలుపుతో రోడ్ల మీదకు వచ్చిన నగరవాసులు టపాసులు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

నగరంలో రానున్న 24 గంటల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల సెల్సియస్ ఉండవచ్చు.

శుద్ధి సిద్ధించేలా!

రెండు ఎస్టీపీల ట్రయల్ రన్ షురూ


ఇప్పటికే ప్రారంభమైన కోకాపేటలోని ఎస్టీపీ

- ఫతేనగర్, ఖాజాకుంటలలో.. ప్రారంభించిన జలమండలి ఎండీ
- త్వరలో మరో ఆరింటికి శ్రీకారం
- 100% శుద్ధి చేసే తొలి నగరంగా ఖ్యాతి
- దక్షిణాసియాలోనే హైదరాబాద్ ఘనత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఫతేనగర్, ఖాజాకుంట ఎస్టీపీల ట్రయల్ రన్ ప్రారంభమైంది. ప్యాకేజీ-3 లో నిర్మిస్తున్న రెండు ఎస్టీపీలను శనివారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సందర్శించారు. ముందుగా ఫతేనగర్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన.. అక్కడ వెట్ వెల్, ఎస్బీఆర్, బ్లోయర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం.. వెట్‌వెల్ దగ్గర ఇన్‌లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. తర్వాత ఖాజాకుంట ఎస్టీపీకి వెళ్లారు. ఎస్టీపీ ప్రాంగణంలో పర్యటించి సీసీ రోడ్లు, లైటింగ్ పనుల్ని పరిశీలించారు. ముగింపు దశలో ఉన్న పనుల్ని పూర్తి చేసి.. ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం వెట్ వెల్ దగ్గర ఇన్‌లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. ఖాజాకుంట ఎస్టీపీని ఆనుకుని ఉన్న మిగిలిన ఖాళీ స్థలంలో ల్యాండ్ స్కేపింగ్, పూల మొక్కలతో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ రఘు, సీజీఎం, జీఎం, ఎస్టీపీ ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా మరో 6 ఎస్టీపీలు..

జలమండలి ఎస్టీపీ ప్రాజెక్టుల్లో నిర్మిస్తున్న వాటిలో.. ఇప్పటికే 4 ఎస్టీపీలు కోకాపేట, దుర్గం చెరువు, పెద్ద చెరువు, నల్లచెరువు) ప్రారంభమయ్యాయి. మరో 6 ఎస్టీపీలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో మీరాలం, మియాపూర్- పటేల్ చెరువు, సఫిల్ గూడ, వెన్నెల గడ్డ, నాగోల్ ఎస్టీపీలున్నాయి. ఆగస్టులో నల్లగండ్ల, ముల్ల కత్వా చెరువు, శివాలయ నగర్, పాలపిట్ట దగ్గర నిర్మిస్తున్న ఎస్టీపీలు త్వరలో ప్రారంభించనున్నారు.

వంద శాతం మురుగు శుద్ధి..

నగరంలో మురుగు నీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. రోజూ ఉత్పన్నమయ్యే మురుగు నీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా ఎస్టీపీల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టులో భాగంగా 3 ప్యాకేజీల్లో మొత్తం రూ.3866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్డీల సామర్థ్యం గల 31 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మిస్తోంది. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్టీపీల నిర్మాణం జరుగుతోంది. వీటి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే.. రోజూ ఉత్పన్నమయ్యే మురుగును 100 శాతం శుద్ధి చేసే తొలి నగరంగా దక్షిణాసియాలోనే హైదరాబాద్ చరిత్ర సృష్టించనుంది.

ప్యాకేజీలు ఇలా..

ప్యాకేజీ-1 లో అల్వాల్, మల్కాజిగిరి, కాప్రా, ఉప్పల్ సర్కిల్ ప్రాంతాల్లో రూ.1,230.21 కోట్లతో 8 ఎస్టీపీలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 402.50 ఎంఎల్డీల మురుగు నీటిని శుద్ధి చేస్తారు. ప్యాకేజీ-2లో రాజేంద్రనగర్, ఎల్బీ నగర్ సర్కిల్ ప్రాతాల్లో రూ.1355.13 కోట్లతో 6 ఎస్టీపీలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ 480.50 ఎమ్మెల్డీల మురుగు నీటిని శుద్ధి చేస్తారు. ప్యాకేజీ-3 కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రాంతాల్లో రూ.1280.87 కోట్ల వ్యయంతో 17 ఎస్టీపీలను ఏర్పాటు చేసి, ఇక్కడ 376.50 ఎమ్మెల్డీల మురుగు నీటిని శుద్ధి చేయనున్నారు.


ఎస్టీపీ ట్రయల్ రన్‌లో జలమండలి అధికారులు

ప్రస్తుతం ఇలా..

హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం ప్రతిరోజూ 1950 ఎంఎల్డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఇది జీహెచ్ఎంసీ ప్రాంతంలో 1650 ఎంఎల్డీలుగా ఉంది. ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా 772 ఎంఎల్డీల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేస్తున్నారు. ఇది దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అధికం. మిగిలిన 878 ఎంఎల్డీల మురుగు నీటిని శుభ్రం చేయడానికి రూ.3866.41 కోట్ల వ్యయంతో కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. 2036 వరకు ఉత్పన్నమయ్యే మురుగును వీటి ద్వారా శుద్ధి చేస్తారు.

విమానాశ్రయంలో విదేశీ కరెన్సీ పట్టివేత


పట్టుబడిన విదేశీ కరెన్సీ

శంషాబాద్: అక్రమంగా విదేశీ కరెన్సీ తీసుకెళ్తున్న వ్యక్తిని శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రం నుంచి దుబాయ్ వెళ్లేందుకు ఓ ప్రయాణికుడు సిద్ధం కాగా విశ్వసనీయ సమాచారం అందుకున్న డీఆర్ఐ అధికారులు అతడి ట్రాలీ బ్యాగును పరిశీలించారు. దాని అడుగుభాగంతో ప్రత్యేకంగా కుట్టిన జేబులో ఇండియా కరెన్సీలో 67.11 లక్షల విలువ చేసే యూఎస్ డాలర్లు బయటపడ్డాయి. కరెన్సీని స్వాధీనం చేసుకున్న అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఫెమా చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రూ.74 లక్షల విలువైన హెరాయిన్ స్వాధీనం


హెరాయిన్‌తో పట్టుబడిన అంబాలాల్

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కిషన్‌గూడలో ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసిన ఘటనలో రూ.74 లక్షల విలువైన హెరాయిన్ పట్టుబడింది. శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి విశ్వసనీయ సమాచారంతో శంషాబాద్ ఎస్ఐ రాజ్‌కుమార్ బృందం కిషన్‌గూడలోని ఓ ఇంటిపై దాడులు చేశారు. ఫర్నిచర్ వ్యాపారం చేసే అంబాలాల్ సూతార్ 618 గ్రాముల హెరాయిన్‌తో పట్టుబడ్డాడు. దాని విలువ రూ. 74 లక్షలు ఉంటుందని పోలీసులు నిర్ధారించారు. హెరాయిన్‌తో పట్టుబడ్డ వ్యక్తి దానిని వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఫర్నిచర్ వ్యాపారంతో పాటు అతడు హెరాయిన్‌ను మత్తుకు బానిసలైన వారికి విక్రయిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన మదన్ బిష్ణోయ్ లోహావత్, పరాస్‌జీ అనే వ్యక్తుల నుంచి అంబాలాల్ హెరాయిన్ కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. సరఫరా చేసిన ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బోడుప్పల్‌లో మేయర్, డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం


కార్పొరేటర్లను అభినందిస్తున్న శరత్ చంద్రారెడ్డి, వజ్రేష్ యాదవ్, సుధీర్‌రెడ్డి తదితరులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్‌పై శనివారం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు ప్రొసీడింగ్ ఆఫీసర్ వెంకట ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. దీంతో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్ తమ పదవులు కోల్పోయినట్లు తెలిపారు. తదుపరి ఆదేశాల మేరకు నూతన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తొలుత క్యాంపులో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు బస్సులో నేరుగా 10.30 గంటలకు బోడుప్పల్ నగర పాలక సంస్థకు చేరుకున్నారు. కార్యాలయం గేట్ వద్దనే అధికారులు కార్పొరేటర్ల పేర్లు చదివి, వారిని లోనికి అనుమతించారు. కార్పొరేటర్లు నేరుగా కౌన్సిల్ సమావేశం హాల్‌లోకి వెళ్లి కూర్చున్నారు. ప్రొసీడింగ్ ఆఫీసర్ వెంకట ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మేయర్ సామల బుచ్చిరెడ్డిపై, 12.30 గంటలకు డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాస తీర్మాన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది కార్పొరేటర్లు మాత్రమే పాల్గొన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు మరో నలుగురు కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. అవిశ్వాసంలో నెగ్గిన అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లను మేడ్చల్ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అభినందించారు.

బోగీ భాగ్యం

సాధారణ ప్రయాణికులకు భారీ ఊరట

ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అదనంగా 2 జనరల్ బోగీలు

- ప్రణాళికలను సిద్ధం చేస్తున్న రైల్వే బోర్డు

కిక్కిరిసిన బోగీల్లో ప్రయాణం చేసే సాధారణ రైలు ప్రయాణికుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. అన్ని ప్రధాన రైళ్లలో 2 జనరల్ బోగీలను చొప్పున అదనంగా ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 2 సాధారణ బోగీలు మాత్రమే ఉన్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో మరో 2 బోగీలను అదనంగా ఏర్పాటు చేస్తారు. ఇప్పటి వరకు సామాన్య ప్రయాణికులకు ఎలాంటి సదుపాయాలు లేని రైళ్లలో ఇవి అందుబాటులోకి రానున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల మధ్య ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తున్న లక్షలాది మంది సామాన్య ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైల్వేబోర్డు అదనపు బోగీల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. - సాక్షి, సిటీబ్యూరో



ద.మ. రైల్వే పరిధిలో 60 రైళ్లకు..

జనరల్ బోగీల కొరత వల్ల మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోధికులైన ప్రయాణికులు పడుతున్న బాధలపై పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా ఉద్యమాన్ని చేపట్టాయి. కాలు మోపేందుకు కూడా చోటు లేని బోగీల్లో ప్రయాణం చేసే క్రమంలో తరచూ ప్రమాదాలకు గురైన ఉదంతాలను కూడా సోషల్ మీడియా ఎత్తి చూపింది. దీంతో సాధారణ ప్రయాణికుల ఇక్కట్లను తొలగించే విధంగా దేశవ్యాప్తంగా సుమారు 800 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో 2 బోగీల చొప్పున అదనంగా ఏర్పాటు చేయాలని రైల్వేబోర్డు నిర్ణయించింది. దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఎల్‌హెచ్‌బి కోచ్‌లు (లింక్ హాఫ్‌మెన్ బుష్క్) ఉన్న సుమారు 60 రైళ్లలో అదనపు బోగీలను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వేలాది ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది.

నరకప్రాయంగా మారడంతో..

- సికింద్రాబాద్ నుంచి దానాపూర్‌నకు రాకపోకలు సాగించే దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రతిరోజూ జనరల్ బోగీ ప్రయాణం నరకప్రాయమే. ఈ ట్రెయిన్‌కు కేవలం రెండు బోగీలే ఉన్నాయి. కానీ.. బిహార్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు నగరానికి పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తారు. సాధారణ బోగీల్లో కేవలం 75 సీట్లు ఉంటాయి. ప్రయాణికులు మాత్రం వందలాది మంది ఉంటారు. ట్రెయిన్‌లో నిలుచునేందుకు కూడా స్థలం ఉండదు. దీంతో చాలామంది రిజర్వేషన్ బోగీల్లో చేరుతారు. ఇది ముందస్తుగా రిజర్వేషన్లు బుక్ చేసుకొని ప్రయాణం చేసేవారికి ఇది ఇబ్బందికరంగా పరిణమిస్తోంది.
- ఈ సమస్య ఒక దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కే పరిమితం కాదు. అన్ని ప్రధాన రైళ్లలోనూ బోగీల కొరత కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద వేలాడుతూ ప్రమాదాల బారిన పడిన ఉదంతాలు ఉన్నాయి. గంటల తరబడి టాయిలెట్లలో నిల్చుని ప్రయాణం చేస్తారు. హైదరాబాద్ నుంచి బిహార్, ఉత్తర ప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం తదితర రాష్ట్రాలకు వెళ్లే వలస కార్మికులకు ప్రయాణం నరకప్రాయమే. మరోవైపు దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండగ రోజుల్లో, వేసవి సెలవుల్లో ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం సాధారణ బోగీల్లో నరకం చవిచూస్తూనే ఉన్నారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్ రైళ్లకు మాత్రమే..

- ప్రమాదాల నియంత్రణలో భాగంగా జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు కలిగిన రైళ్లలోనే అదనపు బోగీలు ఏర్పాటు కానున్నాయి. ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలు ఉన్న రైళ్లకు అదనపు బోగీల ఏర్పాటు సాధ్యం కాదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అన్ని ఎల్‌హెచ్‌బీ బోగీలనే వినియోగంలోకి తెస్తున్నందు వల్ల దేశంలోని 800 ఎల్‌హెచ్‌బీ రైళ్లకు బోగీలను పెంచాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్‌హెచ్‌బీ కోచ్ రైళ్లకు ఇప్పటికే 2 బోగీలు ఉంటే మరో 2 బోగీలను అదనంగా ఏర్పాటు చేస్తారు. దీంతో వాటి సంఖ్య నాలుగుకు పెరగనుంది.

పలు మార్గాల్లో అమృత్ భారత్ రైళ్లు..

మరోవైపు సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులు, వలస కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ గత ఏడాది అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో హైదరాబాద్- దానాపూర్, హైదరాబాద్- ఢిల్లీ మార్గాల్లో అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టే ప్రతిపాదన ఉన్నట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అమృత్ భారత్ రైళ్లలో 11 సాధారణ, 9 స్లీపర్ క్లాస్ బోగీలు ఉంటాయి. దీంతో తక్కువ చార్జీలతో ప్రయాణికులు సాధారణ బోగీల్లో ప్రయాణం చేసే సదుపాయం ఉంటుంది. దేశవ్యాప్తంగా 100 అమృత్‌భారత్ రైళ్లను అందుబాటులోకి తేవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రథమ చికిత్సపై పోలీసులకు శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయంలో ఆస్పత్రికి వెళ్లే లోపు గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు. ఇదే లక్ష్యంగా పోలీసులకు ప్రథమ చికిత్సపై శిక్షణ అందించాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇందులో భాగంగా జీవీకే ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈఎంఆర్ఐ), సీఐఐలతో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ), సిటీ పోలీసులు భాగస్వామ్యమయ్యారు. ఇందులో భాగంగా జీవీకే ఈఎంఆర్ఐ ఎమర్జెన్సీ ఫస్ట్ రెస్పాండర్ ప్రోగ్రాం ద్వారా శనివారం వంద మంది అధికారులకు ఒక రోజు శిక్షణ అందించింది. ప్రాథమిక చికిత్స, వ్యక్తిగత రక్షణ, భద్రత, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై శిక్షణ అందించింది. అత్యవసర శ్వాస ప్రక్రియలు, ఛాతి భాగంగా వైద్యం, గాయాల చికిత్సలు తదితర అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స నైపుణ్యాలను నేర్పించారు. శిక్షితులకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీఎస్సీ సెక్రటరీ జనరల్ సి.శేఖర్ రెడ్డి, ట్రాఫిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బల్దియా ఎన్నికల్లో 96 స్థానాలు గెలవాల్సిందే

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

వెంగళరావునగర్: త్వరలో జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నగరంలో 96 స్థానాల్లో గెలవాల్సిందేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో శనివారం బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ స్థాయి నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు నగరంలో బీజేపీకి ఆదరణ బాగా పెరిగిందన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీ 8 సీట్లను కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీకి మరింత బలం చేకూరాలంటే కొత్తవారిని పార్టీలోనికి ఆహ్వానించాలని సూచించారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్, నాంపల్లి మినహా మిగిలినచోట్ల మంచి మెజార్టీ వచ్చిందని, ఈ రెండు నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా మహిళలు ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల పట్ల అత్యంత నియంతృత్వ ధోరణితో వ్యవహరించిందని, అందుకే తగిన గుణపాఠం చెప్పారని, కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపైనా ప్రజలకు విశ్వాసం లేదని, ఈసారి ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జయకేతనం ఎగురవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకెల దీపక్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు చింతల రామచంద్రారెడ్డి, గౌతం రావు, కిలారి మనోహర్, కీర్తిరెడ్డి, కుంభాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, బంగారు ప్రశాంత్, ఆలపాటి లక్ష్మీనారాయణ, సుప్రియా గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కత్తులతో రక్త చారికలు



వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి దారుణ హత్య

- నార్సింగి ఠాణా పరిధిలో యువకుడు..
- చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో రౌడీషీటర్..
- కేసుల దర్యాప్తు చేపట్టిన పోలీసులు



హత్యకు గురైన హిదాయత్ అలీ

మణికొండ: నగరంలో హత్యా కాండ కొనసాగుతూనే ఉంది. రక్త చారికలతో భీతావహ వాతావరణం నెలకొంది. గ్రేటర్ పరిధిలో ఇటీవల నిత్యం ఎక్కడో ఓ చోట హత్యా ఘటన చోటుచేసుకోవడంతో నగరవాసులు ఉలిక్కిపడుతున్నారు. శనివారం నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు దారుణ హత్యకు గురయ్యారు. నార్సింగి పరిధిలో ఒకరు, చాదర్‌ఘాట్ పరిధిలో మరొకరిని దుండగులు కత్తులతో పొడిచి చంపివేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రెండు ఘటనలు ఇలా ఉన్నాయి.

కారులో వచ్చి..

గోల్కొండ చోటాబజార్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హిదాయత్ అలీ (31) సౌదీలో ఇంజినీర్ ఉద్యోగ చేస్తున్నాడు. చోటాబజార్‌లో ఆయన ఇద్దరు సోదరులతో పాటు తల్లిదండ్రులు ఉంటున్నారు. 20 రోజుల క్రితం హిదాయత్ అలీ సౌదీ నుంచి నగరానికి వచ్చాడు. శనివారం రాత్రి తిరిగి సౌదీకి వెళ్లాల్సి ఉంది. ఉదయం 11 గంటల ప్రాంతంలో హిదాయత్ అలీ తన తండ్రి క్వాలిస్ వాహనాన్ని తీసుకొని బయటికి వచ్చాడు. నార్సింగి పోలీస్‌స్టేషన్ మంచిరేవుల ప్రాంతంలోని గ్రీన్ ల్యాండ్స్ వెంచర్‌లోని నిర్మానుష్య ప్రదేశంలో దారుణ హత్యకు గురయ్యాడు. కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడి చేయడంతో తీవ్ర గాయాలకు గురై హిదాయత్ అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో జరుగుతున్న దాడిని స్థానికంగా ఓ నిర్మాణ భవనంలో పని చేస్తున్న వారు గమనించి నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు వచ్చేసరికి నిందితులు పారిపోయారు. హిదాయత్ అలీ అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహం వద్ద రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హిదాయత్ అలీ శనివారం రాత్రి దుబాయ్‌కు వెళ్లాల్సిన సమయంలో ఇక్కడికి ఎందుకు వచ్చాడన్న విషయమై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కారణాలేమిటో..?

హిదాయత్ అలీ హత్యకు ఆర్థిక సమస్యలా.. పాత గొడవలా... ప్రేమ వ్యవహారమా? తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇద్దరు దాడి చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మరో సెల్‌ఫోన్ ఎవరిది అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గొంతు కోసి పరార్..


నజాఫలీ (ఫైల్)


రక్తపు మడుగులో నజాఫలీ

చాదర్‌ఘాట్: రౌడీషీటర్ హత్యకు గురైన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పురా ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ నజాఫలీ (46) వృత్తిరీత్యా వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. ఇతడు శుక్రవారం వెల్డింగ్ పనుల మీద వికారాబాద్‌కు వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి యాకత్‌పురా అలీకేఫ్‌లో టీ తాగి బంధువుల ఫోన్ కాల్‌తో మలక్‌పేట మెట్రో స్టేషన్ వద్దకు వచ్చాడు. అలీ కేఫ్ నుంచి ద్విచక్ర వాహనంపై మలక్‌పేటకు వస్తుండగా అతడిని ఇద్దరు వ్యక్తులు అనుసరించారు. తమ వెంట తెచ్చుకున్న కత్తులతో నజాఫలీని గొంతు కోసి హత్య చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ శ్యాంసుందర్, డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు జిషాన్ అలీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నజాఫలీపై రెయిన్‌బజార్‌లో ఇంతకు ముందు దాదాపు 25 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నజాఫలీ హత్య కేసులో ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడితో నిందితులకు బంధుత్వం ఉన్నట్లు సమాచారం.

హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం - వివరాలు 8లో

గ్రీన్‌సిగ్నల్

కోర్టు ఉత్తర్వులతో టీచర్ల బదిలీల్లో కదలిక

- జిల్లా వ్యాప్తంగా 3,500 మందికి స్థాన చలనం
- మరో 700 మందికి పదోన్నతులు లభించే అవకాశం
- జూలై 5వ తేదీలోగా ప్రక్రియ పూర్తికి ఆదేశం
- అర్హుల జాబితాను సిద్ధం చేసే పనిలో రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ

లాంగ్ స్టాండింగ్ (8 ఏళ్లు) వేకెన్సీ పొజిషన్

కేడర్	ఖాళీలు
సోషల్ స్టడీస్, ఎస్‌ఏ	91
తెలుగు, ఎస్‌ఏ	59
ఫిజికల్ సైన్స్, ఎస్‌ఏ	85
మ్యాథమెటిక్స్, ఎస్‌ఏ	47
ఇంగ్లిష్, ఎస్‌ఏ	67
హిందీ, ఎస్‌ఏ	30
బయాలాజికల్ సైన్స్, ఎస్‌ఏ	58
ఫిజికల్ ఎడ్యుకేషన్స్, ఎస్‌ఏ	06
క్రాఫ్ట్ టీచర్స్, ఎస్‌ఏ	06
ఆర్ట్ అండ్ డ్రాయింగ్, ఎస్‌ఏ	01



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధమైంది. కోర్టుకేసు కారణంగా కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఈ ప్రక్రియకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించడంతో అధికారులు ఆయా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల జాబితాను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న 3,500 మందికిపైగా ఉపాధ్యాయులకు స్థాన చలనం కల్పించడంతో పాటు సీనియార్టీ ఆధారంగా 700 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులతో పాటు కొత్త వారికి కూడా మళ్లీ అవకాశం కల్పించనున్నారు. ఈ నెల 28 నుంచి జూలై 5 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు.

షెడ్యూల్‌పై అభ్యంతరాల వెల్లువ

ఇతర జిల్లాలకు చెందిన అనేక మంది ఉపాధ్యాయులు తమకున్న రాజకీయ, ఆర్థిక పరపతితో జిల్లాకు వచ్చి చేరారు. దీంతో ఉద్యోగాల్లోనే కాకుండా బదిలీలు, పదోన్నతుల్లోనూ స్థానికులకు అన్యాయం జరుగుతూనే ఉంది. అడ్డదారుల్లో వచ్చిన ఈ ఉపాధ్యాయులందరినీ తిరిగి వెనక్కి పంపాలని కోరుతూ గతంలో కొంతమంది ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. తుది తీర్పు ఇంకా రాలేదు. కానీ ప్రభుత్వం తాత్కాలికంగా స్టేను వెకేట్ చేయించి, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసింది. ఇతర జిల్లాల్లో 20 రోజుల షెడ్యూల్ ఇవ్వగా, రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఎనిమిది రోజులే ఇవ్వడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి వచ్చిన 400 మందికిపైగా ఉపాధ్యాయులను వెనక్కి పంపకుండా, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడుతుండటంతో స్థానికత అర్హత ఉన్న, సీనియార్టీ ఉన్న ఉపాధ్యాయులు మళ్లీ నష్టపోయే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. షెడ్యూల్ సమయాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

పారదర్శకంగా నిర్వహించాలి

తెలుగు మీడియం (ఎస్జీటీ కేడర్) ఇంగ్లిష్ సబ్జెక్టులో 42 మంది, ప్రైమరీ స్కూలు హెచ్‌ఎంలు 111 మంది, గణితం సబ్జెక్టులో 102 మంది, ఫిజికల్ సైన్స్‌లో 24, సోషల్ స్టడీస్‌లో 213 మంది, అదే విధంగా (ఎస్జీటీ ఉర్దూ మీడియం) బయాలజికల్ సైన్స్‌లో 8 మంది, గణితం (ఉర్దూ మీడియం)లో ముగ్గురు, ఫిజికల్ సైన్స్ (ఉర్దూ మీడియం)లో ముగ్గురు, సోషల్ (ఉర్దూ మీడియం)లో 15 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. వీరితో పాటు మరో మూడు వందల మంది ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా, ఇతర కేడర్లలో పదోన్నతులు లభించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సేవ్ రంగారెడ్డి ఉద్యమ సంస్థ కోర్ కమిటీ సభ్యుడు బొడ్డు రవి డిమాండ్ చేశారు. వీలైతే షెడ్యూల్ తేదీని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఏడీ నందసుఖేషినికి వినతి పత్రం అందజేశారు.

ఘనంగా వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న క్యూరేటర్ డాక్టర్ సునీల్ హీరేమత్ తదితరులు

బహదూర్‌పురా: 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని నెహ్రూ జూలాజికల్ పార్కులో శనివారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర జూ అథారిటీ ఆదేశాల మేరకు మెగా ప్లాంటేషన్ ప్రచారాన్ని హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ హీరేమత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్క్‌లో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వివిధ మొక్కలను సందర్శకులకు పంపిణీ చేశారు.

సమస్యకు సత్వర పరిష్కారం చూపాలి



డయల్ యువర్ ఎండీ కార్యక్రమంలో వినియోగదారుల సమస్యలను వింటున్న దృశ్యం

– జలమండలి ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: వినియోగదారుల ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి సాధ్యమైనంత తొందరగా వాటిని పరిష్కరించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఎండీ కార్యక్రమంలో ఆయన పాల్గొని వినియోగదారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి భరోసా ఇచ్చారు. సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు జరిగిన డయల్ యువర్ ఎండీ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 13 మంది వినియోగదారులు ఫోన్ చేశారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, నల్లా కనెక్షన్, లో ప్రెజర్ తదితర వాటిపై ఫిర్యాదు చేశారు. వాటిని నమోదు చేసుకొని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎండీ ఆదేశించారు. పలువురు వినియోగదారులతో సంబంధిత జనరల్ మేనేజర్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని ఒకే ప్లాట్ ఫాం పైకి తీసుకురావాలన్నారు. అలా చేస్తే.. వాటి కేటగిరీని బట్టి విశ్లేషించి చాలా వరకు సులభంగా పరిష్కారం చూపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం



అనిల్ (ఫైల్)

జగద్గిరిగుట్ట: వివాహేతర సంబంధం ఓ వ్యక్తి దారుణ హత్యకు దారి తీసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులుమేరకు.. మెదక్ జిల్లా ముప్పారం గ్రామానికి చెందిన గాజుల అనిల్ (40) జగద్గిరిగుట్ట వెంకటేశ్వర నగర్‌లో ఉంటూ అంబులెన్స్ సర్వీసులు నిర్వహిస్తుంటాడు. ఇతనికి భార్య భాగ్యలక్ష్మి, ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. భాగ్యలక్ష్మి టిఫిన్ సెంటర్ నడుపుతోంది. ఆదే టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్న కృష్ణవేణితో అనిల్ కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. కొద్దిరోజులుగా భాగ్యలక్ష్మి ప్రవర్తనలో మార్పు కనిపిస్తుందని అనిల్ తన స్నేహితులతో చెప్పేవాడని తెలిసింది. టిఫిన్ సెంటర్‌లో పనిచేసే మల్లేష్‌తో చనువుగా ఉంటున్నట్లు బాధపడేవారని, ఇదే విషయమై భాగ్యలక్ష్మితో శుక్రవారం అర్ధరాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అంబులెన్స్ డ్రైవర్ నవీన్ ఫోన్ చేసి అనిల్ రక్తపు గాయాలతో పడి ఉన్నాడని, మల్లారెడ్డి ఆసుపత్రికి రమ్మని తన తోటి డ్రైవర్ సురేష్‌కి ఫోన్ చేసాడు. ఆసుపత్రికి వెళ్లి చూడగా అతని ఛాతీపై పదునైన కత్తితో పొడిచి, గొంతు కోసిన ఆనవాళ్ల ఉండడంతో అనుమానం వచ్చి అక్కడే ఉన్న భాగ్యలక్ష్మీ, మల్లేష్‌ను ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సురేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భాగ్యలక్ష్మీ, మల్లేష్ కృష్ణవేణినిలను, ఇంకా మరికొంత మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. సంఘటనాస్థలాన్ని ఏసీపీ హనుమంతరావు, సీఐ క్రాంతి కుమార్ పరిశీలించారు.

హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి

నాగోలు: హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఈ ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్‌లోని ఆదిత్యనగర్‌లోని సాయి హర్ష రెసిడెన్సీ ఎస్‌బీఐ బ్యాంక్‌పై హుక్కా సెంటర్ నడుపుతున్నట్లు పోలీసులకు సమచారం వచ్చింది. దీంతో పోలీసులు శుక్రవారం రాత్రి (ఎల్‌ఓసీ) కేఫ్ హుక్కా సెంటర్‌పై దాడి చేశారు. అక్కడ ఓపెన్ ప్లేస్‌లో హుక్కా సెంటర్ నడుపుతున్న మేనేజర్ యర్రిబోయిన జయంత్ అరెస్టు చేసి అతని వద్ద నుంచి 3 హుక్కా కుండలు, హుక్కా పైపులు 3, స్వాధీనం చేసుకున్నారు. కోట సందీప్‌రెడ్డి హుక్కా సేవిస్తూ పోలీస్‌లను చూసి పారిపోయాడని విచారణలో ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి శనివారం జయంత్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

నేడు టీ హబ్‌లో సదస్సు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సోషియా వుడ్ 2024 సమ్మిట్' ఆదివారం నగరంలో నిర్వహించనున్నట్లు ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ రచమల్ల తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో డాక్టర్ విజయ్ భాస్కర్‌తో కలసి కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో 350 మంది పాల్గొంటారన్నారు. ఈ ఈవెంట్ డిజిటల్ కమ్యూనిటీలో ఒక మైలురాయిగా మారుతుందని తెలిపారు. టీ హబ్ మార్వెల్ 5వ అంతస్తులోఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ హాజరవుతారన్నారు.

చర్లపల్లి జైలులో అదాలత్



చర్లపల్లి జైల్‌లో జైల్ అదాలత్..

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 38 మంది ఖైదీలకు సంబంధించి 33 కేసులను పరిష్కరించారు. ఖైదీలకు సత్వర న్యాయసాయం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న జైల్ అదాలత్ ఖైదీలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ అదాలత్‌లో న్యాయమూర్తులు బి. ఉషాక్రాంతి, గోపిక నాగ శ్రావ్య న్యాయసాయం అందజేయగా జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్, డిప్యూటి పర్యవేక్షణాధికారులు శశికాంత్, కాళిదాసు, సిబ్బంది రత్నం, పరుశరాం, సత్తయ్య, సాయి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు అమ్మవారి ఆలయం ముస్తాబు

గోల్కొండ: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు గోల్కొండ కోటపై కోలువుదీరిన జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయం ముస్తాబవుతుంది. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు ఆదేశాల మేరకు ఆలయం వద్ద పనులు జోరుగా జరుగుతున్నాయి. ఆలయ పరిసరాల్లో ఆకట్టుకునే రంగులు వేసే పనులు పూర్తయ్యాయి. అమ్మవారి ఆలయం, ఆలయ మెట్లకు రంగులు వేయడం కుండా పూర్తవుతుందని ఆయన తెలిపారు. జులై 7న మొదటి బోనం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్

శంకర్‌పల్లి: అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో ఓ తహసీల్దార్, వీఆర్‌ఓపై కేసు నమోదుయింది. బాలాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన అంజయ్య 2022లో శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలో 22 గుంటల భూమిని రాములమ్మ, శ్రీకాంత్ యాదవ్ నుంచి జీపీఏ చేసుకున్నాడు. ఈ భూమిని 2005 సెప్టెంబర్ 24న రికార్డులు మార్చి అప్పటి తహసీల్దార్ బి.మోహన్‌రావు, వీఆర్‌ఓలు ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకుండా వేరే గ్రామానికి చెందిన ఫైల్ నంబర్ బి/2500/2005 పై జంగంపేట మాణిక్‌రెడ్డి కొనుగోలు చేసినట్లుగా మ్యుటేషన్ చేశారు. రాములమ్మ, శ్రీకాంత్ 2016లో విషయం తెలుసుకుని చేవెళ్ల కోర్టులో కేసులు వేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో 2022 డిసెంబర్ 29న కదారి అంజయ్యకు జీపీఏ చేశారు. అనంతరం అంజయ్య ఆర్టీఐ కింద పత్రాలు సేకరించి, హైకోర్టులో కేసు వేసి, శంకర్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. 2024 మే1న లోకాయుక్తలో కేసు ఫైల్ చేయగా..తహసీల్దార్ బి.మోహన్‌రావు, వీఆర్‌ఓ, అక్రమ కొనుగోలు చేసిన జంగంపేట మాణిక్‌రెడ్డిలపై కేసు నమోదు చేయాలని సైబరాబాద్ సీపీ, శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓలకు లోకాయుక్త జూన్ 28న ఆదేశించింది. లోకాయుక్త ఆదేశాల మేరకు వారి ముగ్గురిపై కేసు నమోదు చేశామని శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న సీఎన్ రెడ్డి, తహసీల్దార్ నయీమొద్దీన్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి, తహసీల్దార్ నయీమొద్దీన్

రహమత్‌నగర్ : ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి 336 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ తహసీల్దార్ నయీమొద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ రాజ్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ సతీమణి, కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తానాతో పాటు బోరబండ, రహమత్‌నగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి నవీన్‌నగర్ బస్తీ బీఆర్ఎస్ నాయకులు

ఎస్పీఆర్‌హిల్స్ నవీన్‌నగర్ బస్తీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజు, వినాయకనగర్ నాయకుడు హరీశ్ తమ అనుచరులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సీఎస్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు అంతయ్య, శాంతకుమార్, అడవయ్య, మన్సూర్, షరీఫ్, భాస్కర్, సంజీవ్ రావు, రవిశంకర్, సింగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసాభాసగా చెక్కుల పంపిణీ

పంజగుట్ట: జూబ్లీహిల్స్ నియోజకవర్గ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసాభాసగా మారింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డిలు ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. బోరబండ కార్పొరేటర్ బాబాఫసియిద్దీన్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆయన భార్య చెక్కుల పంపిణీకి రాగా ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి కార్పొరేటర్ భార్య ఎలా వస్తుందని అక్కడున్న బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న ఖైరతాబాద్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరుపక్షాలవారిని అక్కడనుండి తరలించారు. తహసీల్ కార్యాలయానికి వచ్చే రెండు దారులను రోప్ సాయంతో మూసివేశారు. గొడవ సద్దుమణిగాక ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్‌తో కలిసి చెక్కులు అందజేశారు. పంపిణీ చేశారు.

పనుల్లో అలసత్వం చేస్తే సహించం

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- ఖైరతాబాద్ జోనల్ విభాగాల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని, అలసత్వం చేస్తే సహించేది లేదని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఖైరతాబాద్ జోనల్ వివిధ విభాగాల అధికారులతో పెండింగ్ సమస్యలు, పనుల పురోగతిపై శనివారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖలవారీగా తమ పరిధిలోని పనులను ఎప్పుడు పూర్తి చేయాలో డెడ్‌లైన్ విధించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో పోచమ్మ గుడి వద్ద రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, మిగతా చోట్ల కూడా వెంటనే షురూ చేయాలన్నారు. జులై 15 లోగా జలమండలి పరిధిలోని పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని జీఎం హరిశంకర్ మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో క్యాచ్‌పిట్స్‌ను శుభ్రం చేయాలన్నారు. మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ బంజారాహిల్స్ మిగతా డివిజన్లకు రోల్ మోడల్‌గా ఉండాలని, అయితే ఇంజినీర్ల అలసత్వం వల్ల పనులు మాత్రం ముందుకుసాగడం లేదని సర్కిల్–18 ఈఈ విజయ్‌కుమార్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అందరూ ఐక్యంగా పనిచేస్తేనే పనుల్లో పురోగతి కనిపిస్తుందని, పనులు ముందుకుసాగకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని ఈఈ విజయ్‌కుమార్‌ను హెచ్చరించారు. వచ్చే జనవరి ఫస్ట్ నాటిని ఎన్‌బీటీనగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పూర్తి చేసి యువకులు ఆడుకునేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఇక్కడే మహిళా భవన్ పనులు కూడా త్వరగా పూర్తిచేయాలన్నారు. శ్రీరామ్‌నగర్‌లో కమ్యూనిటీహాల్ పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని హిందూ శ్మశానవాటికను సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేసేందుకు ముందుకువస్తున్నారని, సోమవారం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఎన్‌బీటీనగర్ అయ్యప్ప ఆలయం పక్కన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత విభాగం అధికారులకు సూచించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీసీ ప్రశాంతి, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ్‌కుమార్, ఎలక్ట్రికల్ ఈఈ ఇంద్రదీప్, జలమండలి జీఎం హరిశంకర్, సెక్షన్ మేనేజర్లు రాంబాబు, శివకుమార్, ఏఎంఒహెచ్ డాక్టర్ రవి, ఎంటమాలజీ విభాగం అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రంగంలోనూ శరవేగంగా ఏఐ టెక్నాలజీ



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న రవి కుమార్

బంజారాహిల్స్: ప్రస్తుతం ఏ రంగంలో చూసినా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ దూసుకుపోతున్నదని కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌పోజెనిక్స్–24 పేరుతో ఏఐ ఎక్స్‌పో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు రోజురోజుకు టెక్నాలజీ మారిపోతున్నదని, దానికి అనుగుణంగా అప్‌డేట్ కావాలని సూచించారు. వినూత్నంగా ఆలోచించడంతో పాటు విభిన్న ప్రాజెక్టులు రూపకల్పన చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఏఐ ఎక్స్‌పోలో కాలేజీకి చెందిన 76 బృందాలు పాల్గొన్నట్లు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావెద్ తెలిపారు. లాట్ సెన్సార్స్, ఏఆర్–వీఆర్, టెలిమెడిసిన్, ఫిన్‌టెక్‌లతో పాటు పలు రకాల టెక్నాలజీ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ మీర్ అక్బర్ అలీఖాన్, డాక్టర్ ఫర్హతుల్లా హుస్సేని, ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ రావత్, ప్రొఫెసర్ ఉమ ఎస్ దుల్హారే, రిజిస్ట్రార్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బసవతారకంలో సార్కొమా కేన్సర్‌పై సదస్సు



సదస్సుకు హాజరైన వైద్య నిపుణులు

బంజారాహిల్స్: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఎముకలు, మృదు కణజాలాల్లో అభివృద్ధి చెందే సార్కొమా అనే అరుదైన కేన్సర్ వ్యాధిపై రెండు రోజుల సదస్సు శనివారం ప్రారంభమైంది. బసవతారకం కేన్సర్ ఆసుపత్రి, తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీలు సంయుక్తంగా సదస్సును నిర్వహిస్తున్నాయి. ముఖ్యఅతిథిగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కే కృష్ణయ్య, విశిష్ట అతిథిగా ప్రముఖ రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు తమ అనుభవాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా ఇతర వైద్యులు తమ నైపుణ్యానికి మరింత పదునుపెట్టుకునేందుకు వీలుంటుందన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు ఆధునిక చికిత్స పద్ధతులతో పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ టీఎస్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ ఫణి కోటేశ్వరరావు, అకాడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ కల్పనా రఘునాథ్, చెన్నైకు చెందిన ప్రముఖ మస్కిలోస్కెలిటల్ అంకో సర్జన్ డాక్టర్ ఆనంద్‌రాజా, పంజాబ్‌కు చెందిన సర్జన్ డాక్టర్ ఆసిష్ గులియాతో పాటు శ్రీనాథ్‌గుప్తా, సృజన్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో కష్టపడితేనే లక్ష్య సాధన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న క్రీడాకారులు

హిమాయత్‌నగర్: అకింతభావంతో కష్టపడితేనే లక్ష్యాన్ని సాధించవచ్చని క్రీడాకారులు అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్పోర్ట్స్ అకాడమీ 2023–24 సంవత్సరానికి గాను విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు సల్లా ప్రసాద్, సందీప్ గౌడ్, ఉమెన్ క్రికెటర్ సందీప్ భావంక, హైదరాబాద్ రంజీ ప్లేయర్ హాజరయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ నిర్ణయం, సంకల్పం, అంకితభావం అనే మూడు ఉంటే జీవితంలో విజయం సాధించవచ్చన్నారు. పాఠశాల డైరెక్టర్ ప్రార్థనా మణికొండ మాట్లాడుతూ ఆక్స్‌ఫర్డ్ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా కృషిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీన్ రామాంజుల, హెచ్ఎం ఫహ్మిదా, సీహెచ్ రేఖారావు, ఫాతిమా, కరస్పాండెంట్ కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

పాఠశాల అభివృద్ధికి రూ.6 లక్షల వితరణ



చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని వేదిక్ విద్యాలయంలో మూడు దశాబ్దాల క్రితం పది పూర్తి చేసిన విద్యార్థులు సందడి చేశారు. 1992 బ్యాచ్ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం వేదిక్ పాఠశాలలో నిర్వహించారు. నేటికీ వేదిక్ పాఠశాల రూపురేఖలు యథాస్థితిలోనే ఉండడంతో తాము చదువుకున్న తరగతి గదుల్లో కూర్చొని బాల్య స్మృతులకు గుర్తు చేసుకున్నారు. 32 సంవత్సరాల క్రితం ఇక్కడ పదవ తరగతి పూర్తి చేసి యూఎస్, యూఏఈ, యూకే, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో స్థిరపడిన వారు కూడా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు సహాయంగా రూ. 6 లక్షల చెక్కును పాఠశాల యాజమాన్య కమిటీకి అందించారు. కరోనా సమయంలో తల్లితండ్రులకు కోల్పోయిన 18 మంది బాలలను చేరదీశారు. వారందరికీ 10వ తరగతి వరకు అవసరమైన అన్ని ఖర్చులు తామే భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల అవసరాల కోసం ఆటోమేటిక్ జిరాక్స్ మెషిన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ నిర్వాహకుడు, విశ్రాంత ఉపాధ్యయుడు జయరాజ్‌ఆర్య, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు హరిప్రసాద్, సజేశ్, మధు, ప్రకాశ్, శివకుమార్, జ్యోతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీఎస్ సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉమ్మడి రాష్ట్ర బీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు పేర్కొన్నారు. మాల మహానాడు కార్యాలయంలో ధర్మపురి శ్రీనివాస్ సంతాప సభను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేసి కాంగ్రెస్ విజయంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మంత్రిగా, ఎంపీగా ప్రజా సేవలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు.

వ్యక్తిపై దాడి

వెంగళరావునగర్ : తన తండ్రిపై సోదరులు, వారి కుమారులు దాడి చేశారని మరో కుమారుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండమూడి రమేశ్‌కుమార్ తన తండ్రి గోపాలరావు(88)ను కొంతకాలంగా తన వద్దనే ఉంచుకుని ఓ వ్యక్తి ద్వారా సేవలు అందిస్తున్నాడు. ఈ నెల 28న రమేశ్‌కుమార్ విధులకు వెళ్లగా రమేశ్ సోదరులు పట్టాభిరామయ్య, వెంకటేశ్వరరావు, వారి కుమారులు నితీన్, సాయిమురళి, శ్రీకిరణ్ వచ్చి గోపాలరావుపై దాడి చేశారని తండ్రి సేవల కోసం నియమించిన రమణ ఫోన్ ద్వారా రమేశ్‌కు సమాచారం అందించాడు. దీంతో వెంటనే రమేశ్ వచ్చి అడ్డుకోగా అతని ఫోన్ కూడా విసిరేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చారు. వారి ఎదుటనే గోపాల్‌రావుపై దాడి చేశారు. తండ్రిని, తనను బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రమేశ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసత్య ప్రచారాలు చేసిన విలేకరిపై కేసు

వెంగళరావునగర్ : నూతన వ్యాపారాన్ని దెబ్బ తీసేలా అసత్య ప్రచారాలు చేసిన విలేకరిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌కు చెందిన పి.సుధీర్‌బాబు ఈనెల 10న ఈవీ బైక్ డీలర్‌షిప్ తీసుకుని ప్రారంభించాడు. ఆ సమయంలో కొందరు ట్రాన్స్‌జెండర్స్ రాగా సుధీర్‌బాబు రూ.1000 ఇచ్చేందుకు యత్నించాడు. అయితే వారు ఎక్కువ కావాలని డిమాండ్ చేశారు. అనంతరం వారి టీంలీడర్ రాగా రూ.1100 ఇవ్వడంతో తీసుకుని వెళ్లాడు. వెంటనే కొంతమంది విలేకరులు కూడా వచ్చి న్యూస్ తీసుకుని వెళ్లారు అయితే మోహిద్ భాషా అనే రిపోర్టర్ వచ్చి డబ్బులు డిమాండ్ చేశాడు. దానికి సుధీర్‌బాబు తాను ఇవ్వనని చెప్పడంతో తన బిజినెస్ దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు చేశాడు. దీంతో సుధీర్‌బాబు రిపోర్టర్ మోహిద్‌భాషాపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాగ్ చోరీ

వెంగళరావునగర్ : చిల్లర కోసం పాన్ షాపునకు వెళ్లి వచ్చేలోగానే మహిళా బ్యాగ్ చోరీకి గురైంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్‌లో నివసించే రేఖాఠాకూర్ శుక్రవారం సాయంత్రం తన స్నేహితురాలిని చూసేందుకు విరించి ఆసుపత్రికి వెళ్లింది. తిరిగి రాత్రి క్యాబ్ ఆటో బుక్ చేసింది. కార్మికనగర్ వచ్చిన తర్వాత తన బ్యాగ్ ఆటోలోనే పెట్టి చిల్లర కోసం పాన్ షాపునకు వెళ్లింది. ఈలోగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బ్యాగ్ తీసుకుని పరారయ్యాడు. అందులో ఫోన్, రూ.5వేలు, ఆధార్‌కార్డు తదితర వస్తువులు ఉన్నాయని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జులై 1న నెక్లెస్‌రోడ్డులో 5కే రన్



5కే రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: మహిళా సాధికారత కోసం, మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు అమ్మాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జులై 1న 'ఓ మహిళా రామ్మ, మన లక్ష్యం ఆరోగ్యం' అనే నినాదంతో నెక్లెస్‌రోడ్డులో 5కే రన్ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఆమని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఉపాధ్యక్షురాలు భారతి, లీగల్ అడ్వైజర్ జస్బీర్ సింగ్‌తో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ సహాయంతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు సీతక్క, దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నెక్లెస్‌రోడ్డు పీపుల్స్ ప్లాజా వద్ద జులై 1వ తేదీ ఉదయం 7 గంటలకు రన్ ప్రారంభమై తిరిగి పీపుల్స్‌ప్లాజా వద్దే ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో గిరి, కుసుమ భోగరాజు, వెంకటరెడ్డి, యమున తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి కల్యాణానికి మేయర్ విరాళం



ఆలయ కమిటీ ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ నెం. 12లోని ఎన్బీటీనగర్ బస్తీ శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణానికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ ప్రతినిధులకు లక్ష విలువైన చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు శనివారం అందజేశారు. వచ్చే నెల 21వ తేదీన కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

సమానత్వం కోసం పోరాటం



సభలో మాట్లాడుతున్న రుూన్సీ

పంజగుట్ట: మహిళల హక్కులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో స్త్రీ, పురుష సమానత్వం కోసం శ్రామికవర్గ మహిళల విముక్తి కోసం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూయూ) నిరంతరం కృషి చేస్తున్నదని పీవోడబ్ల్యూయూ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆగస్టులో నిర్వహించనున్న ఏడో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కమిటీని శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ రమా మేల్కొటే, జ్యోత్స్న, పద్మజాషా, సజయ, వనమాల, సంధ్య, నాగమణి, వారిజా, జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా పద్మశ్రీ శాంతా సిన్హా, కార్యదర్శిగా ప్రొఫెసర్ సమున్నత, కోశాధికారిగా జి.అనసూయను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు సభల విజయవంతంపై చర్చించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ఎమ్మెల్యే దానం నాగేందర్ పంపిణీ చేసిన చెక్కులతో లబ్ధిదారులు

బంజారాహిల్స్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఫిలింనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు మామిడి నర్సింగరావు, కాటూరి రమేశ్, నాగేశ్ సాగర్, దీపాగౌడ్ తదితరులతో కలిసి జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో 50 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

పదవీ విరమణ

లక్డీకాపూల్ : నిమ్స్ ఆసుపత్రిలోని పలువురు ఉద్యోగులు శనివారం విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని లెర్నింగ్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి సంచాలకుడు నగరి బీరప్ప వారిని ఘనంగా సత్కరించి, వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు , ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మానవాళి ప్రగతికి సైన్స్ దోహదం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామచంద్రయ్య

వెంగళరావునగర్ : మానవుని జీవనం, గమనానికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందని జన విజ్ఞానవేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఏ.రామచంద్రయ్య అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని విజ్ఞానజ్యోతి పబ్లిక్‌స్కూల్‌లో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 'బరువుకు గురువు పీటర్ హిగ్స్' అనే అంశంపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ హైదరాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం. రవీంద్రబాబు, టీచర్లు హేమలత, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఖాజా అహ్మద్

హిమాయత్‌నగర్: టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఖాజా అహ్మద్‌ను నియమించినట్లు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. ఖాజా అహ్మద్ పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తూ న్యాయపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో లీగల్ సెల్ కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానం పెద్దలు సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్లు వేయాలని వినతి



మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

పంజగుట్ట: బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్ బస్తీలో సీసీ రోడ్లు వేయాలని కోరుతూ ప్రేమ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం బంజారాహిల్స్ కార్పొరేటర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి భగవాన్ దాస్, కార్యవర్గ సభ్యులు దయానంద్ యాదవ్, మామిడి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. బస్తీలోని రోడ్లన్నీ అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. మేయర్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే పరిశీలించి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో పోచమ్మగుడి నుంచి బస్తీ దవాఖానా వరకు చేపట్టిన రోడ్డు పనులను గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శనివారం పరిశీలించారు.త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ధర్మేంద్రకుమార్

హిమాయత్‌నగర్: తెలంగాణలోని 6 లక్షల మంది వీధి వ్యాపారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హాకర్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు ధర్మేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్ కదన్, తెలంగాణ హాకర్స్ జేఏసీ, స్టేట్ వెండర్స్, హాకర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.వెంకట మోహన్ తదితరులతో కలిసి మాట్లాడారు. తెలంగాణలో 146 పట్టణ స్థానిక సంస్థలున్నాయని, రాష్ట్రంలో ఇప్పటివరకు 6 లక్షలకు పైగా వీధి వ్యాపారులను సర్వే చేయగా వందల సంఖ్యలో మాత్రమే వెండింగ్ జోన్లు ఏర్పడ్డాయన్నారు. వీధి వ్యాపారుల చట్టాన్ని సక్రమంగా అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వానికి 5 నెలల సమయం ఇస్తున్నామని అప్పటికీ పరిష్కరించకుంటే వీధుల్లో కవాతు ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. వీధి వ్యాపారులందరికీ శ్రామిక్ మాన్ ధన్ చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. సమావేశంలో వెండింగ్ కమిటీ ఆఫీస్ సెక్రటరీగా మన్సూర్ రజాక్, జాతీయ కో–ఆర్డినేటర్‌గా మంజూ గోయల్, ఢిల్లీ కో–ఆర్డినేటర్‌గా నితేష్ దాస్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు డి.శివరాజు, వి.శ్రీశైలం, కార్యదర్శి ఆర్.అనిల్ కుమార్,సి కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రశంకర్‌కు వట్టికోట అల్వార్ స్వామి అవార్డు


రుద్రశంకర్

చిక్కడపల్లి: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన ఉద్యమకారుడు, ప్రవాస భారతీయుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నో సేవలందించి చేనేత కార్మికులకు అండగా నిలిచి, వారికి సంక్షేమ పథకాలు అందేలా చేశారు రుద్రశంకర్. ఆయనకు రవీంద్రభారతిలో ఆదివారం పోరాటయోధుడు వట్టికోట అల్వార్ స్వామి స్మారక అవార్డు ఇవ్వనున్నారు. చిన్నతనం నుంచే ఆయన కుల మతాలకతీతంగా సమాజ సేవతో పాటు ఆదివాసులకు అండగా నిలిచారు. గిరిజన సంక్షేమం కోసం పోరాటం చేసి గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పోరాడారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వారి పార్థివ దేహాలను స్వదేశానికి రప్పించడంలో ఎంతో కష్ట ఆయనకు రుద్రశంకర్‌కు ఈ అవార్డు ఇవ్వడం సముచితం అని పలువురు వ్యాఖ్యానించారు. ఖానాపూర్‌లో కొమురం భీమ్ స్మారకంగా విగ్రహాన్ని ప్రతిష్టించడంలో కృషి చేశారు. ప్రస్తుతం కొమురం భీమ్ చౌరస్తాగా నామకరణం జరిగింది. సుష్మ సంస్థల అధినేతగా పేద విద్యార్థులకు విద్య వైద్య కోసం ఎంతో సహకారం అందించడంతో ఎన్నో కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డుకు ఎంపిక కావడం తనపై మరింత బాధ్యత పెరిగిందని ఆయన తెలిపారు.

ఇండియా గెలవడంతో ఎంజాయ్ చేసిన అభిమానులు

చార్మినార్: అత్యంత ఉత్కంఠ భరితంగా ప్రారంభమైన టీ–20 వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేసుకొని వీక్షిస్తూ క్రికెట్ అభిమానులు ఎంజాయ్ చేశారు. మదీనా సర్కిల్‌లోని మహమ్మద్ క్యాప్ మార్ట్ యజమాని ముహమ్మద్ ఇలియాస్ బుకారి తన షో రూమ్ ఎదుట ప్రధాన రోడ్డులో శనివారం రాత్రి పెద్ద ఎత్తున ఎల్‌ఈడీలను ఏర్పాటు చేయడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించిన వాహనదారులు, పాదచారులు ఆసక్తిగా తిలకించారు. సౌత్‌ఆఫ్రికాపై భారత్ విజయం సాధించడంతో అక్కడ ప్రజలు ఎంతో ఎంజాయ్ చేశారు. అరుపులు, కేకలతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది.

నలభై ఏళ్ల ఇండస్ట్రీ..

ఇంకా అద్దె గదిలోనే..

రూ.44 లక్షలు చెల్లించినా కేటాయించని ఇల్లు	న్యాయం చేయాలంటూ సీఎంకు వేడుకోలు	సొసైటీ ప్రెసిడెంట్ చుట్టూ తిరిగినా అన్యాయమే..


చిత్రపురి కాలనీ రో హౌసెస్ వద్ద బాధిత సినీ నటుడు వేములపల్లి శివసత్యనారాయణ, పద్మ కళ్యాణి దంపతులు

బంజారాహిల్స్: నలభై ఏళ్ల ఇండస్ట్రీ.. 250 సినిమాల నటన.. 77 సంవత్సరాల వయస్సు.. ఇంకా అద్దె ఇంట్లోనే కష్టాలు.. సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనన్న ఆశ.. న్యాయం చేయాలంటూ ఓ సీనియర్ నటుడు సినీ కార్మికుల కోసం నిర్మిస్తున్న చిత్రపురి కాలనీలో భార్యతో కలిసి కన్నీరుమున్నీరయ్యారు. కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన వేములపల్లి శివసత్యనారాయణ నలభై ఏళ్లుగా సినిమాల్లో నడిస్తున్నాడు. ఇప్పటి వరకు 250 సినిమాల్లో నటించాడు. అయితే సినీ కార్మికుల కోసం మణికొండ ప్రాంతంలో ప్రభుత్వం స్థలం కేటాయించగా ఇక్కడ ఇంటి కోసం 1997 మార్చి నెల నుంచి తెలుగు సినీ వర్కర్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ చిత్రపురి కాలనీలో సభ్యత్వం(మెంబర్‌షిప్ నెం.968) తీసుకొని ప్రతినెలా వాయిదాలు చెల్లిస్తూ వస్తున్నాడు. ఇప్పటి వరకు చిత్రపురి కాలనీలో హౌజ్ కోసం ఆయన రూ.44 లక్షలు చెల్లించాడు. ఇల్లు కేటాయించాలంటూ చిత్రపురి కాలనీ సొసైటీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్‌కుమార్ చుట్టూ చెప్పులరిగేలా తిరిగాడు. నలభై సంవత్సరాల నుంచి యూసుఫ్‌గూడలో అద్దెగదిలో ఉంటున్నానని, ఇప్పటికీ సొంతిల్లు లేదని, వయస్సు పైబడుతోందని, ఇప్పటికైనా సొంతింటి కల నెరవేర్చాలని ప్రతిరోజూ భార్యతో కలిసి వెళ్లి మొరపెట్టుకోసాగాడు. దీంతో మార్చి నెలలో 72వ నెంబర్ రో హౌజ్ కేటాయించారని, అందులోకి వెళ్లి సామాన్లు దింపుకొని మరమ్మత్తులు చేయించుకోవాలని సొసైటీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ కుమార్ చెప్పడంతో ఈ దంపతులు తమ పిల్లలతో కలిసి సంతోషంగా ఆ ఇంట్లోకి వెళ్లి సామాన్లు దింపుకొని తాళం వేసుకున్నారు. అయితే వారి ఆశల మీద నీళ్లు పోస్తూ సొసైటీలో ఈసీ మెంబర్‌గా ఉన్న మహానందరెడ్డి పది రోజులకే ఆ ఇంటి తాళం పగులగొట్టి కబ్జా చేసుకున్నాడు. న్యాయం చేయండి.. అంటూ బాధితుడు సత్యనారాయణ భార్యతో కలిసి వెళ్లి అనిల్ కుమార్‌ను వేడుకున్నా కనికరించలేదు. ఏడ్చారు.. మొత్తుకున్నారు.. అంతటితో ఆగకుండా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు తమ దీనస్థితిని విన్నవించి న్యాయం చేయమని ప్రాధేయపడ్డారు. తాజాగా శనివారం గత్యంతరం లేని పరిస్థితిలో తమకు కేటాయించిన 72వ నంబర్ రో హౌజ్ వద్దకు వెళ్లి తమ సభ్యత్వం చూపిస్తూ చెల్లించిన వాయిదాల రశీదు చూపిస్తూ తమ గోడు వెల్లబోసుకున్నారు. తమకు గూడు లేదని రూ.44 లక్షలు చెల్లించామని ఇల్లు కేటాయించేలా చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చిత్రపురి కాలనీలో ఇళ్ల కేటాయింపులో కోట్లాది రూపాయలు దండుకొని అర్హులకు కాదని, అనర్హులకు విక్రయించిన ఘటనలో సొసైటీ ప్రెసిండెంట్ వల్లభనేని అనిల్ కుమార్ అరెస్ట్ అయ్యి మూడు నెలలు జైల్లో ఉండి, మూడు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యారు. సొసైటీ కార్యవర్గం మొత్తం ఈ అక్రమాల ఉచ్చులో ఇరుక్కొని రాయదుర్గం పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. అక్రమాలకు నిలయంగా మారిన చిత్రపురి కాలనీ ఇళ్లలో సహకార శాఖ అధికారుల అవినీతి కూడా ఉండగా వారిపై కూడా విచారణ కొనసాగుతోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో మాత్రం చలనం కరువైంది. సీనియర్ నటుడు సత్యనారాయణకు జరిగిన అన్యాయంతోనైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందో లేదో చూడాలి.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో ఇంజినీర్లు, డీసీహెచ్‌ఎస్, డీఎంఅండ్ హెచ్‌ఓలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ మొదలుకాని వాటిని వెంటనే టెండర్లను పిలవాలని, నిర్మాణం మొదలైన వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో టీఎంఎస్ ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతిరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సునీత, టీజీ ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.నాయుడు, డీఈపీ జగదీష్ ప్రసాద్ పాల్గొన్నారు.



శరవేగంగా మారుతున్న ప్రపంచం


విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న వాయుసేన వైస్ మార్షల్ ప్రశాంత్ శరద్ వడోద్కర్

- లక్ష్యాలూ అందుకు తగ్గట్లుగా మారాలి
- వాయుసేన వైస్ మార్షల్ ప్రశాంత్ శరద్ వడోద్కర్
- సందడిగా బేగంపేట హెచ్‌పీఎస్ ఇన్వెస్టిట్యూర్ వేడుకలు

సనత్‌నగర్: ప్రపంచం శరవేగంగా మారుతోందని, అందుకనుగుణంగా నేటితరం విద్యార్థులు తమ లక్ష్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని వాయుసేన వైస్ మార్షల్ ప్రశాంత్ శరద్ వడోద్కర్ అన్నారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)లో ఇన్వెస్టిట్యూర్ (నాయకత్వ బాధ్యతల స్వీకరణ) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాలకు చెందిన నాగార్జున, నలంద, తక్షశిల, విజయనగర హౌస్‌ల విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. అనంతరం ఆర్మీ, నేవీ, వాయుసేన త్రివిధ దళాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన అబ్బురపరిచింది. తనువు పులకించిపోయే విధంగా స్కూల్ బ్రాస్ బ్యాండ్ పాఠశాల గీతాన్ని ఆలపించింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రశాంత్ శరద్ వడోద్కర్ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి వారికి నాయకత్వ బాధ్యతలను అప్పగిస్తూ బ్యాడ్జీలను ధరింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం విద్యా డిగ్రీలు సంపాదించడమే కాకుండా నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ప్రపంచాన్ని మార్చేలా ఆలోచనలు ఉండటంతో పాటు అందుకు తగ్గట్లు కృషి చేయడం నేటి సమాజానికి చాలా అవసరమన్నారు. విద్యార్థులు వాయుసేనలో చేరి గగనతలంలోని వింతలు, విశేషాలను తెలుసుకోవాలని వారిని ఉత్తేజపరిచారు. పాఠశాల హెడ్ గర్ల్‌గా బాధ్యతలు చేపట్టిన సాన్వి సాగి మాట్లాడుతూ పాఠశాల ఇచ్చిన జ్ఞాన సంపదను ఉపయోగించుకుని తోటి విద్యార్థులు వారి కలలను నెరవేర్చుకోవాలన్నారు. 'ఒక విరామం తీసుకుని గులాబీల సువాసనను ఆస్వాదించు' అన్న బిల్లీజోయల్ అనే తత్వవేత్త చెప్పిన మాటలను ఆమె ప్రస్తావించి తోటి చిన్నారుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు. హెడ్‌బాయ్‌గా బాధ్యతలు స్వీకరించిన సార్థక్ లాంబా మాట్లాడుతూ పాఠశాల చిహ్నమైన ఈగిల్ తనకు ఎంతో స్ఫూర్తి అన్నారు. స్వేచ్ఛ, ధైర్యం, ఆత్మ విశ్వాసం, నాయకత్వ భావాలను పెంపొందించే విధంగా ఆ చిహ్నం ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. అంతకముందు ప్రిన్సిపాల్ డాక్టర్ స్కందబాలి వార్షిక నివేదికను సమర్పించారు. అలాగే అకడమిక్‌తో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి, వి హబ్ సీఈఓ సీతా పల్లచోల్లా, హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీజే నోరియా, ఉపాధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్, బీఓజీ వైస్ చైర్మన్ రఘురాంరెడ్డి, హెచ్‌పీఎస్ సొసైటీ బీఓజీ సెక్రటరీ అండ్ ట్రెజరర్ జలగం వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేస్తే సహించేదిలేదు

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు


మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు

లిబర్టీ: దళితుల ఐక్యతను దెబ్బతీసి వారి మధ్య చిచ్చు పెట్టి విభజించు.. పాలించు సూత్రాన్ని అమలు చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు ఆరోపించారు. అనేక ఏళ్లుగా దళితులు ఐక్యంగా హక్కుల కోసం పోరాటం చేస్తుంటే చంద్రబాబునాయుడు వర్గీకరణ రచ్చ పెట్టాడని, అది ఇప్పటికీ రాజుకుంటోందని ధ్వజమెత్తారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక ఏళ్లుగా దళితులు కలిసి ఉంటున్నారని, రాజ్యాంగ హక్కుల కోసం న్యాయబద్ధమైన డిమాండ్ల కోసం సంఘటితంగా పోరాటం చేస్తున్నారని, కానీ చంద్రబాబునాయుడు తన రాజకీయ ప్రయోజనాల కోసం అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చి దళితుల ఐక్యతను దెబ్బతీశాడని ధ్వజమెత్తారు. 1995లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వర్గీకరణ అంశాన్ని రాజకీయం చేసి అధికారాన్ని కాపాడుకున్నాడని ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ చేస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో వి.కృష్ణస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వివాహ పరిచయ వేదిక

సాక్షి, సిటీబ్యూరో: కమ్మ మ్యాచ్ మేకింగ్ సంస్థ, దిల్‌సుఖ్‌నగర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం 'కమ్మ వధూవరుల వివాహ పరిచయ వేదిక' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అమీర్‌పేటలోని కమ్మ సంఘం భవన్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మినేని ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇది సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. మహిళలకు చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ ఈవెంట్‌లో మహిళల ఆధ్వర్యంలో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎలాంటి రుసుము తీసుకోకుండా కేవలం మహిళలకు మాత్రమే స్టాల్స్ నిర్వహించేందుకు అవకాశం ఇస్తున్నామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు **7673930301, 8688625116** నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

పాతబస్తీలో సందడి చేసిన బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్


దుస్తులు ఖరీదు చేస్తున్న బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ గారేత్ విన్ ఓవెన్

చార్మినార్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ గారేత్ విన్ ఓవెన్ శనివారం పాతబస్తీలో సందడి చేశారు. పాతబస్తీని సందర్శించిన ఆయన మదీనాలోని మక్దుం బ్రదర్స్ దుస్తుల దుకాణంలోకి వెళ్లి భారత దుస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా షోరూం యజమాని ఆబెద్ మక్దుం ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పలు రకాల దుస్తులను చూపించారు. భారత దేశంలో వినియోగించే వివిధ రకాల దుస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరం అంటే తనకెంతో ఇష్టమన్నారు. రెండేళ్లుగా నగరంతో తనకు అనుబంధం ఉందన్నారు.

ప్రకృతిని కాపాడుకుంటూ నగరాన్ని నిర్మించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రకృతిని కాపాడుకుంటూ నగరాలను నిర్మించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ సూచించారు. నగరాలంటే ధనికులే కాదు.. శ్రామికులు కూడా ఉంటారని పేదలు నివసించే ప్రాంతాల్లో సౌకర్యాలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఏ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలో నగరీకరణ–ప్రభుత్వ విధానాలు–ప్రత్యామ్నాయాలు అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ ఆదాయ పన్నుల్లో కేంద్ర ప్రభుత్వం పది శాతం మౌలిక వసతుల కల్పనకు కేటాయించాలని, ఆ దిశగా డిమాండ్ చేయాలన్నారు. పేదలు నివసించే చోట ఆదాయ పన్నులో పది శాతం కేటాయించాలని శివరామకిషన్ చేసిన సిఫారసును అమలు చేయాలన్నారు. జాతీయ ఉపాధి పట్టణ హామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. అంతేగాకుండా రాష్ట్రంలో అర్బన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వినాశనానికి నగరాలు కేంద్రాలుగా మారాయని, నాలా అక్రమణల వల్ల కాలుష్యం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కూపాలుగా మారిన నాలాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాల్లో పేదలకు అందుబాటులో ఉండే విధంగా విద్యా, వైద్యం, ఫుడ్ సెక్యూరిటీ అందించడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను వాడుకునేలా చేయాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ నర్సింహారావు, ప్రొఫెసర్ డాక్టర్ డి.నర్సింహారెడ్డి, పీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ, ఎం.మహేందర్, కె.ఎస్.రాజన్న, కె.నాగలక్ష్మి, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత భద్రతలో నూతన శకం ప్రారంభం

- కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- రాచకొండ సీపీ తరుణ్ జోషి



ఘట్‌కేసర్: కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని రాచకొండ సీపీ తరుణ్ జోషి అన్నారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వ నూతన చట్టాలు–2023 అమల్లోకి రానున్న నేపథ్యంలో రాచకొండ పరిధిలోని అధికారులు, సిబ్బందికి మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ విజ్ఞాన్ భారతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయనిపుణులు హైకోర్టు అడ్వకేట్ సురేశ్ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ నేర, న్యాయ చట్టాల ద్వారా అంతర్గత భద్రతలో నూతన శకం ప్రారంభం అవుతుందన్నారు. నేటి వరకు వలస పాలకుల న్యాయ చట్టాల ద్వారా నేర, న్యాయ వ్యవస్థ, శాంతి భద్రతలు నిర్వహిస్తున్నామని అన్నారు. నూతనంగా అమల్లోకి రానున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సాక్ష్య సురక్ష అధినియం శాంతి భద్రతల పరిరక్షణలో మైలురాయని, అధికారులు, సిబ్బంది నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నూతన చట్టాలకు విరుద్ధమైన వాటిని పాటించకూడదని, నూతన సెక్షన్లతో కేసులు నమోదు చేయాలన్నారు. పాత విధానాలు మారడం లేదని, ప్రస్తుత సమాజం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కేసుల నమోదు తీరు, శిక్షలు, విచారణ చేయడానికి మార్పు చేశారన్నారు. ప్రతి స్టేషన్‌లో నూతన చట్టాలపై అంతర్గత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో యాదాద్రి డీసీపీ రాజేశ్‌చంద్ర, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్, ఎస్బీ డీసీపీ కరుణాకర్, మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, క్రైం డీసీపీ అరవింద్‌బాబు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామకం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగానే మరణించిన ముగ్గురి ఉద్యోగుల వారసులకు.. వారి విద్యార్హతలు బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డి ఈ నియామక పత్రాలను శనివారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. కష్టపడి పనిచేసి బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీఅండ్‌ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి పాల్గొన్నారు.

జిల్లా గణాంక దర్శిని ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా గణాంక దర్శిని–2023ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో జాతీయ గణాంక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికాధికారి డా.యస్.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదం జన్మదిన వేడుకలు


ఆదం సంతోష్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

సికింద్రాబాద్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరి సమక్షంలో జన్మదిన వేడుకలు నిర్వహించుకున్న ఆదం సంతోష్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, పలువురు టీపీసీసీ నేతలతో పాటు నియోజకవర్గంలోని ఐదు డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సీతాఫల్‌మండి మల్టీపర్పస్ కమ్యునిటీహాలుకు విచ్చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధితోపాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.

పోలీస్ శాఖలో మీ సేవలు అమూల్యం


ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులతో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

- రిటైర్మెంట్ తర్వాత సంతోషంగా గడపాలి
- నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా పోలీసు అధికారులకు వీడ్కోలు

హిమాయత్‌నగర్: హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉగ్యోగ విరమణ పొందుతున్న 84 మంది అధికారులు, సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు వచ్చేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందే విధంగా చూస్తామని తెపిపారు. ఆయురారోగ్యాలు, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో తెలంగాణ ఐసీసీసీ అడ్మిన్ ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి, కార్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ ఎం.బాపురావు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జె.రామారావు, సీపీ కార్యాలయ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి ఎస్.సుధారాణి, నగర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇన్‌స్పెక్టర్, జె.జగన్నాథం, ఇన్‌స్పెక్టర్ బి.హనుమప్ప, 25 మంది ఎస్సైలు, 37 మంది ఏఎస్సైలు, 14 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ అడ్మిన్ జె.పరిమళ హానా, ఇతర అధికారులు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు యస్.శంకర్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ల వద్ద మొరాయించిన సర్వర్లు


చార్జీలు వసూలు చేయకుండానే వాహనాలను పంపిస్తున్న సిబ్బంది

లంగర్‌హౌస్: అవుటర్ రింగ్ రోడ్డుపై చాలా ప్రాంతాల్లో శనివారం చార్జీలు వసూళ్లు నిలిచిపోయాయి. సర్వర్ల సమస్య తలెత్తడంతో ఉదయం నుంచి అనేక ప్రాంతాల్లో టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులుతీరి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నాయి. సాంకేతిక సమస్య తలెత్తితే చక్కదిద్దుకోకుండా తమను ఎలా ఆపుతారని వాహనదారులు టోల్‌గేట్ల వద్ద సిబ్బందిని నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక వాహనదారుల నుంచి ఫీజులు వసూలు చేయకుండానే ఉచితంగా పంపించారు. టోల్‌గేట్ల వద్ద సర్వర్లే కాదు, మొబైల్ ఫోన్లలో ఫాస్ట్‌ట్యాగ్ సర్వర్లు మొరాయించి పనిచేయలేదు. అసలు విషయం ఏంటని ఆరా తీయగా.. జూలై ఒకటో తేదీ నుంచి ఫాస్ట్‌ట్యాగ్, టోల్‌గేట్లలో నూతన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రానుంది. నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రస్తుత టోల్ గేట్లలో ఉన్న ల్యాప్‌టాప్‌లలో ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఓ వైపు నూతన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తూ.. మరోవైపు పాత సాఫ్ట్‌వేర్‌లో చార్జీలు వసూలు చేయడంతో సాంకేతిక సమస్యలు తలెత్తి ఫాస్ట్‌ట్యాగ్‌లు మొరాయించాయి. విషయం గమనించిన సంబంధిత అధికారులు అనేక ప్రాంతాల్లో మరో ల్యాప్‌టాప్‌లను అదనంగా ఏర్పాటు చేసి వాటిలో నూతన సాఫ్ట్‌వేర్లు ఇన్‌స్టాల్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏదేమైనా జూలై ఒకటవ తేదీ నుంచి నూతన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తేనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాటం

- విప్లవోద్యమంలో రాధక్క కృషి ఎనలేనిది
- ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: విప్లవోద్యమంలో రాధక్క కృషి ఎనలేనిదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చంద్ర పుల్లారెడ్డి వేదిక ఆధ్వర్యంలో గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నాయకురాలు రాధక్క(అక్కినేని నిర్మల) సంస్మరణ సభ శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాధక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకినాడ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటున్న రోజుల్లోనే ఎర్రజెండ రాజకీయాలకు ఆకర్షితురాలైందన్నారు. 1969లో జరిగిన నక్సల్ బరి, శ్రీకాకుళ రైతాంగ పోరాటాల ద్వారా స్ఫూర్తి పొంది బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. చంద్ర పుల్లారెడ్డి వేదిక కన్వీనర్ రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ భారత విప్లవోద్యమానికి మావో ఆలోచన విధానమే సరైందని నమ్మిన వ్యక్తి రాధక్క అని, ఆమె నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాటం చేసిందని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, పావురాల భిక్షపతి, సీనియర్ జర్నలిస్టు యాసిన్ బేగం, పీడీఎస్‌యూ మాజీ అధ్యక్షుడు గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మారియట్ నుంచి అల్టైయిర్..

అపార్ట్‌మెంట్ తరహా లివింగ్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న ఫైవ్ స్టార్ హోటల్ మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్ సరికొత్త బాంక్వెట్ స్పేస్–అల్టైయిర్‌ను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని సంస్థ జనరల్ మేనేజర్ శ్రీ అశ్విన్ వైద్య తెలిపారు. అన్ని సందర్భాలకు, సమావేశాలకు నప్పే విధంగా రూపుదిద్దుకున్న 9 అంతస్తుల ఆల్టైయిర్‌లో 3,444 చదరపు అడుగుల విస్తీర్ణంలో అందమైన టెర్రేస్ గార్డెన్స్, 3 స్టూడియోలు (వరుసగా 974, 1,578 1,580 చదరపు అడుగులు) ఉన్నాయని, అలాగే మొత్తం 12,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 450 మంది అతిథులతో వేడుక చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశామన్నారు. రోజంతా ప్రత్యేకమైన రూఫ్‌టాప్ డైనింగ్ అవుట్‌పోస్ట్ అద్భుతమైన నగర వీక్షణ అందిస్తుందన్నారు. కిట్టి పార్టీల నుంచి భారీ వేడుకలు, ఐటి, ఫార్మాస్యూటికల్ క్లయింట్‌ల కార్పొరేట్ ఈవెంట్‌ల వరకూ ఉపయుక్తంగా రూపుదిద్దామన్నారు.



కాలిక్యులేటర్ కన్నా వేగంగా..

ఎస్ఐపీ ప్రోడీజీ–24 పేరిట పోటీలు

కాలిక్యులేటర్ కన్నా వేగంగా లెక్కలు చేసే సామర్థ్య పోటీలు ఆదివారం జరగనున్నాయి. ఎస్ఐపీ ప్రోడీజీ–24 పేరిట 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఎస్ఐపీ అకాడమీ నిర్వహించే ఈ పోటీల్లో 2 వేల మంది పాల్గొననున్నారు. మొత్తం రెండు రౌండ్లలో.. ఒక్కో రౌండ్‌లో వెయ్యి మంది పాల్గొంటారు. 11 నిమిషాల్లో 200 లెక్కలను పరిష్కరించనున్నారు. శంషాబాద్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. తక్కువ సమయంలో ఎక్కువ లెక్కలను పరిష్కరించిన వారిని విజేతలుగా ప్రకటిస్తారు.



సింగపూర్ నుంచి డిస్నీ క్రూయిజ్ లైన్

సింగపూర్‌ను చుట్టే పర్యాటక ప్రేమికులకు ఆసక్తికరమైన వార్త ఇది.. కుటుంబ సమేతంగా వినోదం అందించేందుకు వీలుగా సింగపూర్ నుంచి డిస్నీ క్రూయిజ్ లైన్ నౌకను అందుబాటులోకి తేనున్నట్టు డిస్నీ అడ్వెంచర్ ప్రతినిధులు తెలిపారు. ఈ నౌక ఆసియాలోని పోర్ట్ ల్యాండ్ నుంచి బయలుదేరుతుందని, మూడున్నర రాత్రులు నౌకా ప్రయాణంలో ఉద్విగ్న భరితమైన వినోదం లభిస్తుందన్నారు.. తొలిసారి ఈ డిస్నీ షిప్‌ను ఆసియాలో ప్రవేశపెడుతున్నామన్నారు.

చిన్నారుల కోసం ప్లే అండ్ లెర్న్..

బాలల కోసం బంజారాహిల్స్‌లోని జీవీకే మాల్ వినూత్న వినోదభరిత కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్లే అండ్ లెర్న్ పేరుతో నిర్వహిస్తున్న ఈ సరదా సందడిలో 7ఏళ్ల లోపు చిన్నారులకు మాత్రమే ప్రవేశమని, ఆటలతో పాటు కొత్త విషయాలు నేర్చుకునే విధంగా ఇది ఉంటుందని నిర్వాహకులు అంటున్నారు. ఈ నెల 31 వరకూ ఈ ఈవెంట్ కొనసాగుతుంది.







మీల్‌లెట్స్

మిల్లెట్ మీల్‌తో ఆరోగ్యం..



చిరుధాన్యాలకు పెరిగిన డిమాండ్

- వంటల పట్ల నగరవాసుల ఆసక్తి
- మార్కెట్‌లోకి వివిధ రకాల ఉత్పత్తులు
- పంట పాతదే.. వంటే కొత్తది..
- అందుబాటులో రెడీ–టు ఈట్, రెడీ–టు కుక్



ఒకప్పుడు గ్రామీణ ప్రాంత్రాలకే పరిమితమైన చిరుధాన్యాల వంటలు నేడు పట్టణ ప్రాంతాల్లో బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో వాటికి బాగా డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు సంప్రదాయ వంటలైన అన్నం, రొట్టెలకే పరిమితమైన చిరుధాన్యాల (మిల్లెట్స్)తో ఇప్పుడు వివిధ రకాల తినుబండారాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అనేక చిరుతిండ్లను తీసుకుంటుంటాం. ప్రస్తుతం నగరవాసులు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నగర వాసులు వాటి స్థానంలో ఈ ఆహారాన్ని తీసుకుంటున్నారు. దీంతో పాటు నగర వాసుల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని పలువురు ఉత్పత్తిదారులు.. రెడీ–టు ఈట్, రెడీ–టు కుక్ ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తున్నారు.. ఈ చిరుధాన్యాల కథేంటి? వాటితో ఎలాంటి ఆహారాన్ని తయారు చేస్తున్నారు? తదితర వివరాలు తెలుసుకుందాం.. – ఏజీ యూనివర్సిటీ

కరోనా పుణ్యమా అని నేడు చాలామంది ఆరోగ్యంపై దృష్టిసారిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇది కేవలం పట్టణ ప్రాంతాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ పాకగా, చిరుధాన్యాల పంటలు, వంటకాలకు డిమాండ్ పెరిగింది. ప్రతిదీ కాలుష్యానికి గురవ్వడం, కల్తీ అవ్వడంతో ఆరోగ్యకరమైన ఆహారానికే మొగ్గుచూపుతున్నారు ప్రజలు. ఆరోగ్యకరమైన ఆహారం ప్రస్తుత పరిస్థితుల్లో మిల్లెట్లు, చిరుధాన్యాలతోనే సాధ్యమని భావించి ఆ తరహా వంటకాలకు ప్రాధాన్యతనిస్తున్నారు.

ఐకరాజ్యసమితి గుర్తింపు...

మిల్లెట్స్‌కి ఉన్న ప్రాధాన్యతను భారతదేశం ఐక్యరాజ్యసమితి ముందు పెట్టగా 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ డేగా ప్రకటించింది. భారత్‌ను మిల్లెట్స్ దేశంగా 74 దేశాలు గుర్తించాయి. దీనికి ముందే భారత్ 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా గుర్తించింది. అంతకుమునుపు 2018లో జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించి, ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు దీనిపై అవగాహన కల్పించడం ప్రారంభించింది. ఆ కార్యక్రమం విజయవంతం కావడంతో 2023ను అంతర్జాతీయ సంవత్సరంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితిని కోరగా 74 దేశాలు గుర్తించాయి. దీంతో ప్రపంచ దేశాల్లో కూడా మిల్లెట్స్‌కు డిమాండ్ పెరిగింది.

పాత పంటలు.. కొత్త వంటలు

మిల్లెట్స్ పాత తరం పంటలైనా వాటితో కొత్త రకం వంటలు చేసి.. న్యూట్రిషనల్ వ్యాల్యూస్‌తో ఈ తినుబండారాలు రూపొందిస్తున్నారు. మిల్లెట్స్‌ను ద్వితీయ పద్ధతల్లో ప్రాసెసింగ్ చేసి ఈ ఉత్పత్తులను సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు రెడీ–టు– ఈట్, రెడీ–టు–కుక్ అనే పద్ధతుల్లో కొత్త వంటకాల ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తున్నారు.

400 అంకుర సంస్థలు

దేశ వ్యాప్తంగా ప్రస్తుతం మిల్లెట్స్‌తో వివిధ రకాల తినే వస్తువులను తయారు చేయడానికి 400 రకాల కంపెనీలు పనిచేస్తున్నాయి. చిరుధాన్యాల విలువలతో కూడిన పలు ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్నారు.

ఏవి చిరుధాన్యాలు...

జొన్నలు, రాగులు, సజ్జలు, సామలు, హరికలు, కొర్రలు, అండు కొర్రలు, ఊదలు మొదలైన వాటిని భారత దేశంలోనే సంప్రదాయ పంటలుగా పండిస్తుంటారు. గతంలో వీటినే ఎక్కువగా ఆహారంగా వాడేవారు.. అయితే నూతన వంగడాలు అందబాటులోకి రావడంతో వాటిపై దృష్టి మరల్చారు. అవగాహన పెరగడంతో ప్రస్తుతం సంప్రదాయ పంటలవైపే చూపు మరల్చి నూతన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు రాబడుతున్నారు రైతులు. తీనికితోడు ఈ పంటలకు డిమాండ్ పెరగడంతో అదే పద్ధతులను అవలంభిస్తున్నారు.



మార్కెట్‌లో మిల్లెట్స్ ఉత్పత్తులు..


రాగి నుండి మాల్ట్, చిరుధాన్యాల నుంచి పఫ్స్, స్నాక్స్, జొన్న ఇడ్లీమిక్స్, ఉప్మా, దోస, పొంగల్, లడ్డూ మిక్స్, జొన్న ముయోస్లీ, పాస్తా, కుకీలు, బ్రెడ్, బన్, కేక్, పిజ్జా, ఐస్‌క్రీం, జొన్న పేలాలతో పాటు, జొన్న పంటలో అనేక రకాల వంటకాలను తయారు చేస్తున్నారు. జొన్న ముడి పదార్థాలలో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. కాబట్టి ఇది అన్ని వయస్సుల వారికీ అనుకూలమైన ఆహారం. జొన్నలో మెగ్నీషియం, ఐరన్, జింక్, పీచుతో కూడిన ప్రొటీన్ అధికంగా ఉంటుంది. జొన్న రోల్స్, జొన్న బూందీ లడ్డు, సమోస, వడ, అరిసెలు, షర్‌బత్ కూడ తయారు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ గణాంకాల ప్రకారం 12,600 టన్నుల చిరుధాన్యాల పదార్థాలు ప్రతి రోజు ప్రజలు తింటున్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులకు డిమాండ్

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఐసీఏఆర్, భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ లాంటివి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. దీంతో వీటికి భారీగా డిమాండ్ పెరిగింది. ముందు ముందు చిరుధాన్యాలు, మిటెల్స్‌కు మంచి ఆదరణ ఉంటుంది. అనేక రకాల స్నాక్స్ తయారు చేసి రెడీగా ఉంచుతున్నాం. అప్పటికప్పుడు తినడానికి, వండుకోవడానికీ అనుకూలంగా ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తున్నాం..

– డాక్టర్ బి.దయాకర్ రావు, సీఈఓ న్యూట్రీహబ్, ఐఐఎంఆర్ రాజేంద్రనగర్







ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం..

ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో చిరుధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. దీనికితోడు నూతన పద్ధతుల్లో వీటిని పండించడానికి ప్రభుత్వం పోత్సాహం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అంకుర సంస్థలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి ద్వారా చిరుధాన్యాలతో న్యూట్రిషన్ ఫుడ్ తయారు చేస్తూ ప్రజలకు అందుబాటులో, రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ కల్పిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంలో చిరుధాన్యాల ఉత్పత్తులు తయారువుతున్నాయి.

వెదర్ మ్యాన్..

ఇంటి డాబానే ప్రయోగశాలగా..

ఇంటి డాబానే అతడికి ప్రయోగశాల.. ఆకాశంలో కమ్ముకున్న మేఘాలే అతడికి స్నేహితులు.. ఆ మేఘాలే అతడితో ముచ్చటిస్తాయి.. మబ్బులతోనే అతడు సావాసం చేస్తాడు.. వాటి యోగ క్షేమాలు తెలుసుకుంటాడు.. మబ్బుల ఆకారాలను చూసి మురిసిపోతాడు.. చిన్నప్పటి నుంచి అవే తన నేస్తాలు. అందుకే ఇప్పుడు తెలంగాణ మొత్తానికీ నేస్తమయ్యాడు. అందరి ఇళ్లల్లో, మనసుల్లో చోటు సంపాదించుకున్నాడు. ఇంతకీ అతడెవరా అనుకుంటున్నారా? అతడే తెలంగాణ వెదర్ మ్యాన్‌గా పేరు గాంచిన బాలాజీ తరిణి. – సాక్షి, సిటీబ్యూరో

వర్షం రాకను ముందే పసిగడుతున్న బీటెక్ స్టూడెంట్

- విద్యార్థులు, ఉద్యోగులకు వానరాకపై అప్‌డేట్స్
- మేఘాలను చూస్తే అదో ఆనందం
- 'సాక్షి' పాఠకులకు తెలంగాణ వెదర్‌మ్యాన్ అనుభవాలు

ఉరుములు వస్తే చాలు ఇంట్లోకి వెళ్లి అమ్మ కొంగు చాటుకో.. నాన్న ఒడిలోకో జారుకుంటాం. కానీ బాలాజీ మాత్రం ఎంతో ఆసక్తిగా చూసేవాడు. అలా వాటిని చూస్తూనే బాల్యం గడిచిపోయింది. అయితే కరోనా సమయంలో మాత్రం తన ఆలోచనలకు పదును పెట్టాడు. ఆకాశం, మబ్బులు వర్షంపై తనకున్న ఆసక్తి కాస్తా మారింది.. నలుగురికీ సాయపడాలనే ఆలోచన తన మదిలో అంకురించింది. ఆ ఆలోచనలే తనను వెదర్‌మ్యాన్‌గా మలిచిందని చెబుతారు బాలాజీ.






వారి ప్రోత్సాహంతో...


జీఎన్‌టీయూ హైదరాబాద్‌లో సివిల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న బాలాజీకి.. వాతావరణాన్ని అంచనా వేయడంలో రజినీ, వెదర్‌బ్రదర్ వంటి వారి ప్రోత్సాహం, సహకారంతో నైపుణ్యం సాధించానని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ట్విట్టర్‌లో లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇన్‌స్టాగామ్‌లో 35 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. వారందరికీ కచ్చితమైన సమాచారం అందిస్తే చాలా సంతృప్తిగా ఉంటుందని చెప్పాడు.





తనకున్న పరిజ్ఞానంతో ఎలాంటి మేఘాలు ఏర్పడ్డాయి.. ఏ మేఘాలు ఏర్పడితే ఎలాంటి వాతావరణం ఉంటుందనే అంచనా వేస్తాడు. వర్షం మోస్తరుగా వస్తుందా..? భారీగా వస్తుందా.. అనేది కూడా మేఘాల కదలికలను బట్టే చెప్పేస్తాడు. ఇలా గ్రౌండ్ విశ్లేషణ చేసిన తర్వాత.. శాటిలైట్ చిత్రాలు, మ్యాప్స్, వాతావరణ సంస్థలు, న్యూమరికల్ వెదర్ మోడల్స్ ద్వారా మోడల్ అనాలిసిస్ ద్వారా మరో అంచనాకు వస్తాడు. ఈ రెండింటినీ బేరీజు వేసుకుని వాతావరణం ఎలా ఉంటుందనే దాన్ని అంచనా వేస్తాడు.

ఎలా అంచనా వేస్తాడు



అత్యంత కచ్చితత్వంతో..

వాతావరణాన్ని అంచనా వేయడం అంత సులువు కాదు. వెనకటి రోజుల్లో రైతులు మబ్బుల కదలికలను బట్టి వాతావరణాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు గ్లోబల్ వార్మింగ్ వంటి కారణాలతో ఎప్పుడు ఎలాంటి వాతావరణం ఉంటుందో కూడా అర్థం కావట్లేదు. అలాంటి పరిస్థితుల్లో కూడా అత్యంత కచ్చితత్వంతో వాతావరణాన్ని అంచనా వేస్తున్నాడు. ట్విట్టర్ (ఎక్స్) పేజీ ద్వారా తెలంగాణ ప్రజలకు ఎప్పటికప్పుడు వెదర్ అప్‌డేట్స్ ఇస్తున్నాడు.

సరదాలు సరదాలే..


వాతావరణం అంచనా వేయడం తనకో హాబీ అని, చదువులు, సరదాల కోసం కూడా టైం కేటాయిస్తానని చెప్పుకొచ్చాడు. అయితే కొన్ని సార్లు తన ఫాలోవర్లకు సమాచారం అందించడం కోసం సరదాలు కూడా పక్కన పెడతానని వివరించారు. ఇక, ఇంజినీరింగ్ అయిపోయాక గేట్, ఏఈ, ఏఈఈ వంటి వాటిపై దృష్టి సారిస్తూనే వాతావరణాన్ని హాబీగా కొనసాగిస్తానని పేర్కొన్నాడు. అయితే అప్పుడప్పుడూ కొందరు విమర్శలు చేస్తారని, వారి కామెంట్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్తానని చెప్పాడు. ఎక్కువ మంది తన అంచనాలను నమ్మి, ప్రోత్సహిస్తుంటే కొందరి విమర్శలను మనసుకు తీసుకుని బాధపడటం సరికాదని పేర్కొన్నాడు.

మూడు వారాల్లో

రూ.7 వేల కోట్ల అప్పు

ఆర్బీఐకి వెల్లడించిన చంద్రబాబు ప్రభుత్వం

- ఎల్లో మీడియాకు ప్రతి మంగళవారం బాబు అప్పులు కనిపించడం లేదా?
- లేక ఈ అప్పులే సంపద సృష్టిలా కనిపిస్తోందా?
- గతంలో వైఎస్ జగన్ సర్కార్‌పై ప్రతి మంగళవారం అప్పు అంటూ విషం కక్కిన ఎల్లో మీడియా
- ఇప్పుడు బాబు అంటే ఇష్టం కాబట్టి అప్పు ఊసెత్తని వైనం
- ఈ నెల 25న రూ.2 వేల కోట్లు, వచ్చే నెల 2న రూ.5 వేల కోట్ల అప్పు



సాక్షి, అమరావతి: ప్రతి మంగళవారం అప్పు చేయందే గడవదంటూ ఇన్నాళ్లూ వైఎస్ జగన్ సర్కారుపై రాసిందే పదే పదే రాస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా విషం కక్కాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు ప్రతీ మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదా? అని అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. బాబు సర్కారు ప్రతి మంగళవారం చేస్తున్న అప్పులు ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాకు సంపద సృష్టిస్తున్నట్లు కనిపిస్తోందా.. అంటూ ఎద్దేవా చేస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పులు చేయడానికి వెసులు బాటు కల్పిస్తూ ప్రతి మూడు నెలలకు ఆర్‌బీఐ వేలం వేసే తేదీలను ముందుగానే ప్రకటిస్తుంది. ఆయా తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత మేర అప్పు చేస్తాయో.. ఎన్ని సంవత్సరాల కాల వ్యవధిలో ఆ అప్పు తీరుస్తాయో ఆర్‌బీఐకి తెలియజేస్తాయి. అదే తరహాలో గత వైఎస్ జగన్ సర్కారు పరిమితికి లోబడి అప్పులు చేస్తే.. ప్రతి మంగళవారం అప్పు అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా నిత్యం దుష్ప్రచారం చేస్తూ కథనాలు వండి వారుస్తూ నానా యాగీ చేశాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు 20 రోజుల వ్యవధిలోనే రూ.7000 కోట్లు అప్పు చేసినా.. అదీ ప్రతి మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదు. దాని గురించి ఒక్క ముక్క రాయడం లేదు. అంటే తమకు ఇష్టమైన చంద్రబాబు అధికారంలో ఉన్నందున, ఎన్ని అప్పులు చేసినా.. ఆ పత్రికలకు సంపద సృష్టిలా కనిపిస్తుందేమోనని ఉన్నతాధికారి ఒకరు ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అంటే ఇష్టం లేనందున పరిమితికి లోబడి అప్పులు తెచ్చినా సరే ప్రతి మంగళవారం అప్పు చేయనిదే గడవదంటూ పెద్ద నేరం చేసినట్లు నిత్యం ఆ పత్రికలు కథనాలు రాసినట్లు ఇప్పుడు స్పష్టం అవుతోందని ఆ అధికారి విశ్లేషించారు.

సంపద సృష్టి ఏమైందో!

వైఎస్ జగన్ సర్కారు అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేశారంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాతో పాటు చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్‌లు విషం కక్కారు. చంద్రబాబు అయితే ఒక అడుగు ముందుకు వేసి అప్పులు చేయడం కాదు.. సంపద సృష్టిస్తానని, ఆ సంపద ఎలా సృష్టించాలో తనకే తెలుసంటూ ఎన్నికల ముందు ప్రచారం చేశారు. ఇంత గట్టిగా బల్లగుద్ది చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రతి మంగళవారం అప్పులు చేస్తామంటూ ఆర్‌బీఐకి స్పష్టం చేసింది. ఇదే సందర్భంలో ప్రతి మంగళవారం అప్పులతో పాటు ఎంత సంపద సృష్టిస్తారో కూడా చెబితే బాగుంటుందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నెల 25వ తేదీన సెక్యూరిటీల వేలం ద్వారా రూ.2,000 కోట్లు అప్పు చేసిన చంద్రబాబు సర్కారు.. వచ్చే నెల 2వ తేదీన మంగళవారం మరో రూ.5,000 కోట్లు అప్పు చేస్తోంది. వచ్చే నెల 2వ తేదీన రూ.1,000 కోట్లు తొమ్మిది సంవత్సరాల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 12 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 17 ఏళ్ల కాల వ్యవధికి, ఇంకో రూ.1,000 కోట్లు 21 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 24 ఏళ్ల కాల వ్యవధికి సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పు చేయనుంది. ఆ తర్వాత మంగళవారం కూడా అప్పు చేయనున్నట్లు చంద్రబాబు సర్కారు ఆర్‌బీఐకి తెలియజేసింది.

రెడ్‌బుక్ ఉన్మాదమిది

ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీ శ్రేణుల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. ప్రధానంగా గ్రామాల్లో, ఎస్సీ, ఎస్టీ వాడల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. జేసీబీలతో ఇళ్లను కూలదోస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులని కూడా చూడకుండా చితకబాదుతుండటం ఊరూరా కనిపిస్తోంది. శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలను తొలగిస్తున్నారు.. పగలగొడుతున్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటలకు అందరూ చూస్తుండగానే టీడీపీ వర్గీయులు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇదేం కక్ష సాధింపు? గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి. ఎవరైనా ఇలా చేశారా? అధికారం చేజిక్కించుకుంటే ఇలా దాడులు చేయడానికి, ఆస్తులు ధ్వంసం చేయడానికి లైసెన్స్ వచ్చినట్లా? లేక అధికారంతో పాటు హిస్టీరియా ఏమైనా వచ్చిందా? రెడ్ బుక్.. రెడ్ బుక్.. అంటూ లోకేశ్‌కు వచ్చిన పూనకం తాలూకు ఉన్మాదమే ఇప్పుడు ఆ పార్టీ శ్రేణులకూ నరనరాన ఎక్కినట్లుంది. రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చడమే మీ ఉన్మాద లక్ష్యం అయితే.. ప్రజాగ్రహ జ్వాల ఉవ్వెత్తున ఎగిసి పడటం ఖాయం. ఆ సెగలో మాడి మసి అవుతారో.. లేక పద్ధతి మార్చుకుని బుద్ధిగా పాలన సాగిస్తారో మీరే తేల్చుకోండి.



అద్దేపల్లిలో టీడీపీ నాయకులు పెట్రోల్ పోసి తగలపెట్టిన వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం

- బాపట్ల జిల్లా అద్దేపల్లిలో పేట్రేగిన టీడీపీ నాయకులు
- పెట్రోల్ పోసి వైఎస్సార్ విగ్రహానికి నిప్పు
- తమ జెండా స్థూపం పగులగొట్టారంటూ టీడీపీ రివర్స్ ఫిర్యాదు
- ఇరువర్గాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- దళితవాడలో ఉద్రిక్తత.. పోలీస్ పికెట్ ఏర్పాటు



అద్దేపల్లిలో దహనం చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



అద్దేపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌన దీక్ష చేస్తున్న వరికూటి అశోక్‌బాబు

అద్దేపల్లి (భట్టిప్రోలు)/సాక్షి ప్రతినిధి బాపట్ల: టీడీపీ మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఎమ్మెల్యేగా ఉన్న వేమూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు బరితెగించారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధి అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అందరూ చూస్తుండగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. విగ్రహం ముప్పావు భాగానికి పైగా దగ్ధమైంది. దీంతో దళితవాడలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే, వైఎస్సార్ విగ్రహానికి సమీపంలో ఉన్న టీడీపీ జెండా దిమ్మెను వైఎస్సార్‌సీపీ వారు పగులగొట్టారని, అందుకు ప్రతీకారంగా వైఎస్ విగ్రహాన్ని తగులబెట్టినట్లు టీడీపీ వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. కానీ, టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే తమను రెచ్చగొట్టేందుకు జెండా దిమ్మెను కొద్దిగా పగులగొట్టుకుని ఆ సాకుతో వైఎస్ విగ్రహాన్ని కాల్చివేశారని వైఎస్సార్‌సీపీ నేతలు వాదిస్తున్నారు.

ఇరువర్గాలూ పరస్పర ఫిర్యాదులు

జిల్లాలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అనంతరం టీడీపీ అరాచకపర్వం కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా టీడీపీ నేతలు దాడులు చేస్తూ వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దీంతో చాలామంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిలో టీడీపీ జెండా దిమ్మెలను పగులగొట్టే పరిస్థితి వైఎస్సార్‌సీపీ నేతలకు లేదన్నది టీడీపీ నేతలకూ తెలుసు. కాకపోతే ఏదో సాకుచూపి విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. టీడీపీ కార్యకర్తలే వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఏడు మందిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. టీడీపీ జెండా దిమ్మె ధ్వంసం చేశారంటూ టీడీపీ నేతలు ప్రతిగా 14 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై కేసులు : ఎస్ఐ

ఈ ఘటన సమాచారం అందుకున్న వేమూరు సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కూడా భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. కాగా, వైఎస్సార్ విగ్రహం దగ్ధం చేసిన ఏడుగురిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై 435, 427, 507 ఆర్/34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మరోవైపు టీడీపీ జెండా దిమ్మను ధ్వంసం చేసినట్లు ఆ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. దళితవాడలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. ఇదిలా ఉంటే..

విగ్రహాలు ధ్వంసం హేయం : మేరుగు

స్ఫూర్తిని నింపిన మహనీయుల విగ్రహాల ధ్వంసం, దహనం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని మాజీమంత్రి మేరుగు నాగార్జున అన్నారు. విగ్రహం దహనం విషయం తెలుసుకున్న ఆయన అద్దేపల్లిని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. టీడీపీ దురాగతాన్ని ఖండించారు.

హుటాహుటిన మరొక విగ్రహం ఏర్పాటుకు యత్నం

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శనివారం రాత్రి అద్దేపల్లి విచ్చేసి కాలిపోయిన వైఎస్ విగ్రహాన్ని పరిశీలించారు. అక్కడే వైఎస్సార్ మరో విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. విగ్రహం ఏర్పాటు పూర్తయ్యే వరకూ ఆయన స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని మౌన దీక్ష చేశారు. దళితవాడ ప్రజలు అండగా వచ్చి ఆయనకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. రాత్రి 10గంటల ప్రాంతంలో పోలీసులు అశోక్ బాబు దీక్షను భగ్నంచేసి ఆయన్ను రేపల్లె తరలించారు. అక్కడా ఆయన పోలీసు వాహనం దిగకుండా దీక్ష కొనసాగిస్తున్నారు. మహిళలు, చిన్నారులు అని చూడకుండా పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జి చేశారు. విగ్రహాన్ని దగ్ధం చేయడం గ్రామ చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిందని.. చంద్రబాబు రాక్షస పాలనకు ఇది పరాకాష్టని అశోక్‌బాబు మండిపడ్డారు.

కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు

భారత క్రికెట్ జట్టుకు జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న భారత క్రికెట్ జట్టుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు సొంతం చేసుకుందని ప్రశంసించారు. టోర్నీ ఆద్యంతం సమష్టి కృషితో భారత జట్టు విజయాలు సాధించిందన్నారు. వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో ఓటమితో తీవ్ర నిరాశకు గురైన అభిమానులకు ఈ విజయం గొప్ప ఊరటనిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు. జట్టును విజయవంతంగా నడిపించడంలో అతడు చక్కటి నాయకత్వాన్ని ప్రదర్శించాడని కొనియాడారు. రానున్న రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని చాంపియన్‌షిప్‌లు సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు పేట్రేగిపోతున్నాయి



గవర్నర్‌కు ఫిర్యాదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ బృందం


- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నాయి
- పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి
- శాంతిభద్రతలు క్షీణించాయి.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- టీడీపీ అరాచకాలను అరికట్టాలని గవర్నర్‌కు వినతి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరానికి 'చంద్ర'శాపం

తన తప్పిదాలను జగన్‌పై నెట్టేందుకు శ్వేతపత్రంలో చంద్రబాబు అబద్ధాలు

- వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రణాళికాబద్ధంగా పనులు
- కరోనా కాలంలోనూ 48 గేట్లతో సహా రికార్డు సమయంలో స్పిల్ వే పూర్తి
- అప్రోచ్ చానల్, స్పిల్ చానల్, పైలట్ చానల్‌ను పూర్తి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 2021 జూన్ 11న 6.1 కి.మీ.ల పొడవున నదీ ప్రవాహం మళ్లింపు
- బాబు తప్పిదం వల్ల కోతకు గురైన దిగువ కాఫర్ డ్యామ్ పనులు పూర్తి
- ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలు పూడ్చివేత
- డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చి డిజైన్లను ఖరారు చేస్తే 18 నెలల్లో డ్యామ్ పూర్తి చేస్తామని స్పష్టీకరణ



2019 ఆగస్టులో వచ్చిన వరద సమయంలో పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే పరిస్థితి ఇది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014–19 మధ్య టీడీపీ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాల వల్లే పోలవరంలో పెను విధ్వంసం చోటు చేసుకుంది. ఆ తప్పిదాలే పోలవరానికి శాపంగా మారాయి. ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యానికి.. రూ.వేల కోట్ల నష్టానికి దారి తీశాయి. కమీషన్లకు ఆశ పడి తాను చేసిన తప్పిదాల వల్ల ప్రాజెక్టులో జరిగిన విధ్వంసం.. ఫలితంగా పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెడుతూ నిస్సిగ్గుగా సీఎం చంద్రబాబు పదే పదే అబద్ధాలు వల్లిస్తున్నారు. ఈనెల 17న పోలవరం పర్యటనలోనూ.. శుక్రవారం శ్వేతపత్రం విడుదల చేస్తున్నప్పుడూ వైఎస్ జగన్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తూ.. నిరాధారమైన అసత్య ఆరోపణలు చేస్తూ.. పచ్చి అబద్ధాలతో కట్టుకథలు అల్లుతూ చంద్రబాబు చిందులు తొక్కారు. రాజకీయాల్లో ఉండటానికి అర్హత లేని వ్యక్తులకు అధికారం ఇస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని ఆక్రోశం వెళ్లగక్కారు. చివరకు పోలవరాన్ని ఎప్పుడు పూర్తి చేస్తామనేది చెప్పలేక చేతులెత్తేశారు. సీఎం చంద్రబాబు చెప్పినట్టుగా రాజకీయాల్లో ఉండటానికి అర్హత లేని వారు ఎవరు.. అర్హత ఉన్న వారు ఎవరో చూద్దాం..

నిర్మాణ బాధ్యతల కోసం 30 నెలలు వృథా

రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయంతో తామే పూర్తి చేస్తామని ఏపీ పునర్విభజన చట్టం–2014 ద్వారా కేంద్రం హామీ ఇచ్చింది. కమీషన్లకు ఆశపడిన నాటి సీఎం చంద్రబాబు.. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకుని చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారు. ద్రవ్యోల్బణం వల్ల ధరలు పెరిగి అంచనా వ్యయం పెరుగుతుందని తెలిసినా, 2013–14 ధరలతోనే పోలవరాన్ని పూర్తి చేస్తానని 2016 సెప్టెంబరు 7న కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. ఇది పోలవరానికి నిధుల సమస్యకు ప్రధాన కారణమైంది. ఆ మరుసటి రోజే.. జలాశయం పనుల అంచనా వ్యయాన్ని 2015–16 ధరల ప్రకారం పెంచి రూ.1,481.41 కోట్ల మేర కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చారు. 2014 జూన్ 8 నుంచి 2016 డిసెంబర్ 30 వరకు ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి పనులు చేపట్టకుండా 30 నెలలు వృథా చేశారు.

చారిత్రక తప్పిదంతో విధ్వంసం

- ఏదైనా నదిపై ఒక ప్రాజెక్టును కట్టాలంటే.. తొలుత నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వేను పూర్తి చేయాలి. ఆ తర్వాత ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతానికి ఎగువన, దిగువన నదికి అడ్డంగా కాఫర్ డ్యామ్‌లు నిర్మించాలి. దీని వల్ల నదీ ప్రవాహం స్పిల్ వే మీదుగా మళ్లుతుంది. అప్పుడు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రధాన డ్యామ్ పనులు చేపట్టి, పూర్తి చేయవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనైనా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఇదే ప్రోటోకాల్ పాటిస్తారు.
- కానీ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మాత్రం నాటి సీఎం చంద్రబాబు ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కారు. నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వేను పూర్తి చేయకుండా పునాది స్థాయిలోనే వదిలేశారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్–2లో నది గర్భంలో 1,396 మీటర్ల పొడవున పునాది డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని 2018 జూన్ 11 నాటికే పూర్తి చేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి ప్రాంతానికి ఎగువన, దిగువన నదికి అడ్డంగా కాఫర్ డ్యామ్‌ల నిర్మాణాన్ని 2018 నవంబర్‌లో ప్రారంభించి పూర్తి చేయలేక 2019 ఫిబ్రవరిలో చేతులెత్తేశారు.
- స్పిల్ వే, స్పిల్ చానల్ పూర్తి చేయకపోవడం వల్ల నదీ ప్రవాహాన్ని మళ్లించడం సాధ్యం కాదు. అప్పుడు కాఫర్ డ్యామ్‌ల మీదుగా వరద ప్రవహిస్తే కొట్టుకుపోతాయనే నెపంతో.. కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేశారు. పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నది వెడల్పు 2,400 మీటర్లు. 2019, 2020లలో గోదావరికి వచ్చిన భారీ వరద 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిందిపోయి.. ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీగా వదిలిన 800 మీటర్లకు కుంచించుకుపోయి ప్రవహించాల్సి రావడంతో వరద ఉధ్భతి మరింత అధికమవడం వల్ల ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై విధ్వంసం చోటుచేసుకుంది. గరిష్ఠంగా 36.5 మీటర్లు.. కనిష్ఠంగా 26 మీటర్ల లోతుతో నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. గ్యాప్–2లో 1396 మీటర్ల పొడవుతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఇదే పనుల్లో జాప్యానికి, రూ.వేల కోట్ల నష్టానికి కారణమైంది. ఐఐటీ (హైదరాబాద్), ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) నిపుణులు ఇదే విషయాన్ని తేల్చి చెబుతూ నివేదిక ఇచ్చాయి.

ప్రణాళికాయుతంగా వడివడిగా పనులు

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–3లో 162 మీటర్ల పొడవున కాంక్రీట్ డ్యామ్ నిర్మాణాన్ని వైఎస్ జగన్ పూర్తి చేశారు. గ్యాప్–1లో 543 మీటర్ల పొడవున పునాది డయాఫ్రమ్ వాల్ నిర్మించారు. కుడి కాలువతోపాటు ఎడమ కాలువలో అత్యంత సంక్లిష్టమైన వరహ నదిపై అతి పొడవైన అక్విడెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి దాదాపుగా కొలిక్కి తెచ్చారు. జలాశయంతో కుడి, ఎడమ కాలువలను అనుసంధానం చేసే కనెక్టివిటీస్(హెడ్ రెగ్యులేటర్, సొరంగాలు)ను పూర్తి చేశారు. చంద్రబాబు చారిత్రక తప్పిదంవల్ల ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన భారీ అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో నింపి, వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తది నిర్మించాలా? లేదంటే దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేయాలా? అన్నది తేల్చి.. డిజైన్లను ఖరారు చేస్తే 18 నెలల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వం కేంద్ర జల్ శక్తి శాఖ, సీడబ్ల్యూసీ, పీపీఏలను కోరుతూ వచ్చింది. అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకుని డిజైన్లను ఖరారు చేద్దామని సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వేందర్‌సింగ్ వోరా ప్రతిపాదించారు. ఆ మేరకు కాంట్రాక్టు సంస్థ స్వీడన్‌కు చెందిన యాఫ్రిని అంతర్జాతీయ కన్సల్టెంట్‌గా నియమించుకుంది. ఫిబ్రవరిలో యూఎస్ఏకు చెందిన ఇద్దరు, కెనడాకు చెందిన మరో ఇద్దరు నిపుణుల ను పీపీఏ ఎంపిక చేసింది. యాఫ్రి, అంతర్జాతీయ నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన డిజైన్లతో సవాళ్లను అధిగమిస్తూ.. పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. చంద్రబాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే.. 2022 నాటికే వైఎస్ జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారని సాగు నీటి రంగ నిపుణులు చెబుతున్నారు.

కరోనా వేళ రికార్డు సమయంలో స్పిల్ వే పూర్తి

వైఎస్ జగన్ సీఎంగా 2019 మే 30న బాధ్యతలు స్వీకరించారు. 2019 జూన్ రెండో వారంలోనే గోదావరి వరద ప్రారంభమైంది. నవంబర్‌కు తగ్గుముఖం పట్టింది. ఆ వెంటనే ప్రోటోకాల్ ప్రకారం.. నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2020 మార్చిలో కరోనా మహమ్మారి విజృంభించి.. 2021 ఆఖరు వరకు అతలాకుతలం చేసింది. అయినప్పటికీ స్పిల్ వే నిర్మాణాన్ని పరుగులెత్తించారు. స్పిల్ వే పియర్స్‌ను 53.32 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసి.. వాటికి 25.72 మీటర్ల నుంచి 45.72 మీటర్ల మధ్య 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో ప్రపంచంలోనే అతి పెద్ద గేట్లను బిగించారు. వరద వచ్చినప్పుడు దిగువకు విడుదల చేయడానికి వీలుగా గేట్లను ఎత్తడానికి, దించడానికి జర్మనీ, జపాన్‌ల నుంచి హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్లను దిగుమతి చేసుకుని వాటికి అమర్చారు. స్పిల్ వేపై రాకపోకలకు వీలుగా 1,118 మీటర్ల పొడవున స్పిల్ వే బ్రిడ్జిని పూర్తి చేశారు. నదీ ప్రవాహాన్ని స్పిల్ వే వైపునకు మళ్లించేందుకు వెయ్యి మీటర్ల వెడల్పు.. 2,100 మీటర్ల పొడవుతో అప్రోచ్ చానల్ తవ్వారు. స్పిల్ వే నుంచి దిగువకు వదలిన వరద ప్రవాహాన్ని తిరిగి నదిలోకి కలపడం కోసం 2,920 మీటర్ల పొడవున స్పిల్ చానల్, వెయ్యి మీటర్ల పొడవున పైలట్ చానల్‌లను పూర్తి చేశారు. ఆలోగా ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. దాంతో 2021 జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ చానల్, పైలట్ చానల్ మీదుగా 6.1 కి.మీల పొడవున గోదావరి ప్రవాహాన్ని మళ్లించి రికార్డు సృష్టించారు.

కాఫర్ డ్యామ్‌ల లీకేజీల పాపం బాబు సర్కార్‌దే

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను చేపట్టడానికి వీలుగా లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి జెట్ గ్రౌటింగ్ చేయాలి. అయితే నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం గోదావరి నదిలో ఇసుక పర్మియబులిటీ విలువను 2018లో అప్పటి కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ తప్పుగా మదింపు చేసింది. దాన్నే పరిగణనలోకి తీసుకుని 30 నుంచి 35 మీటర్ల లోతు వరకూ స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేయకుండా కేవలం 20 మీటర్ల లోతు వరకూ జెట్ గ్రౌటింగ్ చేసేలా డిజైన్‌లు రూపొందించింది. నవయుగ సంస్థ ఆ మేరకే జెట్ గ్రౌటింగ్ చేసి కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. జెట్ గ్రౌటింగ్ నిబంధనల మేరకు చేసి ఉంటే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీ సమస్య ఉత్పన్నమయ్యేది కాదని సాగు నీటి రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తన హయాంలో జరిగిన ఈ తప్పిదాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెట్టేందుకు సీఎం చంద్రబాబు యత్నించడం గమనార్హం.

రూ.12,157.53 కోట్లకు మోకాలడ్డు

పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేస్తానని 2016 సెప్టెంబరు 7న చంద్రబాబు కేంద్రానికి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఒప్పందం చేసుకున్నారు. 2013–14 ధరల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.20,398.61 కోట్లే. ఇందులో 2014 ఏప్రిల్ 1 వరకూ చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లుపోనూ మిగతా రూ.15,667.9 కోట్లే ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అయితే 2017–18 ధరల ప్రకారం పునరావాసం, భూసేకరణ వ్యయమే రూ.33,168.23 కోట్లు. అందువల్ల రూ.20,398.61 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని, తాజా ధరల మేరకు నిధులిచ్చి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని 2019 మే 30 నుంచి పలుదఫాలు ప్రధాని మోదీని అప్పటి సీఎం వైఎస్ జగన్ కోరుతూ వచ్చారు. దానికి ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు అవసరమని కేంద్ర జల్ శక్తి శాఖ తేల్చింది. ఆ మేరకు నిధులు విడుదల చేయాలని మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అప్పటికే బీజేపీతో పొత్తు కుదరడంతో పోలవరానికి నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ ముందు పెట్టవద్దని, తమకు రాజకీయంగా ఇబ్బందులు వస్తాయంటూ చంద్రబాబు అడ్డుపుల్ల వేశారు. ప్రస్తుతం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నందున, ఆ ప్రతిపాదనపై కేంద్ర కేబినెట్‌తో ఆమోద ముద్ర వేయిస్తే నిధుల సమస్య తీరుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సాంకేతిక సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం సీడబ్ల్యూసీ ద్వారా ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ఆ ప్రణాళికను అమలు చేయడం ద్వారా ప్రాజెక్టు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సాగు నీటి రంగ నిపుణులు సూచిస్తున్నారు.

సినిమా

అమితాబ్ అలా చేస్తారని ఊహించలేదు



- నిర్మాత సి. అశ్వినీదత్

‘‘అమితాబ్ బచ్చన్ గారు లెజెండ్. మేము సెట్స్‌లో కలిసినప్పుడు పరస్పరం నమస్కరించుకుంటాం. కానీ ముంబైలో జరిగిన ‘కల్కి 2898 ఏడీ’ ప్రీ రిలీజ్ వేడుకలో నా కాళ్లకి అమితాబ్‌గారు నమస్కరించడంతో నాకు తల కొట్టేసినంత పని అయింది. ఆయన అలా చేస్తారని నేను అస్సలు ఊహించలేదు’’ అన్నారు నిర్మాత సి. అశ్వినీదత్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో సి. అశ్వినీదత్ మాట్లాడుతూ– ‘‘నాగ్ అశ్విన్ ఎంత పెద్ద సినిమా అయినా తీయగలడనే నమ్మకం నాకు మొదటి నుంచి ఉంది. ఈ శతాబ్దంలో ఒక మంచి దర్శకుడు మా ఇంట్లోనే దొరికాడు (నవ్వుతూ). ‘కల్కి’ విషయంలో టెన్షన్ పడలేదు. ఈ సినిమా అఖండ విజయం సాధించాలనే ఉద్దేశంతోనే తీశాం... అది నెరవేరింది. ప్రభాస్ సహకారం లేకపోతే అసలు ఈ సినిమా బయటికి రాదు. రాజమౌళి–ప్రభాస్‌ల ఎపిసోడ్ ఫన్నీగా పెట్టిందే. అలాగే బ్రహ్మానందం, రామ్‌గోపాల్ వర్మ పాత్రలని కూడా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. ఈ కథ అనుకున్నప్పుడే రెండో భాగం ఆలోచన వచ్చింది. కమల్‌గారు ఎంటరైన తర్వాత పార్ట్ 2 డిసైడ్ అయిపోయాం. ‘కల్కి 2898 ఏడీ’ పార్ట్ 2 వచ్చే ఏడాది జూన్‌లోనే విడుదల కావొచ్చు. 50 ఏళ్ల వైజయంతీ మూవీస్ ప్రయాణం అద్భుతం. ప్రస్తుతం శ్రీకాంత్‌గారి అబ్బాయి రోషన్‌తో ఓ సినిమా, దుల్కర్ సల్మాన్‌తో ఒక చిత్రం నిర్మిస్తున్నాం’’ అన్నారు.

ఆ విషయంలో తప్పు చేశాను



- సమంత

‘‘నేను గతంలో కొన్ని ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించి తప్పు చేశాను. అయితే కావాలని చేసిన తప్పు కాదు’’ అంటున్నారు సమంత. గత ఏడాది విడుదలైన ‘ఖుషి’ తర్వాత సినిమాల నుంచి బ్రేక్ తీసుకుని, పూర్తి స్థాయిలో ఆరోగ్యంపై దృష్టి పెట్టారామె (గతంలో మయోసైటిస్ బారినపడ్డారు). అయితే సినిమాలకు గ్యాప్ ఇచ్చినా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. తన ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంతో పాటు అభిమానులతోనూ ముచ్చటిస్తుంటారు. ఈ క్రమంలోనే తాజాగా అభిమానులతో చిట్ చాట్ చేశారు సమంత. ‘ఆరోగ్యం గురించి ఇప్పుడు మీరు మంచి విషయాలు చెబుతున్నారు. కానీ గతంలో మీరే అనారోగ్యకరమైన ఉత్పత్తులని ప్రమోట్ చేశారు కదా?’ అని ఓ నెటిజన్ ప్రశ్నించారు. ఇందుకు సమంత బదులిస్తూ– ‘‘అవును.. నేను గతంలో తప్పులు చేసిన మాట వాస్తవమే. కానీ కావాలని చేసినవి కావు. వాటి గురించి తెలిసిన తర్వాత ఆ బ్రాండ్స్‌ను ప్రమోట్ చేయడం మానేశాను. ప్రస్తుతం నేను ఏదైతే చేస్తున్నానో వాటిని మాత్రమే ప్రమోట్ చేస్తున్నాను’’ అన్నారు.

కొత్త వెబ్ సిరీస్‌లో... దర్శక–ద్వయం రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన వెబ్ సిరీస్ ‘ది ఫ్యామిలీ మేన్ 2’లో సమంత నటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వారిద్దరూ తెరకెక్కిస్తున్న ‘సిటాడెల్: హనీ బన్నీ’ అనే వెబ్ సిరీస్‌లోనూ సమంత నటించారు. ఈ సిరీస్ త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. కాగా రాజ్ అండ్ డీకే ద్వయం దర్శకత్వం వహించనున్న కొత్త వెబ్ సిరీస్‌లో సమంత కీలక పాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఆదిత్య రాయ్ కపూర్ కూడా నటించనున్నారట. ఈ వెబ్ సిరీస్‌కి ‘రక్తబీజ్’ అనే టైటిల్ ఖరారు చేశారని భోగట్టా. ఆగస్ట్‌లో ఈ సిరీస్ షూటింగ్ ఆరంభం కానుందని సమాచారం.

వైరల్

దుపట్టా డ్యాన్స్... దుమ్ము రేపింది

సంజూ రాథోడ్ పాడిన మరాఠీ సాంగ్ ‘గులాబి శాదీ’ సూపర్ హిట్ కావడమే కాదు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఈ సాంగ్‌ను బేస్ చేసుకొని డ్యాన్సింగ్ నుంచి లిప్–సింకింగ్ వరకు సోషల్ మీడియా యూజర్‌లు రకరకాల వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. అలాంటి ఒక వీడియో వైరల్ అయింది.

‘గ్రూమ్స్ ఫ్రెండ్స్ ఆన్ ఫైర్’ అనే కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 4.5 మిలియన్ వ్యూస్ దక్కించుకుంది. గులాబీ రంగు దుపట్టా వేసుకొని వరుడి ఫ్రెండ్స్ చేసిన డ్యాన్స్ ‘వారేవా’ అనేలా ఉంది.





నీలి వెన్నెల జాబిలీ నిన్ను చూసి మురిసి...



‘బ్లూ మేకప్’ అనేది ఇప్పుడు వైరల్ బ్యూటీ ట్రెండ్. అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ బిల్లీ ఎలీష్ పాట ‘బ్లూ’ నుంచి ఈ మేకప్ ట్రెండ్ మొదలైంది. 2016లో ‘ఓషన్ ఐస్’ ఆల్బమ్ విడుదల అయిన తరువాత ‘బ్లూ’ పాట రాసింది ఎలీష్.

లేటెస్ట్‌గా ఆ పాటను మరింత కొత్తదనంతో రీక్రియేట్ చేస్తే సంగీత ప్రియులను తెగ ఆకట్టుకుంది. ఆ పాటకు వచ్చిన పాపులారిటీ ‘బ్లూ బ్యూటీ ట్రెండ్’కు నాంది పలికింది.

ఈ ట్రెండ్‌లో భాగంగా ఫ్యాషన్ అండ్ బ్యూటీ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు, సెలబ్రిటీలు రకరకాల వీడియోలు చేస్తున్నారు. ఈ ట్రెండ్‌లో భాగంగా కంటెంట్ క్రియేటర్, డాన్సర్ ఆనమ్ దర్బార్ స్విమ్మింగ్‌పూల్ వీడియో చేసింది. బ్యూటీ ఇన్‌ఫ్లూయెన్సర్ మృణాల్ పాంచాల్ ‘వాటర్’ ఎలిమెంట్‌తో వీడియో చేసింది. ఈ వీడియోలో మృణాల్ నీలిరంగు సీతాకోకచిలుకలా కనిపిస్తుంది. మొత్తానికైతే ‘బ్లూ మేకప్ ట్రెండ్’ మన దేశంలోనూ సందడి చేస్తోంది.

పిడుగు ముద్దాడ బోయింది







వానలో తడవాలని పిల్లలకు ఉంటుంది. జల్లుల్లో వాళ్ల కేరింతలు కొడితే ముద్దొస్తారు. మరి పిడుగుకు ముద్దొస్తే? తృటిలో ప్రాణాలు తప్పిపోయాయి. వానలో పిల్లలు జాగ్రత్త.

బిహార్‌లోని సీతామర్హిలో ఒకమ్మాయి వానలో టెర్రస్ మీద సరదాగా కేరింతలు కొడుకుతుంటే తల్లి అది ఫోన్‌లో వీడియో తీయసాగింది. మనం అనుకుంటాం వాతావరణం ఆహ్లాదంగా ఉందని. కాని మెరుపులు, పిడుగులు ఎలా మెరిసి ఉరుముతాయో తెలియదు కదా. ఇక్కడ ఆ అమ్మాయికి కొద్ది దూరంలోనే పిడుగు పడింది. క్షణాల్లో ఆ అమ్మాయి లోపలికి పరిగెత్తింది. అమ్మాయి, తల్లి క్షేమమేగాని గురి సూటిగా ఉండి ఉంటే? అందుకే జాగ్రత్త. ఇకపై వానలు... ఉరుములు... పిడుగులు..

విశాల హృదయం





క్వశ్చన్ పేపర్‌లో ‘గుండె బొమ్మ గీసి వివిధ భాగాలను వివరించుము’ అనే ప్రశ్నను చూసిన స్టూడెంట్ మహాశయుడు ఎక్కడికో వెళ్లిపోయాడు. గుండె బొమ్మను కలర్‌ఫుల్‌గా గీయడం వరకు ఓకే. అయితే ఆ గుండెలో వివిధ భాగాలలో తాను ప్రేమించిన అమ్మాయిల పేర్లు రాశాడు. ప్రియా, నమిత, హరిత, రూప, పూజలాంటి పేర్లు రాశాడు. మరో అడుగు ముందుకు వేసి ‘ఫంక్షనింగ్ ఆఫ్ హార్ట్’ అనే హెడ్‌లైన్‌తో వారిని తాను ఎందుకు ప్రేమిస్తున్నానో రాశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో నెటిజనులను నవ్వులలో ముంచెత్తుతుంది.

ఆవురా... ఎంత క్రమశిక్షణ!





క్రమశిక్షణ తప్పిన వారిని ‘పశువులా ప్రవర్తించకు’ అంటాం. ఈ వైరల్ వీడియోను చూస్తే మాత్రం ‘పశువును చూసి నేర్చుకో’ అంటాం. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ఎడా పెడా దూసుకుపోయేవాళ్లు ఈ వీడియోను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పుణెలో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గరకు వచ్చిన ఒక ఆవు ఎరుపు రంగు ట్రాఫిక్ లైట్‌ను చూసి అడుగు ముందుకు వెయ్యలేదు. ట్రాఫిక్ లైట్ ఆకుపచ్చ రంగులో మారే వరకు ఓపికగా ఎదురు చూసింది. ఆ తరువాతే ముందుకు కదిలింది. మ్యూజిక్ జోడించి ఈ వీడియోను పుణె పోలీసులు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. రోడ్డు భద్రత గురించి ప్రచారం చేయడానికి ఈ వీడియోను ఉపయోగిస్తున్నారు. ఆవు క్రమశిక్షణకు ముచ్చటపడిన నెటిజనులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

మైకేల్ జాక్సన్ తీన్మార్



హిందీ ఫోక్ సాంగ్‌కు మైకేల్ జాక్సన్ ఆయన స్టైల్లోనే డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుంది?

ఎలా ఉంటుంది కాదు... అసలు ఎలా వీలవుతుంది?! అంటారా. సాంకేతిక మాయాబజార్‌లో ఏదైనా సాధ్యమే. కామెడి డ్రామా స్ట్రీమింగ్ టీవీ సిరీస్ ‘పంచాయత్’కు సంబంధించి మీమ్స్, వైరల్ వీడియోలు వస్తూనే ఉన్నాయి. అందులో ఒకటి మైకేల్ జాక్సన్ డ్యాన్స్ వీడియో. ఈ ఫ్యాన్–మేడ్ వీడియో 8 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఈ వీడియోలో ‘ఏ రాజాజీ రాజాజీ’ అనే పాటకు మైకేల్ జాక్సన్ డ్యాన్స్ చేస్తూ కనిపిస్తాడు. అయితే ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు. చాలా సహజంగా ఉండడమే ఈ వీడియో వైరల్ కావడానికి కారణం అయింది.

హెల్త్

డయాబెటిక్ నెఫ్రోపతి
మూత్రపిండాలకు షుగర్ దెబ్బ!

మధుమేహానికి ఉన్న ప్రధాన లక్షణం చాపకింది నీరులా కీలక అవయవాలను దెబ్బతీయడం. ఆ క్రమంలో అది మూత్రపిండాలనూ దెబ్బతీయవచ్చు. దాంతో దీర్ఘకాలంలో మూత్రపిండాలు (కిడ్నీలు) పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంటుంది. చక్కెర వ్యాధి కారణంగా ఇలా మూత్రపిండాలు దెబ్బతినే స్థితిని ‘డయాబెటిక్ నెఫ్రోపతి’ అంటారు. ఇది చాలా ప్రమాదకరం, ఒక్కోసారి ప్రాణాంతకం కూడా. షుగర్ వ్యాధి మూత్రపిండాలను దెబ్బతీయడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటిని నివారించుకునే మార్గాలు...

మూత్రపిండాలు మన దేహంలోని వ్యర్థాలనూ, విషపదార్థాలను క్రమంగా తొలగిస్తుంటాయి. ఈ పనిలో అవి రక్తాన్ని శుద్ధి చేస్తుంటాయి. వీటి పనితీరు నూరు శాతం నుంచి 30 శాతానికి పడిపోయే వరకు ఆ విషయమే తెలియదు. అందుకే తేలిగ్గానే నివారించుకోగలిగే ‘డయాబెటిక్ నెఫ్రోపతి’ గురించి అప్రమత్తంగా ఉండాలి. చక్కెర వ్యాధి ఉన్నట్లయితే, దాన్ని పూర్తిగా అదుపులో ఉంచుకోవడం, అప్పుడప్పుడూ మూత్రపిండాల్ని పరీక్షించుకుంటూ ఉండటం వల్ల దీన్ని తేలిగ్గానే నివారించుకోవచ్చు. ఇంత తేలిగ్గా నివారించుకోగలిగే ఈ కండిషన్‌ను నిర్లక్ష్యం చేస్తే అది కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారితీస్తుందనీ, అది చాలా ప్రమాదకరమని గుర్తుంచుకోవాలి.

లక్షణాలు...

ముందుగా చెప్పినట్లుగా కిడ్నీల పనితీరు నూరు శాతం నుంచి 30 శాతానికి పడిపోయే వరకు లక్షణాలు బయటకు కనిపించవు. దాంతో కిడ్నీలు పూర్తిగా దెబ్బతినే వరకు లక్షణాలేమీ బయటకు కనిపించవు. లక్షణాలు కనిపిస్తున్నాయంటే కిడ్నీ చాలావరకు దెబ్బతిన్నదని అర్థం.

- వికారం లేదా వాంతులు
- కాళ్లూ, చీలమండ, చేతులు లేదా కళ్ల మీద వాపు
- మూత్రం నురగలాగా రావడం
- శ్వాస అందడంలో ఇబ్బంది
- ఆకలి మందగించడం
- ఒళ్లంతా దురదలు
- పూర్తిగా అలసిపోయినట్లు అనిపించడం, నీరసం లేదా నిస్సత్తువ
- అయోమయంగా అనిపించడం, ఆలోచనల్లో స్పష్టత లోపించడం.

ఇతర దుష్ప్రభావాలు...

- ఒంట్లో వ్యర్థాలు చేరడంతో కాళ్లవాపు, ఊపిరి తిత్తులలో నీరు చేరడంతో లంగ్స్ వాపు (పల్మనరీ ఎడిమా)
- ఒంట్లో పొటాషియమ్ మోతాదులు పెరగడంతో హైపర్ కెలీమియా అనే కండిషన్.
- గుండె రక్తనాళాలలో చివర్లు చిట్లిపోతే గుండెజబ్బులు, గుండెపోటు
- దేహంలోని కణాలకు రక్తం సరిగా అందక పోవడం వల్ల రక్తహీనత (అనీమియా)
- గర్భిణుల్లో గర్భస్రావం లేదా పిండం పెరుగుదలలో లోపాలు.

నిర్ధారణ

- రక్తంలో సీరమ్ క్రియాటినిన్ మోతాదులు తెలిపే కిడ్నీ పనితీరు పరీక్ష (కిడ్నీ ఫంక్షన్ టెస్ట్)తో దీన్ని గుర్తించవచ్చు. ఇది చాలా తేలిక, చవక కూడా.



నివారణ:
- బీపీని, షుగర్‌నీ అదుపులో ఉంచుకోవడం
- డాక్టర్ సలహా లేకుండా మందులు వాడకపోవడం
- ధూమపానం మానేయడం
- కొవ్వు మోతాదులు ఎక్కువగా ఉండే మాంసాహారం మానేయడం లేదా పరిమితంగా తీసుకోవడం
- బరువును అదుపులో ఉంచుకోవడం.
- నలభై ఏళ్లు దాటాక క్రమం తప్పకుండా షుగర్ టెస్ట్ చేయించడం.

ఎందుకిలా...

వడపోత ప్రక్రియలో ఈ రక్తశుద్ధి క్యాపిల్లరీస్ అని పిలిచే రక్తకేశ నాళికల చివర్లలో గ్లోమెరూల్స్ అనే చోట జరుగుతుంది. చక్కెరవ్యాధి వల్ల రక్తనాళాల చివర్లలోని అతి సన్నటి రక్తకేశ నాళికలు (క్యాపిల్లరీస్) దెబ్బతింటాయి. దాంతో వడపోత ప్రక్రియ దెబ్బ తింటూ పోవడం వల్ల వడపోత సామర్థ్యం కూడా క్రమంగా పడిపోతూ ఉంటుంది. అలా కిడ్నీలు పూర్తిగా దెబ్బ తిని... ఇక ఏమాత్రం వడపోయలేని పరిస్థితిని ‘ఎండ్ స్టేజ్ కిడ్నీ డిసీజ్’ అంటారు. ఆ పరిస్థితి రాకముందే జాగ్రత్తపడాలి.

మరో విషయం ఏమిటంటే... రక్తపోటు (హైబీపీ) రక్తం చాలా తీవ్రమైన ఒత్తిడితో ప్రవహించడంతో ఆ ఒత్తిడికి క్యాపిల్లరీస్ చిట్లిపోవడం వల్ల కూడా కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ముందుగానే గుర్తించకపోతే ఆ సమస్యతోనూ కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

చికిత్స:
- కిడ్నీ పనితీరు తగ్గుతూ పోతూ ఉన్న విషయాన్ని ముందుగానే తెలుసుకుంటే నెఫ్రాలజిస్టులు/యూరాలజిస్టులు కొన్ని మందులు వాడుతూ, ఆ దెబ్బతినే ప్రక్రియను మందగించేలా చేయడం ద్వారా కిడ్నీని కాపాడడానికి ప్రయత్నిస్తారు
- కిడ్నీ పూర్తిగా దెబ్బతింటే క్రమం తప్పకుండా డయాలసిస్ చేయాలి. ఇది చాలా ఖర్చుతోనూ, శ్రమతోనూ కూడిన ప్రక్రియ
- చివరగా యూరాలజిస్టుల ఆధ్వర్యంలో కిడ్నీమార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్) చేయాల్సి ఉంటుంది.

కిడ్నీలకు ముప్పు తెచ్చిపెట్టే అంశాలు (రిస్క్ ఫ్యాక్టర్స్)...

- అదుపులో లేని చక్కెర (హైపర్ గ్లైసీమియా)
- అదుపు లేని రక్తపోటు (హైపర్‌టెన్షన్)
- రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు పెరగడం
- బరువు విపరీతంగా పెరగడం (ఒబేసిటీ)
- పొగతాగడం
- కుటుంబ ఆరోగ్య చరిత్రలో డయాబెటిస్, కిడ్నీ వ్యాధులు ఉండటం.



డా॥ అరుణ్‌కుమార్ రెడ్డి
సీనియర్ నెఫ్రాలజిస్ట్

యువతలో నిద్రలేమి అనర్థాలు!



యువతలో నిద్రలేమి ఓ సమస్యగా మారింది. కొన్ని వృత్తుల కారణంగా నిద్రపోవాల్సిన టైమ్‌లోనూ మెలకువతో ఉండి పనిచేస్తూ ఉండటం, రాత్రివేళల్లో మొబైల్ చూసుకుంటూ నిద్రకు దూరం కావడం యువతకు పరిపాటిగా మారింది. నిద్రలేమిని వైద్య పరిభాషలో ‘ఇన్‌సోమ్నియా’ అంటారు. నిద్రలేమితో వచ్చే అనర్థాలూ, ఆరోగ్యసమస్యలూ, వాటిని అధిగమించే మార్గాలపై అవగాహన కోసం...

అనేక అధ్యయనాల్లో తేలిన ఫలితాల ఆధారంగా సాధారణ ఆరోగ్యం బాగుండాలంటే కంటినిండా నిద్ర చాలా అవసరమంటూ అంతర్జాతీయంగా స్లీప్ స్పెషలిస్టులందరూ ఉద్ఘోషిస్తున్నారు. ఇటీవలే యూఎస్‌లోని న్యూ ఓర్లియాన్స్‌లో నిర్వహించిన ఓ సదస్సులో తమ అధ్యయన ఫలితాలను ప్రకటిస్తూ... కొత్త కంప్యూటర్ ఆటలూ, కొత్త గాడ్జెట్లు, మొబైల్స్ కారణంగా యువత, టీనేజీ పిల్లల్లో నిద్రించే టైమ్ బాగా తగ్గిపోతోందన్న ఆందోళన వ్యక్తం చేశారు. యువత ఫిట్‌నెస్ బాగుండాలంటే కనీసం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల నిద్ర ఉండాలనీ, లేకపోతే అనేక శారీరక, మానసిక సమస్యలు వచ్చే అవకాశముందని హెచ్చరించారు.

యువతలో నిద్రలేమిని తెచ్చిపెట్టే అంశాలివే...

- పనిప్రదేశం (వర్క్‌ప్లేస్)లో మాటిమాటికీ తీసుకునే కాఫీ లేదా కోలాడ్రింక్స్‌లో ఉండే కెఫీన్‌తో పాటు టీలో ఉండే స్టిమ్యులెంట్స్
- సోషల్ మీడియాకు అలవాటు పడి ఎప్పుడూ ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి ప్లాట్‌ఫామ్‌ల మీదే ఉండటం. వాటిని చూస్తున్న కారణంగా నిత్యం బ్లూ రేడియేషన్‌కు ఎక్స్‌పోజ్ అవుతూ ఉండటం
- కీళ్లవాతం లాంటి కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు
- అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా కారణంగా నిద్ర లేకపోవడం
- ఆఫీస్ టైమింగ్స్ (కొన్ని సంస్థల్లో లేట్ నైట్స్ పనిచేయ వలసి రావడం).

నిద్రలేమితో అనర్థాలు...
- **ఊబకాయం** : ఇది తొలి అనర్థం కాగా... అనేక ఆరోగ్య సమస్యలకు ఈ ఒబేసిటీయే ప్రధాన కారణమవుతూ ఉండటం.
- **లైఫ్‌స్టైల్ డిసీజెస్** : అర్లీ హైపర్ టెన్షన్, అర్లీ డయాబెటిస్, గుండెదడ

రాత్రి నిద్ర ఎందుకు... దాంతో మంచి ఆరోగ్యం ఎలా...

మెదడులోని బయలాజికల్ క్లాక్ వల్ల పగటిపూట చురుగ్గా ఉండటం, రాత్రివేళ నిద్రించడం జరుగుతుంది. దీన్నే ‘సర్కాడియన్ రిథమ్’ అంటారు. ఈ రిథమ్ దెబ్బతింటే ఆరోగ్యానికి హాని జరుగుతుంది. మెదడులో స్రవించే సెరిటోనిన్‌తో పాటు ఇతర రసాయనాల సమతుల్యత దెబ్బతినడంతో ఆరోగ్యంపై అనేక ప్రతికూల ప్రభావాలు పడతాయి.

నిద్రలేమి నివారణకు...

- వృత్తిపరమైన అవసరాల వరకే ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, ఇంటర్‌నెట్ వంటి వాటిని ఉపయోగించడం.
- ఓ పవర్ న్యాప్ లాంటి అరగంట కునుకు తప్ప... పగటి నిద్రకు దూరంగా ఉండటం
- సమతుల ఆహారం తీసుకుంటూ తగినంత వ్యాయామం చేయడం. (వ్యాయామం ఉదయం వేళలోనే చేయడం మంచిది. సాయంత్రం చేయడం వల్ల కొన్నిసార్లు రాత్రి నిద్రలేమికి కారణం కావచ్చు)
- నిద్రకు ముందు గోరువెచ్చని పాలు తాగడం (దాంతో పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనోయాసిడ్ ఓ స్లీపింగ్ పిల్‌లా పనిచేసి, ఆరోగ్యకరమైన నిద్రనిస్తుంది)
- కాఫీ, టీ, కోలా డ్రింక్స్ వంటివి నిద్రకు ఉపక్రమించడానికి 3, 4 గంటల ముందుగా తీసుకోకపోవడం.
- ఆల్కహాల్, పొగతాగడం వంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండటం.

చికిత్స:
- నిద్రలేమికి కారణమైన ఆరోగ్య సమస్యను గుర్తించి దానికి చికిత్స అందించాలి.
- యువతకు వారి అవసరాన్ని / నిద్రలేమి కారణాన్ని బట్టి ఒక్కోసారి ‘కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ’ అవసరం కావచ్చు.
- కొందరిలో పరిమిత కాలానికి నిద్రమాత్రలతో చికిత్స.




డాక్టర్ టి. అనురాధ
సీనియర్ కన్సల్టెంట్ స్లీప్ స్పెషలిస్ట్ & పల్మొనాలజిస్ట్

మెడిటిప్
ప్రోస్టేట్ సమస్యల నివారణ కోసం...

మానవ పునరుత్పత్తి ప్రక్రియ కోసం పురుషుడిలో ఉండే కీలక గ్రంథి ప్రోస్టేట్. వృషణాల నుంచి వీర్యకణాల తయారీ తర్వాత అవి ఈదుతూ మనుగడ సాగించేందుకూ, ఆ వీర్యకణాలను కాపాడేందుకు అవసరమైన ద్రవాన్ని ప్రోస్టేట్ గ్రంథి ఉత్పత్తి చేస్తుంది. దాదాపు 50 ఏళ్లు దాటిన చాలామందిలో ఈ గ్రంథి సైజు పెరగవచ్చు. దీనివల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతాయి.

దీనిని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా... కొన్ని జాగ్రత్తలతో చాలావరకు నివారించవచ్చు. అవి...

- మూత్ర విసర్జన ఫీలింగ్ రాగానే... ఆపుకోకుండా మూత్రవిసర్జనకు వెళ్లడం
- ఎక్కువ మోతాదులో నీళ్లు తాగకుండా ఉండటం
- నిద్రకు ఉపక్రమించబోయే 2 – 3 గంటల ముందుగా మాత్రమే నీళ్లు / ద్రవాహారాలు తీసుకోవడం
- కెఫీన్ మోతాదులు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింకులూ, కాఫీ వంటివి పరిమితంగా మాత్రమే తీసుకోవడం
- శరీరాన్ని వీలైనంత వెచ్చగా ఉంచుకోవటం (చలి వాతావరణం ఈ సమస్యను మరింత పెంచుతుంది)
- చురుగ్గా ఉండటం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం.



“ గడిచిన మూడు, నాలుగేళ్లు ఎంతో కష్టపడ్డాం. కానీ ఆఖరి ఫలితాలే అందుకోలేకపోయాం. ఈసారి మాత్రం ఏ అవకాశాన్ని వదులుకోవద్దనుకున్నాం. జట్టుగా సమష్టిగా రాణించి ప్రపంచకప్‌ను అందుకున్నాం. నాకే కాదు విరాట్ కోహ్లి ఫామ్‌పై మాలో ఎవరికి ఏ సందేహం లేదు. అతను ఆడాల్సిన సమయం వస్తే కచ్చితంగా నిలబడతాడు. జట్టును నిలబెడతాడు. వికెట్ అంత సులువుగాలేని చోట కోహ్లి చేసిన 76 పరుగులు, అక్షర్ మెరుపులు చాలా కీలకమయ్యాయి. బుమ్రా గురించి చెప్పాల్సిన పనిలేదు. హార్దిక్ పాండ్యా తీసిన వికెట్లు, సూర్య క్యాచ్ అన్నీ కుదిరాయి కాబట్టే విజేతలమయ్యాం.

–రోహిత్ శర్మ, భారత్ కెప్టెన్

భారత జట్టుకు రూ. 20 కోట్ల 42 లక్షల ప్రైజ్‌మనీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తొమ్మిదో టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి ఒక కోటీ 12 లక్షల 50 వేల డాలర్ల (రూ. 93 కోట్ల 78 లక్షలు) ప్రైజ్‌మనీని కేటాయించింది. విజేతగా నిలిచిన భారత జట్టుకు 24 లక్షల 50 వేల డాలర్లు (రూ. 20 కోట్ల 42 లక్షలు) లభించాయి. రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా జట్టుకు 12 లక్షల 80 వేల డాలర్లు (రూ. 10 కోట్ల 67 లక్షలు) దక్కాయి. సెమీఫైనల్లో ఓడిన ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్ ఖాతాలో 7,87,000 డాలర్ల చొప్పున (రూ. 6 కోట్ల 56 లక్షల చొప్పున) చేరాయి. 'సూపర్–8' నుంచి సెమీఫైనల్ చేరుకోలేకపోయిన నాలుగు జట్లకు 3,82,500 డాలర్ల చొప్పున (రూ. 3 కోట్ల 18 లక్షల చొప్పున) లభించాయి. 9 నుంచి 12 స్థానాల్లోపు నిలిచిన నాలుగు జట్లకు 2,47,500 డాలర్ల చొప్పున (రూ. 2 కోట్ల 6 లక్షల చొప్పున) దక్కాయి. 13 నుంచి 20వ స్థానాల్లోపు నిలిచిన ఎనిమిది జట్లకు 2,25,000 డాలర్ల చొప్పున (రూ. 1 కోటీ 87 లక్షల చొప్పున) అందజేశారు. సెమీఫైనల్స్, ఫైనల్ మినహా సాధించిన ఒక్కో విజయానికి ఆయా జట్లకు 31,154 డాలర్ల చొప్పున (రూ. 25 లక్షల 97 వేలు) లభించాయి. 2022 టి20 ప్రపంచకప్‌ను 56 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీతో నిర్వహించగా, విజేతగా నిలిచిన ఇంగ్లండ్ జట్టుకు 16 లక్షల డాలర్లు లభించాయి.

కసితీరా కప్ కొట్టారు

టి20 ప్రపంచకప్ విజేత భారత్

- రసవత్తర ఫైనల్లో అద్భుత విజయం
- 7 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా
- కోహ్లి అర్ధ సెంచరీ
- గెలిపించిన పాండ్యా, బుమ్రా
- 17 ఏళ్ల తర్వాత మళ్లీ టి20ల్లో విశ్వ విజేత



స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) మహరాజ్ 9; కోహ్లి (సి) రబడ (బి) జాన్సెన్ 76; పంత్ (సి) డికాక్ (బి) మహరాజ్ 0; సూర్యకుమార్ (సి) క్లాసెన్ (బి) రబడ 3; అక్షర్ పటేల్ (రనౌట్) 47; శివమ్ దూబే (సి) మిల్లర్ (బి) నోర్జే 27; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 5; జడేజా (సి) మహరాజ్ (బి) నోర్జే 2; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 176. వికెట్ల పతనం: 1-23, 2-23, 3-34, 4-106, 5-163, 6-174, 7-176. బౌలింగ్: జాన్సెన్ 4-0-49-1, మహరాజ్ 3-0-23-2, రబడ 4-0-36-1, మార్క్‌రమ్ 2-0-16-0, నోర్జే 4-0-26-2, షమ్సీ 3-0-26-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెన్‌డ్రిక్స్ (బి) బుమ్రా 4; డికాక్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 39; మార్క్‌రమ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 4; స్టబ్స్ (బి) అక్షర్ 31; క్లాసెన్ (సి) పంత్ (బి) పాండ్యా 52; మిల్లర్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 21; జాన్సెన్ (బి) బుమ్రా 2; కేశవ్ మహరాజ్ (నాటౌట్) 2; రబడ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 4; నోర్జే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 169. వికెట్ల పతనం: 1-7, 2-12, 3-70, 4-106, 5-151, 6-156, 7-161, 8-168. బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-20-2, బుమ్రా 4-0-18-2, అక్షర్ 4-0-49-1, కుల్దీప్ 4-0-45-0, పాండ్యా 3-0-20-3, జడేజా 1-0-12-0.

ఎన్నాళ్లయింది భారత క్రికెటర్లలో ఈ ఆనందాన్ని చూసి... ఎన్నేళ్లయింది భారత క్రికెట్ అభిమానులు ఇలాంటి గెలుపు సంబరాలు చేసుకొని... అందినట్లే అంది చేజారిపోతున్న ఐసీసీ ట్రోఫీ విజయాలు... ఆఖరి మెట్టుపై తడబడిన ప్రపంచ కప్ సమరాలు... అన్నీ దాటి ఇప్పుడు ఆహా అనిపించే ప్రదర్శనతో భారత జట్టు సగర్వంగా నిలిచింది. ఏడు నెలల క్రితం రాల్చిన కన్నీటి చుక్కల స్థానే ఇప్పుడు ఆనంద బాష్పాలు... నియంత్రించలేని భావోద్వేగాలు... ఎన్నోసార్లు చేరువగా వచ్చిన ట్రోఫీని దూరమైన బాధను పూర్తిగా మరిచేలా ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌గా చేతిలో వాలిన కప్... సొంతగడ్డపై వన్డే వరల్డ్‌కప్ చేజారిన తర్వాత ఈ సారైనా టి20 ప్రపంచకప్ ఒడిసి పట్టుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన టీమిండియా అజేయంగా అద్భుతాన్ని చేసి చూపించింది. రెండోసారి విశ్వ విజేతగా త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. 2007లో తొలి టైటిల్ నెగ్గిన తర్వాత ఆరు ప్రయత్నాల్లో విఫలమైన టీమిండియా ఇప్పుడు మళ్లీ ట్రోఫీని అందుకుంది. అప్పుడెప్పుడో కపిల్ వన్డే కప్ (1983) తెచ్చినపుడు మనలో చాలామందికి తెలీదు. అదొక వార్తగానే తెలుసుకున్నాం. కానీ ధోని తొలి టి20 ప్రపంచకప్‌ను టీవీల్లో చూశాం. తెగ సంబరపడ్డాం. సొంతగడ్డపై మళ్లీ అదే అదే ధోని (2011) వన్డే విశ్వ విజేతను చేస్తే పెద్ద పండగ చేసుకున్నాం. మళ్లీ... మళ్లీ మళ్లీ ఎంత ప్రయత్నించినా సెమీస్ లేదంటే ఫైనల్స్‌తోనే సరిపెట్టుకున్నాం. కానీ ఇప్పుడు 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత ధోని బృందం సాధించిన తొలి టి20 ప్రపంచకప్ జట్టులోని సభ్యుడు రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా కరీబియన్ గడ్డపై సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. రెండోసారి టి20 ప్రపంచకప్‌ను అందుకుంది. రోహిత్ బృందం జగజ్జేతగా అవతరించడంతో యావత్ భారతం సంబరాల్లో మునిగిపోయింది.

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): భారత జట్టు టి20 వరల్డ్ కప్‌ను రెండోసారి సొంతం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో భారత్ 7 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (59 బంతుల్లో 76; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... అక్షర్ పటేల్ (31 బంతుల్లో 47; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులే చేయగలిగింది. హెన్రిచ్ క్లాసెన్ (27 బంతుల్లో 52; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా... డికాక్ (31 బంతుల్లో 39; 4 ఫోర్లు, 1 సిక్స్), స్టబ్స్ (21 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. హార్దిక్ పాండ్యా (3/20) మూడు కీలక వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా... బుమ్రా, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించగా... బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం దక్కింది. తదుపరి టి20 ప్రపంచకప్‌కు 2026లో భారత్–శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తాయి.

కీలక భాగస్వామ్యాలు...

టోర్నీలో వరుసగా విఫలమైన కోహ్లి తుది పోరులో మాత్రం తన స్థాయి ఆటను ప్రదర్శించాడు. జాన్సెన్ వేసిన తొలి ఓవర్‌ను కోహ్లి జోరుగా మొదలుపెట్టాడు. అతను 3 ఫోర్లు బాదడంతో మొత్తం 15 పరుగులు వచ్చాయి. అయితే రెండో ఓవర్లో అనూహ్యంగా దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. కేశవ్ మహరాజ్ వేసిన ఈ ఓవర్లో తొలి రెండు బంతులను ఫోర్లుగా మలచినా... నాలుగో బంతికి రోహిత్ శర్మ (9) వెనుదిరిగాడు. చివరి బంతికి రిషభ్ పంత్ (0) కూడా అవుట్ కాగా, సూర్యకుమార్ (3) కూడా విఫలం కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. అయితే ఐదో స్థానంలో వచ్చిన అక్షర్ చక్కటి బ్యాటింగ్‌తో నిలిచాడు. మూడు కీలక వికెట్లు కోల్పోవడంతో కోహ్లి మరో ఎండ్‌లో నెమ్మదించాల్సి వచ్చింది. పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులు చేసింది. నలుగురు వేర్వేరు బౌలర్లు మార్క్‌రమ్, మహరాజ్, షమ్సీ, రబాడ ఓవర్లలో ఒక్కో సిక్సర్ కొట్టిన అక్షర్ పటేల్ ధాటిగా ఆడి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. 13.1 ఓవర్లలో స్కోరు 100 పరుగులకు చేరింది. అయితే అదే ఓవర్లో అక్షర్ రనౌట్‌గా వెనుదిరిగాడు. కోహ్లి, అక్షర్ నాలుగో వికెట్‌కు 54 బంతుల్లో 72 పరుగులు జోడించారు. ఆ తర్వాత కోహ్లి, శివమ్ దూబే (16 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) మధ్య 57 పరుగుల భాగస్వామ్యం (33 బంతుల్లో) స్కోరు వేగాన్ని తగ్గకుండా చేసింది. కోహ్లి 48 బంతుల్లో తన అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. 17 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 134/4. చివరి 3 ఓవర్లలో భారత్ 42 పరుగులు (వరుసగా 16, 17, 9) పరుగులు రాబట్టింది. తొలి 13 బంతుల్లో 4 ఫోర్లతో 21 పరుగులు చేసి కోహ్లి తర్వాతి 35 బంతుల్లో ఒక్క బౌండరీ కూడా లేకుండా 29 పరుగులే చేశాడు. అయితే తన ఆఖరి 11 బంతుల్లో 26 పరుగులు సాధించి మెరుగైన స్ట్రయిక్ రేట్‌తో ముగించాడు. చివరి 8 బంతుల్లో భారత్ 3 వికెట్లు కోల్పోయింది.

క్లాసెన్ మెరిసినా...

ఛేదనలో దక్షిణాఫ్రికా 12 పరుగులకే హెన్‌డ్రిక్స్ (4), మార్క్‌రమ్ (4) వికెట్లు కోల్పోయింది. అయితే డికాక్, స్టబ్స్ ధాటిగా ఆడుతూ స్కోరును నడిపించారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 38 బంతుల్లోనే 58 పరుగులు జోడించారు. 10 ఓవర్లలో స్కోరు 81 పరుగులకు చేరింది. ఒకవైపు డికాక్ చక్కటి బ్యాటింగ్‌తో నిలబడగా... మరోవైపు క్లాసెన్ మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. తర్వాతి 6 ఓవర్లలో దక్షిణాఫ్రికా 51 పరుగులు చేసింది. ఇందులో క్లాసెన్ ఒక్కడే 44 పరుగులు సాధించాడు. మధ్యలో డికాక్ వెనుదిరిగినా క్లాసెన్ తగ్గలేదు. ముఖ్యంగా అర్షద్ వేసిన 15వ ఓవర్లో క్లాసెన్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదడంతో 24 పరుగులు వచ్చాయి. ఈ దశలో భారత్ ఓటమి ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.



నిరాశలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు



టి20 ప్రపంచకప్ మెడల్స్‌తో కోహ్లి, రోహిత్

ఆటగాడిగా... కెప్టెన్‌గా...

ఐపీఎల్‌లో నాయకుడిగా ఐదు సార్లు ముంబై ఇండియన్స్‌ను గెలిపించిన ఘనత ఉన్నా అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు నాయకత్వం అంత సులువు కాదని రోహిత్‌పై చాలా సందర్భాల్లో విమర్శలు వచ్చాయి. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే వరల్డ్ కప్ ఫైనల్, టి20 వరల్డ్ కప్ సెమీఫైనల్‌లలో ఓడిన తర్వాత అతని కెప్టెన్సీపై సందేహాలు కూడా వచ్చాయి. కానీ బీసీసీఐ మరోసారి రోహిత్‌నే నమ్మింది. వరల్డ్ కప్‌లో జట్టును గెలిపించగలిగిన సామర్థ్యం ఉందంటూ అప్పజెప్పింది. ఈ అవకాశాన్ని అతను సమర్థంగా వాడుకున్నాడు. 2007లో తొలి టి20 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన రోహిత్ 17 ఏళ్ల తర్వాత సారథిగా మరో వరల్డ్ కప్ గెలిపించాడు. 2007 నుంచి 2024 వరకు వరుసగా 9 వరల్డ్ కప్‌లలోనూ ఆడిన రోహిత్ రెండు సార్లు విజేతగా నిలిచాడు. అధికారికంగా ప్రకటించకపోయినా రోహిత్‌కు కూడా ఇదే ఆఖరి అంతర్జాతీయ టి20 మ్యాచ్ కావచ్చు. మరో వైపు 2011 వన్డే వరల్డ్ కప్ గెలిచిన టీమ్‌లో ఉన్న కోహ్లి టి20 వరల్డ్ కప్ కోసం ఎంతో కాలంగా ఎదురు చూశాడు. అద్భుత ప్రదర్శనలతో రెండు సార్లు ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచినా... ట్రోఫీ మాత్రం దక్కలేదు. ఇప్పుడు ఈ గెలుపుతో ఆ ఆనందం దక్కింది. పైగా మూడు పరిమిత ఓవర్ల ఐసీసీ ట్రోఫీలు గెలిచినవాడిగా కెరీర్‌ను సంపూర్ణం చేసుకున్న అతను అంతర్జాతీయ టి20లకు రిటైర్మెంట్ పలికాడు. వీరిద్దరు మినహా 15 మంది సభ్యుల జట్టులో మిగతా 13 మందికి ఇదే తొలి వరల్డ్ కప్ కావడం విశేషం. హైదరాబాద్ పేసర్ సిరాజ్ కూడా అరుదైన జాబితాలో భాగమయ్యాడు. గతంలో అజహర్ సహా హైదరాబాద్ నుంచి భారత్‌కు వరల్డ్ కప్ ఆడినవారెవరూ విజేత జట్టులో లేరు. ఇప్పుడు సిరాజ్ ఆ అదృష్టాన్ని దక్కించుకున్నాడు.

కల నిజమాయెగా...

ఫైనల్లో తీవ్ర ఒత్తిడి మధ్య బౌండరీ సూర్యకుమార్ పట్టిన క్యాచ్‌కు వెలకట్టగలమా? అతడిని ఏ అవార్డుతో సన్మానించినా తక్కువే? బుమ్రా తన చివరి 2 ఓవర్లలో చేసిన అద్భుత బౌలింగ్‌కు సలామ్ చేయకుండా ఉండగలమా? టోర్నీలో కేవలం 4.17 ఎకానమీతో 15 వికెట్లు తీసిన బుమ్రా తన స్థాయి ఏమిటో క్రికెట్ ప్రపంచానికి చూపించాడు. క్లాసెన్‌ను అవుట్ చేసి ఆటను భారత్ వైపు తిప్పిన హార్దిక్ పాండ్యా మ్యాచ్ తర్వాత కన్నీళ్లపర్యంతం కావడం మరచిపోగలమా? ఐపీఎల్ సమయంలో ఎంతో వేదన అనుభవించిన తర్వాత భారత్ తరఫున తన విలువేంటో చూపించిన పాండ్యాను రోహిత్ ముద్దాడిన దృశ్యం ఎప్పటికీ హైలైట్స్‌గా ఉండిపోదా! బ్యాటింగ్‌లోనూ తన సత్తా ఏమిటో చూపించిన గుజరాతీ 'బాపు' అక్షర్ పటేల్ ఇన్నింగ్స్ విలువ అమూల్యం కాదా...! చావును దగ్గరగా చూసి ఇక ఆడలేనేమో అనుకున్న క్షణం నుంచి కప్‌ను ఎత్తుకోవడం వరకు రిషభ్ పంత్ సాగిన ప్రస్థానం అసాధారణం కాదా...! అనుభవం లేకపోయినా అర్ష్‌దీప్ పదునైన బంతులతో గెలిపించి చూపించిన భాంగ్రాకు బల్లే బల్లే అనకుండా ఉండగలమా? కుల్దీప్, శివమ్ దూబే కీలక దశలో జట్టు విజయాల్లో ఇరుసుగా నిలిచినవారే... ఇక కోహ్లి గురించి చెప్పడం అంటే కొత్త పుస్తకం రాయడమే. ఫైనల్‌కు ముందు మొత్తం 75 పరుగులు మాత్రమే చేసిన అతను అసలు పోరు కోసం తన ఆటను దాచి ఉంచాడు. 76 పరుగుల ఇన్నింగ్స్‌తో భారీ స్కోరుకు బాటలు వేసి విజయగర్వంతో అంతర్జాతీయ టి20 కెరీర్‌ను ముగించాడు. బ్యాటింగ్‌లో రోహిత్ దూకుడు మంత్రం భారత్ విజయాలకు పునాది వేసింది. తనదైన శైలిలో నాయకుడిగా జట్టును నడిపించిన అతను భారత క్రికెట్‌లో తన కంటూ ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకున్నాడు. కపిల్, ధోనిల తర్వాత వరల్డ్ కప్ గెలిపించిన సారథిగా శిఖరాన నిలిచాడు.

కొన్నాళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ ఓటమి పాలైంది... అందరిలోనూ వేదన, తీవ్రమైన బాధ... గెలుపు కోసం ఇంకా ఏం చేయాలనే నైరాశ్యం... కెప్టెన్ రోహిత్ సహా ఇతర సభ్యులందరికీ కూడా ఆ బాధనుంచి కోలుకునేందుకు చాలా సమయం పట్టింది. కాలం గిర్రున తిరిగింది... చూస్తుండగానే టి20 వరల్డ్ కప్ వచ్చేసింది. ఒక ఫార్మాట్‌లో చేజారినా... మరో ఫార్మాట్‌లోనైనా తమ స్థాయిని ప్రదర్శించే విజేతగా నిలిచే అవకాశం వచ్చింది. ఎలాగైనా ఈ సారి పట్టు వదలరాదని గట్టిగా నిశ్చయించుకొని మరో సారి తమ వేటను మొదలు పెట్టింది. లీగ్ దశలో వరుసగా మూడు విజయాలు, ఆ తర్వాత సూపర్–8లో కూడా మూడు విజయాలు. ఆస్ట్రేలియాలాంటి గట్టి ప్రత్యర్థిని కుప్పకూల్చిన ఉత్సాహంతో సెమీస్‌లో ఇంగ్లండ్‌పై కూడా ఘన విజయం. తుది పోరుకు ముందు అజేయంగా నిలిచింది. వన్డే వరల్డ్ కప్‌లో కూడా ఇలాగే వరుసగా పది విజయాల తర్వాత అజేయంగా ఫైనల్ చేరిన టీమ్ నిరాశచెందాల్సి వచ్చింది. అద్భుతంగా సాగిపోతున్న ఆటలో ఎక్కడైనా ఒక బ్రేక్ వస్తే... అదీ ఫైనల్లో అయితే ఎంతటి బాధ ఉంటుందో అందరికీ తెలుసు. ఈ సారీ అలాంటిదే జరిగితే అనే ఆందోళన అందరిలోనూ ఉంది. కానీ భారత్ అలాంటి స్థితిని అధిగమించింది...ఆత్మవిశ్వాసంతో అవరోధాలను అధిగమించింది. కెప్టెన్‌గా 2007 వన్డే వరల్డ్‌కప్‌నాటి బాధను కోచ్‌గా రూపంలో మర్చిపోయే ప్రయత్నం చేసిన దిగ్గజం రాహుల్ ద్రవిడ్ ఎట్టకేలకు తన కల నెరవేర్చుకున్నాడు. గెలుపు ఖాయమైన క్షణాన గాల్లో ఎగురుతూ అతను విసిరిన పంచ్ ఈ విజయం విలువేమిటో చూపించింది.

–సాక్షి క్రీడా విభాగం



టీమిండియా హెడ్ కోచ్ ద్రవిడ్ ఆనందం



మిల్లర్ క్యాచ్‌ను అందుకుంటున్న సూర్యకుమార్



టి20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో టి20 ప్రపంచకప్ ఆవిష్కరణ దృశ్యం

భారత్ 603/6

మహిళల టెస్టు క్రికెట్‌లోనే అత్యధిక స్కోరు సాధించిన టీమిండియా



రిచా, హర్మన్‌ప్రీత్

చెన్నై: తొమ్మిది దశాబ్దాల మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో భారత జట్టు అద్భుతం చేసింది. దక్షిణాఫ్రికా జట్టుతో జరుగుతున్న తొలి టెస్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమిండియా అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 525/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత జట్టు 115.1 ఓవర్లలో 6 వికెట్లకు 603 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ క్రమంలో మహిళల టెస్టుల్లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ఆస్ట్రేలియా (ఈ ఏడాది పెర్త్‌లో దక్షిణాఫ్రికాపై 575/9 డిక్లేర్డ్) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును భారత జట్టు అధిగమించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్ (115 బంతుల్లో 69; 4 ఫోర్లు), రిచా ఘోష్ (90 బంతుల్లో 86; 16 ఫోర్లు) తమ అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 143 పరుగులు జోడించారు. 116వ ఓవర్లో రిచా ఘోష్ అవుటైన వెంటనే భారత జట్టు తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 236 పరుగులు సాధించింది. సునె లుస్ (65; 6 ఫోర్లు, 1 సిక్స్), మరిజన్ కాప్ (69 బ్యాటింగ్; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. మరిజన్‌కు తోడుగా నదినె డి క్లెర్క్ (27 బ్యాటింగ్) క్రీజులో ఉంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా మరో 367 పరుగుల దూరంలో ఉంది. స్నేహ్ రాణా మూడు వికెట్లు, దీప్తి శర్మ ఒక వికెట్ తీశారు.

సాక్షి
15
ఆదివారం 30-6-2024

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటువంటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



గౌడ/M.Tech/IIT/Central Govt/ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వేస్ /90,000/-PM / 5'10"/29 సం॥లు/కుల పట్టింపు లేదు/అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8328591692 [H-796309]

క్రిస్టియన్ మాదిగ/కట్నప్రసక్తి లేదు/ M.Tech / Govt. Asst. ఇంజనీర్ /ఎలక్ట్రికల్ Dept / 1 Lakh. PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15372]

గౌడ/M.Tech, IIT/C.Govt. సైంటిస్ట్/ ఇస్రో/ 1,20,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15372]

వడ్డెర /కట్నప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/ఆంధ్రా బ్యాంక్/ 80,000/-PM/5'10"/ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15372]

రిచ్ ఫ్యామిలీ వార్లైన/టీ ఫ్యామిలీ కాకపోయిన మంచి మనస్సు & క్యారెక్టర్ వధువు కావలెను. ఇక్కడ్/1995/5'9"/B.Tech/30 Lakhs. PM/70 కోట్ల ఆస్తి. వెరి వెరి అర్జెంట్. వాట్సాప్: 8187058655, 6303293337 [HA-15372]

యాదవ /కట్నప్రసక్తి లేదు/B.Tech (EEE)/ Govt.A.E.E/ ట్రాన్స్‌కో/ 85,000/-PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల ఏకైక కుమారుడు/ వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-15372]

2వ: కమ్మ MBA, ఆస్తి, IT జాబ్ గల వరునికి చదువు ఆస్తి కుల పట్టింపు లేదు. 32 సం॥ల లోపు వధువు కావలెను. డైరెక్ట్. Ph: 8978609410 [HA-14376]

36 సం.ల బిజినెస్ చేస్తున్న వరుడుకి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయినా సంప్రదించండి. ఔరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 6301943220, 9866724586 [HA-97790]

వైశ్య, (డైవర్సీ) వయస్సు 56, పిల్లలులేరు, ఒంటరి, నెలకు 30,000/– సంపాదన కలిగిన వరునికి తగిన వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. నో బ్రోకర్స్. డైరెక్ట్ ఫోన్ : 7386213167 [G-2441]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి, టీచర్ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/ విడో OK. కుల, కట్నప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801637]

వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్, పద్మశాలీ, 32Yr./ 5'5"/Qly: B.Sc., Comp. Diploma DOA, Occup : బిజినెస్, 2వ పెళ్ళి, వెల్ సెటిల్డ్. సెల్-94413 86713, 99481 19207. [M-1185251]

కోమట్ల అమ్మాయి కావలెను. ఆర్యవైశ్య అబ్బాయి 35 M.Sc., వ్యవసాయం 34 వేలు ఆస్తి 90 లక్షలు, నల్లగొండ వీరయ్య, MIG-9 HB మునుగోడ్ రోడ్, సంప్ర॥ 9121325068 [Y-798338]

SC-Mala/Hindu/ 2nd Marriage/40y, PG/5'10"/Own Vissa Consultency/ 1,60,000/-PM Wants Good Bride (Direct). Ph: 8187861989 [H-796091]

★★

REDDY, 34 y, MS (Civil USA) Civil Engineer in USA, 5'11", Fair, 5C, Looking for Graduate Bride Pls Cont: 9493242896/ 5 [G-795924]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు/ జాబ్/ వ్యాపారం/ ఫ్లాట్స్/5LPM/వెల్ సెటిల్డ్/5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. ముఖ్యముగా కలిసొచ్చే త్వరగా కుదుర్చబడును. 7207636129 [H-778826]

కుల పట్టింపు లేదు/44yr/B.Ed/Govt జాబ్/ 80K (PM) విడో, వెల్ సెటిల్డ్, సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం అయినా OK) అర్జెంట్. సంప్ర : 7286031653 [H-778878]

రెండవ పెళ్లి/37yrs/డైవర్సీ/Govt.ఎంప్లాయ్/ 3,25,000/-(pm)/వెల్ సెటిల్డ్/కుల పట్టింపు లేని అందమైన వధువుకి తగిన వరుడు కావలెను (Any profesion Ok) సంప్ర : 9032445378 [H-778878]

కమ్మ/50y/విడో/సెంట్రల్ Govt. Job/ రైస్‌మిల్స్/Catton Mills/షెటర్స్/18 Acres Land/8Lac Income గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 8374415657 [H-796309]

రెడ్డి/60/విడో/5'5" / V.Fair / Govt.Rtd పెన్షనర్ /సొంత ఇల్లు/బిజినెస్/28 ఎకరాల వంద్ల తోటలు /3L/PM పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7287079096 [H-796309]

రెడ్డి/విడో/48y/5'3"/Fair/Own Baby Care Centre/సొంత ఇల్లు గల సాంప్రదాయకమైన వధువుకి మధ్య తరగతి వరుడు కావలెను. Ph: 8367233524 [H-796309]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Rich Business *B.Tech / MBA *1995 /6' /150Cr * 1997/5'11"/100Cr * 1993 / 5'7" / 50Cr *1995 / 5'9"/500Cr. * Cont:K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech /Business * 1997/ 6'/ 150Cr *1995/6'/100Cr *1994/ 5'11"/ 250 Cr *1990/6'/1000Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/(Catholic) B.Tech / MS / V. Good Business Hyd/1996/6'/150Cr * 1991/6'/ 55Cr *USA Citizen/ 1986/ 5'7"/ 150K/ * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/USA-Citizen/Doctors * MD/ 1992/6' *1989/5'9" *1986/5'10" * 1988/ 6' *1998/5'8" * Cont : K.C. Reddy-Hyd.Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG/DM *1995/ 5'10"/ 400Cr *1994/5'10"/70Cr *1993/5'10"/ 50 Cr * 1996/6'/50Cr *1995/5'11"/20Cr. * Cont: K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech / MS/H1 / USA *1996/ 5'11"/ 150K/ 50Cr *1998/6'/ 110K/80Cr *1994/ 5'9"/200Cr *1995/5'9"/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1995/230K/ 70Cr *1997/6'/400Cr *1988/5'10"/100Cr *1990/5'7"/50Cr *1991/5'11"/150K/200Cr. *Cont : K.C. Reddy - Hyd. Ph: 9849321309

Reddy/Divorcee/IIT/B.Tech/MS/H1/USA/ 1995/ 5'9"/170K / 25Cr *1994/ 5'10"/ 300Cr *1981/5'8"/ 500Cr *1979 / 5'8"/ 300Cr. * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/B.Tech IIT/1995/5'10"/300Cr* 1994/ 5'9"/ 1Cr/yr / 30Cr *1994/6'/30Cr/385K * 1994 / 5'11"/70L/yr/25Cr *1995/ 5'10"/25 L/yr.*Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech(NIT)/MBA (ISB)/ MBA (USA) 1993/6'/100Cr *BE(BITS) MS H1 USA *1991/5'10"/200K. * Cont. K.C. Reddy- Hyd-Ph: 9347807015/9849321309 [D-548]

వరుడు కావలెను

Reddy/USA Citizen *B.Sc/1989/5'4"/ *Doctors/1995/5'7"/*1997/5'6"/*1997/ 5'2" *2002/5'7" *1992/5'5" * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Rich Family *1995/ 5'5"/100Cr *1999/5'7"/100Cr *1993/ 5'7"/100Cr *1993/5'3"/1000Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBA /1997 /5'4"/ 150Cr * 1995/5'8"/100Cr *1995/5'5"/70Cr * 1994/ 5'3"/ 200Cr *1996/5'4"/50Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech /1994 /5'4"/20Cr *1994/ 5'5"/ 15Cr *2000/5'5"/100Cr *1991 / 5'7"/ 10Cr *1994/5'10"/60Cr. * Cont : K.C.Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1996/5'7"/50Cr * 1999/ 5'8"/15Cr *1998/5'5"/100Cr *1996/ 5'4"/ 30Cr *2002/5'6"/20Cr. * Cont : K.C.Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/MD/*1995/5'5"/100Cr *1994/ 5'6"/100Cr *1998/5'7"/50Cr *1990/ 5'10"/20Cr *1995/5'3"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA - Doctors *1997 / 5'6" * 1995/5'7" *1996/5'8"/40Cr *1987/5'4" *1991/5'1" *1985/5'4"/50Cr. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech / MS/H1 / USA *1999/ 5'2"/10Cr *1997/5'5"/30Cr *1996/5'3"/20Cr *1994/5'4"/10Cr *1999/5'6"/200Cr. * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/(Divorcee)MBBS/PG-Doctors *1991/ 5'2"/40Cr *1993/5'8"/40Cr *1992/ 5'3"/ 9Cr *1994/5'5"/100Cr. * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/B.Tech/1993/5'4"/10 Cr *1991 / 5'4"/15Cr *1988/ 5'6"/ 30Cr *1991 /5'4" /10Cr *1985 /5'5" /400Cr * Cont: K.C.Reddy-Hyd.Ph: 9849321309

SC మాల హిందూ/B.Tech/25y/ 5'4"/ సాఫ్ట్‌వేర్ కాంగ్నిజెంట్ (Hyd)/60K Per Month/ చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-796309]

ముదిరాజ్/B.Tech/Govt.Asst.ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/ 60,000/PM / 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15372]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, B Arch, 28, 5' 10", Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 6', Data Engineer, 200 K, 80 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), MBA (ISB), 30, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MSc, MS, 32, 6', Data Scientist, 140 K, Canada. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", PG Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", Software Developer, 11 L P/A, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, 29, 5' 11", Data Engineer, 13 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 40, 5' 8", Microsoft, 60 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 26, 5' 3", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt, MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", PG Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Degree, 33, 5' 7", Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

SC హిందూ మాదిగ/B.Tech/C.Govt. సైంటిస్ట్ / DRDL / 60,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15372]

రజక/B.Tech/C.Govt.Asst.మేనేజర్/ ఆంధ్రా బ్యాంక్ / 55000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15372]

వయసు : 36yrs/5'5" ఎత్తు/ గవర్నమెంట్ జాబ్/1.5 Lakhs. జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 8019954482 [HA-15372]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/ MBA *30/ 5'3"/B.Sc *27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-15372]

యాదవ /ఎర్ర శాఖ అప్పర్ మిడిల్, 37/ 5'4"/ M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగి లక్ష రూ॥ P/M అపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father సంప్ర : 9989597799 [H-778746]

కుల పట్టింపు లేదు/22y&24y& 25y&27y& 28y&30y&32&34y&35y&37&38&40y&41y&43y&44y&46y&48y&50y&52y&53y&55y&57y&58y& 59y/ "మా సేవ" (Since1998): PH/WA: 9291503949 [HA-15735]

రెడ్డి/2nd మ్యారేజ్/కుల, మత, ఆస్తి పట్టింపు లేదు/ఎత్తు5'4" Q: ఇంటర్, కలర్: తెలుపు/సొంత వ్యాపారము, అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము అయినా OK) Ph: 9063623252 [HA-15735]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/40yr/M.Sc Ph.D, M.Phil/Govt ప్రొఫెసర్ 3 లక్షలు PM సొంత ఇల్లు+కారు & 100 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్ర : 7396213324 [HA-15735]

2వ పెళ్లి/40Yrs, 3,00,000/-PM/కోట్ల ప్రాపర్టీ కలిగి, బాగా స్థిరపడిన అమ్మాయికి అందమైన వరుడు కావలెను. Kids ఉన్నా OK కుల ప్రసక్తి లేదు. ఇల్లరికం. Call: 9182213897 [HA-15735]

కాపు/35yr/ ఫెయిర్ / కులపట్టింపులేదు /Govt. ఎంప్లాయ్/50K (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ/2 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-778878]

కాపు/ విడో/ఒంటరి/56Y/Hyd lo Own Hostels Rents/సొంత ఫ్లాట్ షాప్ రూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-778878]

రెడ్డి/50 yrs/విడో/B.Ed/VRS/సొంత ఇల్లు/6 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. సంప్ర : 9705499686 [H-778878]

★

మున్నూరు కాపు/25/5'4"/B.టెక్, MS/ USA/Opt * 33/5'4"/ B.టెక్ MS / H1B/I-140/ మేనేజర్ / కాలిఫోర్నియా/250K అమ్మాయిలకు USAలో H1B మున్నూరు కాపు అబ్బాయిలు కావలెను. సం॥ "శుభమస్తు", DSNR, Hyd. S.రాములు గౌడ్- 8790690309 [H-796310]

వేదికలు



ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులము వారికి Govt/ సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్ / MBBS / PG/NRI/ Pvt / బిజినెస్/1వ/2వ/లేట్/AP/TS 15 సం॥ Exp: Ph: 9989140444 [H-32366]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt.ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15735]

ధ్రువ మ్యారేజెస్ అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూడబడును. Age: 18–70 సం॥లు. Ph: 7702955854 [HA-15721]

www.christianholymatrimony.com ద్వారా క్రైస్తవ వివాహ పరిచయవేదిక జూలై 17, (బుధవారం) ఉ. 10- సా. 4 వరకు సికింద్రాబాద్ YMCAలో, ప్రొఫైల్స్ వాట్సాప్ చేయండి. 7330957771 [HA-97698]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 14-07-2024న ఉ॥ 9 గం॥లకు 65వ ఆర్య వైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 20వ పునర్ వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలో జరుగును. మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కూడా కలదు. ✆ 99895 00130 [B-284]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-909]

Free Register హిందూ మాల/ మాదిగ & క్రిస్టియన్ వధూవరుల online స్వయంవరం July 14th bhavanimatrimony, Hyd. 9704656103/ 9533608887 [HA-878]

మాదిగ వివాహ పరిచయ వేదిక, ఆదివారం (16–6–24) 10AM-6PM * మంచిర్యాల ఫీ: 1 వెయ్యి Ph: 9347046175 నిర్వహణ : స్వప్న వివాహ వేదిక [H-800496]

2 లక్షల ఉద్యోగాలివ్వాలి

- రాజారాం యాదవ్ డిమాండ్
- ఓయూ విద్యార్థి నేత ఆమరణ దీక్షకు పలువురి మద్దతు



రాజారాం యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నాంపల్లి (హైదరాబాద్): యూత్ డిక్లరేషన్ ప్రకారం వెంటనే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నిరుద్యోగుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఓయూ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా బీసీ జనసభ, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి, సేవాలాల్ సేనా, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య, ఓయూ జేఏసీ నాయకులతో కలిసి అసెంబ్లీ ఎదుట తెలంగాణ అమరవీరుల స్తూపం దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం గాంధీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ ప్రాణానికి హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాదిలోనే జాబ్ కేలండర్, 2 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తామని మాట తప్పడాన్ని విమర్శించారు. గ్రూప్–2లో 2 వేలు, గ్రూప్–3లో 3 వేల వరకు పోస్టులు పెంచాలని, గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను పిలవాలన్నారు. గిరిజన రిజర్వేషన్ సాధన సమితి, సేవాలాల్ సేన అధ్యక్షుడు సంజీవ నాయక్ మాట్లాడుతూ సీతక్కకు మోతీలాల్‌ను ఓదార్చే సమయం లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య అధ్యక్షుడు కొంపల్లి రాజు, జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, రాష్ట్ర నాయకులు తొడంగి గోవర్ధన్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్ ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానాన్ని భ్రష్టు పట్టించిన బీజేపీ

మాజీ మంత్రి పుష్పలీల

సాక్షి, హైదరాబాద్: దేశ విద్యా విధానాన్ని బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని, సమగ్రంగా పరీక్షలు నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి పుష్పలీల విమర్శించారు. ఆమె శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. వైద్య విద్యార్థులకు న్యాయం జరగాలంటే నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం వచ్చాక అన్ని యూనివర్సిటీలకు నిధులు తగ్గాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ మృతికి పుష్పలీల సంతాపం వ్యక్తం చేశారు.

నాలుగడుగుల లోతుల్లోనే నీరు

ఉప్పల్‌వాయి గ్రామ చేదబావుల్లో జలసిరులు

సాక్షి, కామారెడ్డి : చుట్టు పక్కల గ్రామాల్లో బిందెడు నీళ్లకు గోస పడుతుంటే ఆ ఊళ్లో మాత్రం చేదబావుల్లో నీరు పుష్కలంగా ఊరుతోంది. నాలుగు అడుగుల లోతులో ఉన్న నీళ్లను తోడుకునేందుకు బొక్కెన వేసి రెండు చేతులతో నీటిని పైకి లాక్కుంటారు. కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలో ఇళ్లల్లో వందకు పైగా చేద బావులు ఉన్నాయి. తాతల కాలం నుంచి ఆ ఊరి జనం చేదబావులను వాడుతున్నారు. ఎక్కడ కరువొచ్చినా ఉప్పల్‌వాయిలో మాత్రం నీళ్లకు కరువు అన్న ముచ్చటే తెలియదని గ్రామస్తులు అంటున్నారు. ఇరవై ఏళ్ల నాడు ఒకసారి బావుల్లో నీరు కొంతమేర తగ్గినా, తర్వాతి కాలంలో ఏనాడూ ఊటలు తగ్గలేదని పేర్కొంటున్నారు. ఉప్పల్‌వాయి గ్రామంలో 438 ఇళ్లు ఉన్నాయి. గ్రామ జనాభా 2,478. గ్రామంలో 145 వరకు చేదబావులు ఉన్నాయి. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నా, చాలా మంది చేదబావుల నీటిని కూడా వాడుతున్నారు. కొందరు చేదబావుల్లో మోటార్లు ఏర్పాటు చేసుకోగా, మిగతావారు గిరక ద్వారా చేదుకుంటున్నారు. చాలా ఇళ్ల ముందు చేతబావి కనిపిస్తుంది. బయటకు వెళ్లి వచ్చినవారు బొక్కెనతో నీటిని చేదుకొని కాళ్లు, చేతులు కడుక్కుని ఇంట్లోకి అడుగుపెడుతుంటారు. గ్రామంలో పాత ఇళ్ల వద్ద చేదబావులు ఉన్నాయి. కొత్తగా బంగళాలు నిర్మించుకుంటున్న వారు మాత్రం బోర్లు వేయించుకుంటున్నారు.



ఉప్పల్‌వాయిలో ఇంటి ఆవరణలోని చేద బావులు



చేద బావిలో చేయి పెడితే అందేలా ఉన్న నీరు

బావులు ఎన్నడూ ఎండిపోలేదు

నాకు ఇప్పుడు డెబ్బై ఏళ్లపైనే ఉంటయి. నాకు బుద్ధి తెలిసిన నాటి నుంచి బావులు ఎండిపోయింది ఎన్నడూ ఎరుకలేదు. బిందెలతో ముంచుకున్నం. బొక్కెనలతో రెండు చేతులు వేస్తే చాలు నీళ్లు అందుతాయి. మా తాతల కాలం నుంచి ఊళ్లో నీళ్లకు కరు వు లేదు. బావుల్లో నీరు పుష్కలంగా ఉంటోంది.



-ఆల నారాయణ, ఉప్పల్‌వాయి

అవసరం ఉన్నప్పుడల్లా చేదుకుంటం...

మా ఇంట్లో రెండు కుటుంబాలున్నాయి. అవసరం ఉన్నప్పుడల్లా బావిలో నుంచి చేదుకుంటాం. రెండుసార్లు చేతులు వేస్తే చాలు బొక్కెన పైకి వచ్చేస్తుంది. నాకు పెళ్లయి ఇక్కడికి వచ్చిన నాటి నుంచి బావుల్లో నీళ్లు ఎండిపోయింది ఎన్నడూ లేదు. నీళ్ల ఇబ్బంది ఎదురు కాలేదు.



- సుతారి మహేశ్వరి, ఉప్పల్‌వాయి

మా తాత తవ్వించిన బావి...

మా ఇంటి దగ్గర మా తాతలు తవ్వించిన బావి ఎన్నడూ ఎండిపోలేదు. ఇప్పుడు మేం కూడా బావి నీటిని వాడుకుంటున్నం. బావికి మోటార్ బిగించి పైన ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చాం. ట్యాంకు ద్వారా నీటిని వాడుకుంటున్నాం.



-శంకర్‌గౌడ్, ఉప్పల్‌వాయి

మీరు సస్పెండ్ చేస్తారా.. నేను చేయాలా్నా?

▶ మొదటి పేజీ తరువాయి

వీడియో కాన్ఫరెన్స్‌లో భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రెవెన్యూ అధికారుల వైఖరిలో మార్పు రావాలని, 10 రోజుల్లో సరైన పద్ధతిలో ధరణి దరఖాస్తులు పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించినట్టు సమాచారం. అదేవిధంగా దరఖాస్తు పరిష్కారానికి, మాన్యువల్ రికార్డుకు లింకు పెట్టవద్దని, వీలున్నంత మేర ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు డిస్పోజ్ చేయాలని, మాన్యువల్ రికార్డు లేదంటూ ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టిన వారిని సస్పెండ్ చేయాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. జిల్లా కలెక్టర్లతో రెండు విడతల్లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌ల్లో ఎన్ఆర్ఐ పాసు పుస్తకాలు, కోర్టు కేసులు, డేటా కరెక్షన్లు, నిషేధిత జాబితాలోని భూములు, కొత్త పాసు పుస్తకాల జారీ, నాలా, ఖాతాల విలీనం తదితర అంశాలపై చర్చించారు. ఇందుకు సంబంధించిన పరిష్కార మార్గాలపై మిత్తల్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

గత 15 రోజుల్లో...

ధరణి దరఖాస్తుల పురోగతిపై ఈనెల 14న నవీన్ మిత్తల్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మళ్లీ వీడియో కాన్ఫరెన్స్ నాటికి గత 15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25వేల దరఖాస్తులు పరిష్కారయ్యాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 3,779 దరఖాస్తులు, నల్లగొండలో 2,120, సిద్దిపేటలో 1,880, నాగర్‌కర్నూల్‌లో 1,800 దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. అయితే, అత్యల్పంగా భూపాలపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో 100 దరఖాస్తులు కూడా క్లియర్ కాలేదు. భూపాలపల్లిలో 65, సిరిసిల్లలో 97, కొత్తగూడెం జిల్లాలో 144 దరఖాస్తులు మాత్రమే గత 15 రోజుల వ్యవధిలో పరిష్కారమైనట్టు గణాంకాలు చెబుతున్నాయి.

1.50 లక్షలు తహసీల్దార్ల వద్దనే..

15 రోజుల క్రితం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ తర్వాత ధరణి దరఖాస్తుల పరిష్కార పురోగతి ప్రక్రియను పరిశీలిస్తే మొత్తం 2,59,404 దరఖాస్తులకుగాను 24,778 దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. మిగిలిన 2.34 లక్షల దరఖాస్తుల్లో మెజార్టీ దరఖాస్తులు తహసీల్దార్ల వద్దనే పెండింగ్‌లో ఉండటం గమనార్హం. మొత్తం దరఖాస్తుల్లో సుమారు 60 శాతం అంటే 1.48 లక్షల దరఖాస్తులు క్షేత్రస్థాయిలోనే పెండింగ్‌లో ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇక, ఆర్డీవోల వద్ద మరో 20 శాతం అంటే 50 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతోనే మిత్తల్ కలెక్టర్ల సమావేశంలో తహసీల్దార్లు, ఆర్డీవోలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మొత్తంమీద అదనపు కలెక్టర్ల వద్ద 20వేల పైచిలుకు, కలెక్టర్ల స్థాయిలో 12 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ దరఖాస్తులు అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 36,463 ఉండగా, ఆ తర్వాత నల్లగొండలో 21,693 ఉన్నాయి. అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 1,410, భూపాలపల్లిలో 1,826 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

పెండింగ్ దరఖాస్తులు ఏ స్థాయిలో ఎన్ని?	
తహసీల్దార్ల వద్ద:	1,48,182
ఆర్డీవోల వద్ద:	53,478
అదనపు కలెక్టర్ల వద్ద:	20,461
కలెక్టర్ల వద్ద:	12,505
మొత్తం పెండింగ్ దరఖాస్తులు:	2,34,626

తిట్టుకుని.. కొట్టుకుని

వైస్ చైర్మన్‌పై చేయి చేసుకున్న చైర్మన్

- ఎమ్మెల్యే ఎదుటే రచ్చరచ్చ
- ఇల్లెందు మున్సిపల్ సమావేశంలో డిష్యుం డిష్యుం



కౌన్సిల్ సమావేశంలో ఘర్షణ పడుతున్న చైర్మన్, వైస్ చైర్మన్

ఇల్లెందు: ఒకరు మున్సిపల్ చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్.. సాక్షాత్తు కౌన్సిల్ సమావేశంలో బాహాబాహీకి దిగారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం దూషణలు, పరస్పర దాడులకు దారితీసింది. మూడు నెలల విరామం తర్వాత శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించగా.. పట్టణంలో రోడ్లపై వెలసిన దుకాణాలు, తోపుడు బండ్లను తొలగించేందుకు రూ.2 లక్షలు ఖర్చవుతుందంటూ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ఆక్రమణలు తొలగిస్తున్నా ఎవరూ అడ్డు చెప్పడం లేదు కదా.. దీనికి కొత్తగా ఫీజు రూపంలో రూ.2లక్షలు ఎందుకంటూ వైస్ చైర్మన్ జానీపాషాతో పాటు పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ఆ తర్వాత కూడా ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్ పరస్పరం అసభ్య పదజాలంతో వ్యక్తిగత దూషణలకు దిగారు. దీంతో కోపోద్రిక్తుడైన చైర్మన్ వెంకటేశ్వరరావు.. వైస్ చైర్మన్ జానీపాషాపైకి దూసుకొచ్చినట్టు కౌన్సిలర్లు, అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత మరోసారి ఘర్షణ జరగడంతో వైస్ చైర్మన్‌పై చైర్మన్ చేయి చేసుకున్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఎదురుగానే ఈ ఘర్షణ జరగడం గమనార్హం. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ వాసులకు సేవలందించాల్సిన పాలకవర్గ సభ్యులు ఇలా ఘర్షణ పడడం తగదని హితవు పలికారు. ఈ విషయంలో ఇద్దరిదీ తప్పేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ జానీపాషా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సమావేశంలో నిలదీస్తే ఇలా దాడులు చేయడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధికారులను ప్రశ్నిస్తుండగా చైర్మన్ జోక్యం చేసుకుని దాడికి దిగారని ఆరోపించారు. దీనిపై చైర్మన్ వెంకటేశ్వరరావు వివరణ కోరగా.. తనను పలుమార్లు వ్యక్తిగతంగా దూషించినా సహించానని స్పష్టం చేశారు.

బీటీపీఎస్‌లో పిడుగుపాటు?

- ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం
- రూ.కోట్లలో నష్టం
- యూనిట్–1, 2లో విద్యుదుత్పత్తి నిలిపివేత



బీటీపీఎస్‌లోని జీటీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎగిసిపడుతున్న మంటలు

మణుగూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం చిక్కుడుగుంట గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్టేజ్ –1 వద్ద ఉండే 'జీటీ' ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడటంతో మంటలు చెలరేగాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఎగిసిపడిన మంటలు సుమారు అర్ధగంటకు పైగా చెలరేగాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది, ప్లాంట్ కీలక అధికారులు ఉరుకులు, పరుగులు తీశారు. ఎట్టకేలకు రాత్రి 8.05 గంటలకు మంటలు అదుపులోకి వచ్చాయి. ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మెయిన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే ప్రదేశం వద్దే అగ్ని ప్రమాదం జరగడంతో.. అధికారులు వెంటనే 1, 2 యూనిట్లలో విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు సమాచారం. అయితే చిన్న సాంకేతిక లోపంతో యూనిట్–1ను అధికారులు ఉదయమే నిలిపివేశారు. ఇప్పుడు జరిగిన ప్రమాదం యూనిట్–1కు సంబంధించినదా? లేక యూనిట్–2లోదా? అనేది తేలాల్సి ఉంది. అగ్ని ప్రమాదంతో రూ.కోట్లలో నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ప్లాంట్ ఏరియాలో పిడుగుపాటు నివారణకు స్విచ్ యార్డ్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉండగా, దానికి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిడుగు పడిందని అధికారులు చెబుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సాంకేతిక లోపమా? లేక పిడుగుపాటా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సీఈ బిచ్చన్నను వివరణ కోరగా పిడుగుపాటా? అనేది ఇప్పుడే చెప్పలేమని, విచారణానంతరమే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. యూనిట్ –1లో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ధ్రువీకరించారు.

క్లుప్తంగా...

జూలై 4 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధక శాఖ పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని కమిషన్ కార్యదర్శి ఇ. నవీన్‌నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులు జూలై 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు. నిర్దేశించిన తేదీల్లో నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో పరిశీలన ప్రక్రియకు అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రత్యేక లైవ్

- టీ–శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఉద్యోగాల పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు టీ–శాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించేందుకు ఈనెల 30న మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంటకు టీ–శాట్‌లో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఉంటుందని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2024లో జాబ్ కేలెండర్‌లో భాగంగా భర్తీ చేసే 17,727 సీజీఎల్ పోస్టులకు నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాలు సాధించేలా అనుభవం కలిగిన బోధన సిబ్బంది సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఆదివారం జరిగే ప్రత్యేక లైవ్‌లో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 040 -23556037, 040- 23540726 టోల్ ఫ్రీ 1800 425 4039 ఫోన్ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. జూలై 1న ఈ కార్యక్రమాన్ని ఉదయం 10 నుండి 11 గంటల వరకు ప్రసారం చేయనున్నామని తెలిపారు. జనరల్ ఇంటిలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టులపై అవగాహన ప్రసారాలుంటాయని సీఈవో వేణుగోపాల్‌రెడ్డి వివరించారు.

ఇంటర్ ప్రవేశాల గడువు జూలై 31

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ కోర్సు మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు జూలై 31 గడువుగా ఖరారు చేసినట్లు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. బోర్డు గుర్తింపున్న కాలేజీల్లోనే ప్రవేశాలు పొందాలని అధికారులు సూచించారు. గడువు తేదీ తర్వాత ప్రవేశం పొందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

ఎంసీఈఎంఈలో అత్యుత్తమ శిక్షణ

- ఎంఎస్ఈఎంఈ స్నాతకోత్సవంలో లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షాయి

సాక్షి, హైదరాబాద్: ఎంసీఈఎంఈ (మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్) లో అత్యుత్తమ శిక్షణా ప్రమాణాలున్నాయని, సమకాలీన యుద్ధంలో రాణించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షాయి తెలిపారు. శనివారం సికింద్రాబాద్‌లోని ఎంసీఈఎంఈలో 105వ స్నాతకోత్సవం నిర్వహించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ సీఈఓ. రమేశ్ కంచర్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఈఎస్–41 బ్యాచ్‌కి చెందిన 22 మంది అధికారులు పాల్గొన్నారు. వీరిలో రాయల్ భూటాన్ ఆర్మీకి చెందిన ముగ్గురు అధికారులు, శ్రీలంక ఆర్మీకి చెందిన ఇద్దరు అధికారులు ప్రతిష్ఠాత్మకమైన బీటెక్ డిగ్రీలు పొందారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ మాట్లాడుతూ అత్యాధునిక పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యంతో ఆయుధాలు కలిగి ఉన్న యువ అధికారులు జాతీయ భద్రతకు గణనీయమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కఠిన శిక్షణతో యువ అధికారులంతా టెక్నో వారియర్స్‌గా మారారని అభినందించారు.

వానాకాల విపత్తులకు సిద్ధం కావాలి

- అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వర్షాకాలంలో సంభవించే ఎలాంటి విపత్తుల నుంచైనా ప్రజలను కాపాడేందుకు సంసిద్ధంగా ఉండాలని అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల డీఎఫ్‌వో (డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్స్), ఇతర ఉన్నతాధికారులతో గచ్చిబౌలిలోని అగ్నిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యల్లో వినియోగించే సామగ్రిని సిద్ధం చేసుకోవాలని, ఇతర ప్రభుత్వశాఖలతో సమన్వయంతో ఉండాలని ఆదేశించారు. సహాయక చర్యల్లో పాల్గొనే ఫైర్ సిబ్బంది పీపీఈ (పర్సన్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్)లు ధరించేలా జిల్లా ఫైర్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపకశాఖ వాహనాలు సైతం ఎలాంటి మరమ్మతులు లేకుండా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో 101 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇచ్చేలా ప్రజల్లో అవగాహన పెంచాలని డీజీ నాగిరెడ్డి పేర్కొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం అంధకారమే

నిట్ మాజీ విద్యార్థి నవీన్ నాయక్ పశ్చాత్తాపం

- ఏడేళ్లుగా ఇంటికి వెళ్లడం లేదని వెల్లడి..తల్లిదండ్రులకు క్షమాపణ
- మాదాపూర్‌లో నాయక్ సహా నలుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు
- వెల్లడించిన టీజీఎన్‌ఏబీ ఎస్పీ

'డ్రగ్స్'పై 8712671111 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి



గంజాయి కేసు వివరాలను వెల్లడిస్తున్న తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య, మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి (హైదరాబాద్): 'చెడు స్నేహాల వల్ల నేను డ్రగ్స్‌కు బానిసనయ్యా. తల్లిదండ్రులు ఎంత చెప్పినా మారలేదు. చదువు మధ్యలోనే మానేశా. జీవితం అంధకారంగా మారిపోయింది. యువత డ్రగ్స్ బారిన పడొద్దు..' అంటూ నిట్ మాజీ విద్యార్థి నవీన్ నాయక్ చెప్పిన మాటలు ఆలోచింపజేస్తున్నాయి. వివరాలివి. హైదరాబాద్ బోయినపల్లికి చెందిన కురుమ్‌తోత్ రాథోడ్ నవీన్ నాయక్ (27) చదువులో చురుకుగా ఉండేవాడు. 2015లో ఆలిండియా 800వ ర్యాంక్ సాధించి ట్రిచి (తిరుచిరాపల్లి) ఎన్ఐటీలో చేరాడు. అయితే చెడు సహవాసాలతో మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు ఎంతో నచ్చచెప్పారు. అయినా పెడచెవిన పెట్టాడు. 2018లో చదువు మానేసి బెంగళూరులో మార్కెటింగ్ రంగంలో పని చేసినా ఆదాయం లేకుండా పోయింది. దీంతో డ్రగ్స్ పెడ్లర్‌గా మారాడు. ఈ క్రమంలోనే 2022లో ఎండీఎంఏ డ్రగ్‌ను వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి సప్లయ్ చేయడంతో దుండిగల్ పీఎస్‌లో కేసు నమోదైంది. 2023లో కేరళలోని పలక్కడ్ పీఎస్‌లో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులో శిక్ష పడింది. తాజాగా మాదాపూర్ పీఎస్ పరిధిలో గంజాయి సేవించేందుకు వెళ్లి పోలీసులకు చిక్కాడు.


గంజాయి సేవించిన వారి నుంచి మూత్ర నమూనాలు సేకరించిన టెస్ట్ కిట్‌లు

ఒత్తిడిని అధిగమించాలి

విద్యార్థులు ఒత్తిడి పేరిట డ్రగ్స్‌కు బానిస కావద్దని, వ్యాయామం, యోగా లాంటివి చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించాలని నవీన్ నాయక్ చెప్పాడు. భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మీడియాతో మాట్లాడుతూ విజ్ఞప్తి చేశాడు. తల్లిదండ్రులు తనకెంతో చేశారని, వారు చెప్పిన మాటలు పెడచెవిన పెట్టి జీవితం నాశనం చేసుకున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఏడేళ్లుగా ఇంటికి వెళ్లడం లేదని చెబుతూ తల్లిదండ్రులను క్షమాపణ కోరాడు.

ముగ్గురికి పాజిటివ్

మాదాపూర్‌లోని హైటెక్స్ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక పోలీసులతో కలిసి 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య తెలిపారు. దూద్‌బౌలికి చెందిన డ్రగ్ పెడ్లర్ మోటికర్ సిచ్చితానంద్ అలియాస్ సచిన్ (28)తో పాటు గంజాయి సేవించిన కురుమ్‌తోత్ నవీన్ నాయక్, ప్రణీత్ రెడ్డి, రాహుల్‌రాజ్‌ను అరెస్టు చేశామని చెప్పారు. మరో డ్రగ్ పెడ్లర్ ధూల్‌పేట్‌కు చెందిన రాజా పరారీలో ఉన్నాడన్నారు. శనివారం మాదాపూర్ డీసీపీ వినీత్‌తో కలిసి కేసు వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ముగ్గురూ గంజాయి తాగినట్లు తేలిందని (పాజిటివ్) తెలిపారు. డ్రగ్స్ సేవించిన వారు తప్పించుకోలేరని, రక్తపు నమూనాల ఆధారంగా పట్టుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా పెట్టాలని సూచించారు. పీజీ హాస్టళ్లలోనూ తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ రహిత నగరంగా మార్చేందుకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు కానీ, సేవిస్తున్నట్లు కానీ తెలిస్తే 8712671111 ఫోన్ నంబర్‌లో సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వారి పేర్లను గోప్యంగా ఉంచడంతో పాటు రివార్డులు అందిస్తామన్నారు. కాగా మాదాపూర్ జోన్ పరిధిలో డ్రగ్స్‌పై నిఘా పెట్టినట్లు డీసీపీ వినీత్ తెలిపారు. యాంటీ డ్రగ్ కమిటీలు యాక్టివ్‌గా పని చేస్తున్నాయన్నారు. గచ్చిబౌలి పీఎస్ పరిధిలో గంజాయి డాన్ నీతూ బాయ్ ఆస్తులు అటాచ్ చేశామని, ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో టీజీఏఎన్‌బీ డీఎస్పీ రమేష్, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ బంగారం స్వాధీనం సబబే

సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: రూ.2 కోట్లకుపైగా విలువజేసే తమ బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారంటూ దాఖలుచేసిన పిటిషన్లలో కస్టమ్స్ చర్యను హైకోర్టు సమర్థిస్తూ పిటిషన్లను కొట్టివేసింది. తమ నుంచి 2023, ఆగస్టు 12న కస్టమ్స్ అధికారులు 3.8 కేజీల బంగారాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని షేక్ ఆరిఫ్, షేక్ మహమ్మద్ సిద్ధికి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తమకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సామ్ కోశీ, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్లు బ్యాంకాక్‌లో లీగల్‌గా బంగారాన్ని కొనుగోలు చేశారన్నారు. కస్టమ్స్ తరఫున సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్ డొమినిక్ ఫెర్నాండెజ్ వాదనలు వినిపిస్తూ.. 'దేశంలో బంగారం స్మగ్లింగ్‌లో వారిపై ఆరోపణలున్నాయి. డ్యూటీ చెల్లించే ఉద్దేశం ఉంటే రూ. 2 కోట్లకుపైగా విలువైన బంగారాన్ని నల్లటి టేప్‌తో చుట్టి ప్యాంట్ జేబుల్లో తీసుకురావాల్సిన అవసరం లేదు. దానికి సరైన ఇన్‌వాయిస్‌లు కూడా లేవు. అసలు వారి వద్ద కస్టమ్స్ డ్యూటీ చెల్లించడానికి నగదు కూడా లేదు' అని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారుల నిర్ణయం సరైందేనంటూ పిటిషన్లను కొట్టివేసింది.

అద్భుత విజయానికి అభినందనలు

టీం ఇండియాకు సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, పొన్నం శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: భారత క్రికెట్ జట్టుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు శుభాకాంక్షలు తెలిపారు. టీ20 ప్రపంచ కప్‌ను గెలవడం ద్వారా టీం ఇండియా దేశానికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టిందని.. ఇది మనమంతా గర్వించదగ్గ తరుణమని కొనియాడారు. ప్రపంచ క్రికెట్‌లో భారత్‌కు ఎదురేలేదని మరోసారి నిరూపితమైందని అన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌కు సమాయత్తం

- రేపటినుంచి నెలపాటు రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్
- బాలకార్మికులు, వెట్టిచాకిరి, యాచకుల్ని గుర్తించనున్న ప్రత్యేక బృందాలు



సాక్షి, హైదరాబాద్: బాలకార్మికులు, వెట్టిచాకిరీ, యాచన చేసే చిన్నారులు, అదృశ్యమైన బాలలను గుర్తించేందుకు ఆపరేషన్ ముస్కాన్ పేరిట జూలై 1 నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో కూడిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సిబ్బందితోపాటు కార్మికశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, పాఠశాల విద్య, ప్రజారోగ్య, లీగల్ సర్వీస్ అథారిటీతోపాటు ఎన్జీవోలు ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటాయి. మొత్తం 120 సబ్ డివిజనల్ కమిటీలు ఈ స్పెషల్ డ్రైవ్‌ను ఈనెల 31 వరకు కొనసాగించనున్నాయి. నెలపాటు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్‌కు సంబంధించి సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో అన్ని భాగస్వామ్య విభాగాల అధికారులు పాల్గొని క్షేత్ర స్థాయి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. తప్పిపోయిన చిన్నారుల జాడ కనిపెట్టేందుకు తెలంగాణ పోలీసులు వినియోగిస్తున్న దర్పణ్ పరిజ్ఞానాన్ని సైతం ఈ డ్రైవ్‌లో అధికారులు వినియోగించనున్నారు. ఈ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో గుర్తించే చిన్నారుల వివరాలు నమోదు చేయడంతోపాటు అదృశ్యమైన చిన్నారుల కేసుల గణాంకాలను సరిపోల్చి చూస్తారు. ఇలా చేయడంతో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అదృశ్యమైన చిన్నారుల కేసులు సైతం పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

వైఫై రూటర్స్ తయారీలోకి సెల్‌కాన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీలో ఉన్న సెల్‌కాన్ గ్రూప్.. వైఫై–6 రూటర్ల విభాగంలోకి ప్రవేశిస్తోంది. టెలికమ్యూనికేషన్స్ ఎక్విప్‌మెంట్ దిగ్గజం జడ్‌టీఈ టెలికంతో.. సెల్‌కాన్ గ్రూప్ అనుబంధ సంస్థ సెల్‌కాన్ రిసొల్యూట్ చేతులు కలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వద్ద ఉన్న తిరుపతి ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో కొత్తగా ఏర్పాటయ్యే ప్లాంటులో ఆగస్ట్ నుంచి వైఫై–6 రూటర్లను ఉత్పత్తి చేస్తారు. నెలకు 2 లక్షల యూనిట్ల తయారీతో మొదలై.. డిసెంబర్‌కల్లా 5 లక్షల యూనిట్ల స్థాయికి ఉత్పత్తిని చేర్చడంతోపాటు విదేశాలకు సరఫరా చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జడ్‌టీఈ టెలికం సీఈవో లేవో ఛావ్, సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ వై.గురు, రిసొల్యూట్ గ్రూప్ ఫౌండర్, సీఎండీ రమీందర్ సోయిన్ ఈ వివరాలను శనివారం వెల్లడించారు. రూటర్ల తయారీ ద్వారా నూతనంగా 1,000 మంది వరకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వై.గురు తెలిపారు.

యూజీ నీట్ అభ్యర్థులకు కోచింగ్ సెంటర్ల వల!

మళ్లీ నీట్ పరీక్ష నిర్వహిస్తారంటూ అభ్యర్థులకు ఫోన్‌లు

- షార్ట్‌టర్మ్ కోర్సుల్లో చేరితే ప్రత్యేక రాయితీలంటూ ఆకర్షణ
- రాష్ట్రస్థాయి ర్యాంకులు ఇవ్వక పోవడంతో అభ్యర్థుల్లో గందరగోళం



సాక్షి, హైదరాబాద్: 'యూజీ నీట్ పరీక్ష రద్దు అవుతుంది. కొత్తగా మళ్లీ పరీక్ష నిర్వహించనుంది. అందుకే షార్ట్‌టర్మ్ కోర్సు ప్రారంభించాం. మీ అమ్మాయిని వెంటనే చేర్పిస్తే ఫీజు కూడా రాయితీ ఇస్తాం' రెండ్రోజుల కిందట ఓ ప్రముఖ నీట్ కోచింగ్ సెంటర్ నుంచి విద్యార్థి తండ్రికి వచ్చిన ఫోన్‌కాల్ ఇది. ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించి యూజీ నీట్ ప్రవేశాలపై తీవ్ర గందరగోళం నెలకొంది. నీట్ పరీక్షలో కొందరు అదనపు మార్కుల ప్రయోజనం, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం, టాప్ ర్యాంకులపై రగడ తదితర అంశాలతో దేశవ్యాప్తంగా తీవ్ర అయోమయ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని కొన్ని కోచింగ్ సెంటర్లు క్యాష్ చేసుకునే దిశగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. నీట్ పరీక్ష రద్దు కానుందని, మళ్లీ కొత్తగా పరీక్ష నిర్వహిస్తారనే ప్రచారానికి ఊపందిస్తూ షార్ట్ టర్మ్ కోర్సులను ప్రారంభిస్తున్నాయి. నీట్ పరీక్ష రాసిన అభ్యర్థులను ఈ కోర్సుల్లో చేరాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఫీజు తక్కువంటూ బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మే 5న జరిగిన యూజీ నీట్–2024 పరీక్షకు దేశవ్యాప్తంగా 571 నగరాల్లో 4,750 కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 23 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఇందులో రాష్ట్రం నుంచి 1.05 లక్షల మంది పరీక్ష రాసినట్లు అంచనా.

రూ.25 వేల నుంచి రూ.30 వేల ఫీజు

యూజీ నీట్–2024 ప్రవేశాల ప్రక్రియ జూలై 6 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. కానీ నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై తీవ్ర దుమారం కావడం, ప్రతిపక్షాల నిరసన ఏకంగా పార్లమెంటును స్తంభించే పరిస్థితి నెలకొనడంతో అన్ని వర్గాల్లోనూ అయోమయం నెలకొంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం రోజురోజుకు తీగ లాగితే డొంక కదిలినట్లు కనిపిస్తుండటంతో కౌన్సెలింగ్ నిర్వహిస్తారా? లేదా కొత్తగా పరీక్ష నిర్వహిస్తారా? అనే సందిగ్ధంలో విద్యార్థులున్నారు. మరో వారం రోజుల్లో నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా ఇంకా రాష్ట్రస్థాయి ర్యాంకులు విడుదల కాలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. మరోవైపు మెరుగైన మార్కులు వచ్చినప్పటికీ విద్యార్థులకు లక్షల్లో ర్యాంకులు రావడంతో సీటు వస్తుందా? రాదా? అంచనా వేసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కొత్తగా పరీక్ష నిర్వహిస్తారనే ప్రచారం ఊపందుకోవడంతో అప్పటివరకు ఖాళీగా ఉండలేక షార్ట్‌టర్మ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. షార్ట్ టర్మ్ కోర్సు కోసం ఒక్కో కోచింగ్ సెంటర్ రూ.25 వేల చొప్పున వసూలు చేస్తుండగా.. కొన్నిమాత్రం రూ.30 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. పరీక్ష నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా కోర్సుల్లో చేరి డబ్బులు వృథా చేసుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు.



మనోళ్లు వీడియో షాపింగ్‌లోనూ ముందంజ

- టాప్–5లో ఢిల్లీ, బెంగళూరు, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా
- వీ–కామర్స్ (వీడియో కామర్స్)ను అందిపుచ్చుకుంటున్న వైనం
- వీ–కామర్స్ వైపు మొగ్గుచూపుతున్న ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు
- తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మనోళ్లు వీ–కామర్స్ (వీడియో కామర్స్)లోనూ దుమ్మురేపుతున్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ఓ అడుగు ముందే ఉంటున్న భారత యువతరం వీ–కామర్స్‌లోనూ ముందుకు సాగుతోంది. టెక్, డిజిటల్, ఆన్‌లైన్ షాపింగ్‌లో ముందంజలో ఉంటున్న భారతీయులు వీ–కామర్స్‌ను సైతం సులభంగా అందిపుచ్చుకుంటున్నారు. వీడియో మాధ్యమం ఆధారంగా భారత కస్టమర్లు వీ–కామర్స్ ఆఫర్లు, డీల్స్‌ను పరిశీలిస్తున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇప్పటికే అత్యధికంగా ఇంటర్నెట్ డేటా వినియోగిస్తున్న దేశాల్లో భారత్ ఒకటన్న విషయం తెలిసిందే. 2023 జూన్–2024 మే మధ్యలో ఇంటర్నెట్‌లో మనవాళ్లు 20 లక్షల గంటలకుపైగా ఈ డీల్స్, ఆఫర్స్‌ను సమీక్షించినట్టుగా వెల్లడైంది. ఈ విషయంలో దేశీయంగా చూస్తే టాప్–5 నగరాల్లో ఢిల్లీ, బెంగళూరు, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా నిలిచాయి. ఇంతేకాకుండా వీ–కామర్స్ వైపు ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాంతాలు (వీరిలో 30 ఏళ్లలోపు వారు, మహిళలు అధికం) కూడా మొగ్గు చూపుతున్నట్టు తేలడం విశేషం. డైరెక్ట్ టు కన్జ్యూమర్ (డీ 2 సీ) బ్రాండ్లు, విక్రయదారులు, రైతులు ఇతర వర్గాల వారు కూడా వీ–కామర్స్ ఆఫరింగ్స్ పట్ల ఉత్సాహం చూపడంతోపాటు ఇందులో తమకు ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయంతో ఉన్నట్టుగా రెడ్‌సీర్ అధ్యయనం నివేదిక స్పష్టంచేసింది. దీనిని ఉటంకిస్తూ... వీడియో కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్, వీ–కామర్స్ పట్ల భారత్‌లో సానుకూల స్పందన పెరుగుతున్నట్టుగా పేర్కొంది. మొత్తంగా వీడియో కామర్స్ పరంగా (ఓవరాల్ వీడియో కామర్స్ ఎంగేజ్‌మెంట్) చూస్తే టయర్ 2, 3 ప్రాంతాల్లోని వారు 65 శాతం దాకా ఉన్నట్టుగా ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. ప్రధానంగా ఫ్యాషన్, బ్యూటీ, పర్సనల్ కేర్, హోమ్ డెకర్, ఫర్నిషింగ్‌పై వీరు దృష్టి పెడుతున్నట్టు తెలిపింది. ఈ ఏడాది తాము నిర్వహించిన ఫార్మర్స్ అల్ఫాన్సో మ్యాంగో డే లైవ్ స్ట్రీమ్ (రైతు నుంచి వినియోగదారుడిని నేరుగా కలిపేలా), బిగ్ భారత్ డీ 2 సీ లైవ్ స్ట్రీమ్, ద ఎండ్ ఆఫ్ సీజన్ సేల్, జీరో అవర్ వంటి కార్యక్రమాలకు మంచి స్పందన రావడంతోపాటు వినియోగదారులు పెద్దఎత్తున కొనుగోళ్లు జరిపేందుకు అవకాశం ఏర్పడిందని పేర్కొంది.

త్వరలోనే ఏఐ ఎండోస్కోపీ

కాంటినెంటల్ హాస్పిటల్స్ సీఎండీ గురు ఎన్. రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో ఎండోస్కోపీ, ప్రాథమిక స్థాయిలోనే పాంక్రియాంటిక్ కేన్సర్ గుర్తింపు వంటివి సమీప భవిష్యత్తులోనే అందుబాటులోకి రానున్నాయని కాంటినెంటల్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్. రెడ్డి చెప్పారు. జన్యు శాస్త్రంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వస్తున్న నూతన వైద్య విధానాలు.. వైద్య రంగాన్ని మరో మెట్టుపైకి తీసుకెళ్తున్నాయన్నారు. హైదరాబాద్ వేదికగా డాక్టర్ గురు ఎన్. రెడ్డి అధ్యక్షతన జాతీయ గ్యాస్ట్రో ఎంటరాలజీ సమావేశాలు రెండో రోజైన శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా గురు ఎన్. రెడ్డి గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ కేన్సర్, పెద్దపేగు, అన్నవాహిక, పాంక్రియాస్ కేన్సర్లను ముందే గుర్తించే పరీక్షలు, వాటికి అనుగుణంగా చేసే సరికొత్త చికిత్సల గురించి వివరించారు. ఫిబ్రవరి నుంచి ఇందుకు సంబంధించిన పరీక్షలు, చికిత్సలను కాంటినెంటల్ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులకు వినూత్న వైద్య చికిత్సలు, చికిత్సా వ్యూహాలపై అవగాహన కల్పించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కేన్సర్ ప్రోగ్రాం మాజీ డైరెక్టర్ కారోల్ సికోరా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జాన్ కీసిల్, డాక్టర్ సేతు బాబు, శివ్ కె. సరిన్, జగన్నాథ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ కేన్సర్ విభాగం డైరెక్టర్ అన్నా షా తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రీయ' ప్రవేశాల్లో ఓబీసీలకు అన్యాయం

సాక్షి, హైదరాబాద్: కేంద్రీయ విద్యా సంస్థల్లో ప్రవేశాల ప్రక్రియలో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ ఆ మేరకు ప్రవేశాల్లో అవకాశం దక్కడం లేదన్నారు. ఓబీసీలకు నిర్దేశించిన 27 శాతం రిజర్వేషన్ కోటా దక్కేలా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందన్నారు. ఈమేరకు శనివారం మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ కేంద్రీయ విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీసీ విద్యార్థుల ప్రవేశాల్లో గందరగోళం కనిపిస్తోందని చెప్పారు. ప్రతిభ గల విద్యార్థులకు కూడా రిజర్వేషన్ కేటగిరీలో ప్రవేశాలు కల్పిస్తుండడంతో ఓబీసీ అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు.

ట్రిపుల్ ఐటీలో మళ్లీ టెన్షన్!


ట్రిపుల్‌ఐటీలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

- ప్లకార్డులతో విద్యార్థుల ఆందోళన
- 'సమస్యల పరిష్కార కమిటీ'కి అనుమతించాలని డిమాండ్
- పట్టించుకోని యూనివర్సిటీ అధికారులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో మళ్లీ టెన్షన్ మొదలైంది. ఆర్జీయూకేటీలో శనివారం విద్యార్థులు ప్లకార్డులతో నిరసనకు దిగారు. తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐవో) ఎక్కడా అంటూ నినాదాలు చేశారు. అయితే విద్యార్థులు చేసిన ఆందోళనల విషయం బయటకు రాకుండా క్యాంపస్ అధికారులు జాగ్రత్త పడుతున్నారు. వారి సమస్యలు బయట సమాజానికి తెలియకుండా ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక క్యాంపస్‌లోని వేలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రెండు మూడురోజుల్లో గతంలో మాదిరిగా విద్యార్థులు మళ్లీ ఉద్యమించే పరిస్థితులు నెలకొన్నాయి.

కమిటీ కోసమే ఫైట్

ఈనెల 22న విద్యార్థులు సమావేశమై పరిష్కారానికి నోచుకోని సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారం కోసం అధికారులకు, విద్యార్థులకు మధ్య వారధిగా ఉండేలా ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. అదేరోజు విద్యార్థులందరూ కలిసి యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారికి దరఖాస్తు ఇచ్చారు. మళ్లీ మంగళవారం మరోసారి సదరు అధికారిని కలిశారు. ఆయన నుంచి స్పందన రాకపోవడంతో వర్సిటీ స్పెషల్ ఆఫీసర్ వద్దకు వెళ్లి విన్నవించుకున్నారు. ఏళ్లుగా వర్సిటీలో ఉన్న సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఒక స్టూడెంట్స్ కమిటీని ఏర్పాటు చేసుకుంటామని కోరారు. దీనికి యూనివర్సిటీ అధికారులు అనుమతించకపోవడంతో విద్యార్థులంతా శనివారం నిరసన చేపట్టారు.

స్టూడెంట్స్ కౌన్సిల్ లేదు..

బాసర యూనివర్సిటీలో రెండేళ్ల క్రితం వరకూ స్టూడెంట్స్ గవర్నింగ్ కౌన్సిల్ (ఎస్‌జీసీ) ఉండేది. విద్యార్థులే ఈ కమిటీని ఎన్నుకొని అధికారులకు తెలియజేసేవారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిల్ ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు దోహదపడేది. రెండేళ్ల క్రితం ఈ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పట్లో పోలీసు వలయాన్ని తప్పించుకుని ప్రహరీగోడ దూకి వర్సిటీలోకి వచ్చి విద్యార్థులకు మద్దతు పలికారు. ఆ తర్వాత అప్పటి ప్రభుత్వం ఆ విద్యార్థులపై కేసులు నమోదు చేయించి, ఎస్‌జీసీని నామరూపాలు లేకుండా చేసింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులు కొత్త కమిటీ ఏర్పాటు కోసం ఒత్తిడి చేస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.